
Cat-1428

# నీడతో యుద్ధం

## నాస్తిక వాదంలో వున్న 9 లోపం




1.8
10727
727

రంగనాయకమ్మ

# నీడతో యుద్ధం

(నాస్తిక వాదంలో వున్న లోపం)

(సి. ఐ. వాదనలకు మార్క్సిజం ఇచ్చే జవాబు)

రంగనాయకమ్మ

స్వీట్ హోమ్ పబ్లికేషన్స్
విజయవాడ

6657
Cat 1424

స్వీట్ హోమ్ పబ్లికేషన్స్
ప్రచురణ నెం. 38

# నీడతో యుద్ధం (వ్యాసం)

రచనా కాలం : 1980 అక్టోబర్

1వ ముద్రణ : 1980 డిసెంబర్
2వ ముద్రణ : 1988 ఆగస్టు

211.8
రంగ... నీడ

ధర : 5 రూ. లు

సుందరయ్య గ్రంథాలయం
A C No. ..............
హైదరాబాద్-5

ప్రతులకు
అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ-520 002

ముఖచిత్రం : ప్రభంజన్

ముద్రణ :
చైతన్య ప్రింటర్సు
రామచంద్రరావురోడ్డు
విజయవాడ-2

రంగనాయకమ్మ అడ్రసు
పి-44 : సొసైటీ బావిదగ్గిర
ఫిల్మ్‌నగర్ : జూబ్లీ హిల్స్
హైదరాబాదు-500 034

## ఇందులో....


| | | పేజీ నెం. |
|---|---|---|
| | మొదటిముద్రణకు రాసిన ముందుమాట | 4 |
| | 2వ ముద్రణకు ముందుమాట | 10 |
| 1. | మార్క్స్ దృష్టిలో "మత విమర్శ" | 3 |
| 2. | ఎంగెల్స్ సూచించిన "నాస్తిక" ప్రచారం | 10 |
| 3. | నాస్తిక వాదంపై లెనిన్ విమర్శలు | 16 |
| 4. | నాస్తికుల దృష్టిలో "దోపిడీ" | 24 |
| 5. | ఏది ప్రధానం? మౌలిక సమస్యల పరిష్కారమా? "మానసిక వికాసమా?" | 32 |
| 6. | మత విశ్వాసాల స్థానం | 34 |
| 7. | సాంస్కృతిక రంగంలో మార్పులు ఎలా వస్తాయి? | 37 |
| 8. | ఒక తమాషావాదం | 41 |
| 9. | కమ్యూనిస్టు దేశాల్లో "మతం" | 44 |
| 10. | ప్రభుత్వంపట్ల నాస్తిక దృష్టి, విప్లవ దృష్టి | 59 |
| 11. | వర్గచైతన్యం బ్రహ్మపదార్థమా ? | 63 |
| 12. | మరింత విప్లవకారుడు ! | 68 |
| 13. | నా "కపటత్వం" ! | 70 |
| 14. | కొన్ని ఇతర విషయాలు | 74 |


★

# ముందుమాట

## (మొదటి ముద్రణకు రాసినది)

నేను రాసిన "నాస్తికవాదం, హేతువాదం, సత్యమానవవాదం" అనే పుస్తకం చదివి సి. వి., "హేతువాద నాస్తికోద్యమం - రంగనాయకమ్మకి సమాధానం" అనే పుస్తకం రాశాడు. (ప్రచురణ: విశాఖ హేతువాదసంఘం, విశాఖపట్టణం). 4 వ్యాసాలుగల ఆ పుస్తకంలో "రంగనాయకమ్మకి సమాధానం" అనేది 3వ వ్యాసం. 4 వ్యాసాల్లోనూ విమర్శించదగ్గ అంశాలు ఎన్నో వున్నప్పటికీ, నేను మాత్రం "రంగనాయకమ్మకి సమాధానం" అనే వ్యాసానికే పరిమితమవుతున్నాను. దానికే జవాబు చెపుతున్నాను.

నేనిప్పుడు, మొట్టమొదట చెప్పవలసిన విషయం ఈ పుస్తకంలో సి. వి. పట్ల నా ఏకవచన ప్రయోగం గురించి. "నాస్తికవాదం......" పుస్తకంలో నేను ఎవ్వరిగురించీ ఏకవచన ప్రయోగం చెయ్యలేదు, 'ఆయన ఇలా అన్నారు,' 'ఆయన ఇలా రాశారు' అనే పద్ధతిలో బహువచనంలోనే వ్యవహరించాను. ఆ పుస్తకంలో, సి. వి. విషయంలో కూడా నేను ఎలాంటి అమర్యాదకర సూచనలూ చేయలేదు. మార్క్సిజానికీ, నాస్తికత్వానికీ వున్న తేడాని చర్చించడమే ఆ పుస్తకంలో ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నాను గానీ, ఎవ్వరినీ వ్యక్తిగతంగా అవమానించే ధోరణితో ప్రవర్తించలేదు నేను. 'నాస్తిక వాదాన్ని' జోక్ చెయ్యడం మాత్రం ఒకటి రెండు సందర్భాల్లో చేశాను. అది, ఆ సిద్ధాంతంలోవున్న పరస్పర విరుద్ధాంశాల్ని జోక్ చెయ్యడమేగానీ, వ్యక్తుల్ని అవమానించడం కాదు. 'సిద్ధాంతచర్చ' జరిగేటప్పుడు ఎదటి వాదంలోని వైరు

వ్యాల్ని పట్టుకుని హాస్యం చెయ్యడమూ, సీరియస్‌గా విమర్శించడమూ తప్పనిసరి. "ఈ ప్రశ్న లేవనెత్తితేనని, నాస్తికత్వం పట్ల విరసుతుంది" అని చేవన్నా మా అంటే, అది ఆ వాదంలోవున్న లోపాన్ని బయటికి లాగడమేగాని, వ్యక్తుల్ని అవమానించడం కాదు.

ఒక సిద్ధాంతాన్ని నమ్మేవ్యక్తి, తాను నమ్మిన సిద్ధాంతంమీద వచ్చిన వెటకారాల్ని భరించలేకపోతే, ఆ విమర్శలకు సరైన జవాబులు చెప్పి, ఆ వైరుధ్యాల్ని పరిష్కరించేమార్గం చూపించి. ఆ సిద్ధాంతాన్ని విమర్శలనుంచి రక్షించి, ఆ విధంగా 'అవమానం'నుంచి బయటపడాలి.

కానీ, వి. వి. చేసింది అదికాదు.

'నాస్తికత్వాన్ని నేలచేసింది, ఈమె' అంటూ, 'నాస్తికత్వం'జోలికి ఎవ్వరూ రాకూడదన్నట్టు, సిద్ధాంతచర్చ వదిలేసి తిట్ల పంచాంగం తెరిచాడు.

నేను తన విషయంలో మర్యాదగా ప్రవర్తిస్తే, తను నా విషయంలో మరీ రోతగా ప్రవర్తించాడు. 'రాసింది' 'చెప్పింది' అని ఏక వచన ప్రయోగం చేశానన్నదే కాదు నా తప్పయినట్టు, ఇంత సంస్కార హీనమైన ధోరణి ప్రదర్శించాడు. ఆమె అన్నారు, చెప్పారు—అంటూ నన్ను చాలా గౌరవించిన సందర్భాలుకూడా కొన్ని వున్నాయి. కానీ, అవి వెటకారంగా, వ్యంగ్యంగా మాట్లాడిన సందర్భాలే.

వి. వి., నాపట్ల ప్రదర్శించిన ధోరణి ఇలా సాగింది.

పేజీ: 30. "ఈమె నాకు బ్రహ్మాండమైన జనరల్ మాత్రికరణ విసిరి పారేశారు."

పేజీ: 31. ...."ఈమె నాకు బ్రహ్మాండమైన విమర్శకూడా చేశారు."

పేజీ: 31. "...హేతువాద-నాస్తిక ఉద్యమంపై ఎంతో ధ్వజమెత్తారు"

పేజీ: 34. "ఈ ఉద్యమంతో ఏనాడూ పీసమెత్తు సంబంధంలేని రంగనాయకమ్మగారు, ఈ ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని రంగనాయకమ్మగారు, ఈ ఉద్యమం గూర్చి తనకు తెలుసునన్నట్లు నటిస్తే, నీచమైన అభాండాలు వెయ్యడానికి నేడు సిద్ధమైంది.

పేజీ: 34. "ఇంతటి నీచమైన అభాండాన్ని ఈమె హేతువాద-నాస్తికోద్యమం పై ఎంచేత వేస్తోంది ?"

పేజీ: 34. "కొత్త వైష్ణవుడికి పంగనామా లెక్కువన్నట్లు, మార్క్సిస్ట్ పారిభాషికపదజాలాన్ని చిలకపలుకుల్లావల్లించడం నేర్చుకొన్న ఈమె, మార్క్సిస్టుల్లో నాస్తికులు లేనట్లూ, నాస్తికులకి మార్క్సిజం తెలియదన్నట్లూ ఈమె దబాయించయత్నిస్తోందా? ఆంధ్రదేశంలోని మార్క్సిస్ట్ జ్ఞానపీఠానికి తాను అధిపతినని ఈమె తల పోస్తోందా ?

పేజీ: 39. "........ హేతువాదం - నాస్తికోద్యమం కేవలం బూర్జువా సంస్కరణవాదం. మాత్రమేనని బుకాయించడం భాషతో వ్యభిచరించడమే కాగలదు."

పేజీ: 43. "ముష్టిమీద తంతే మూతిపళ్ళు రాలాయనే తర్కశాస్త్ర పాండిత్య శౌండీర్యంతో ఈమె ఎవర్ని తప్పుదోవన పట్టించదలచింది?"

పేజీ: 44. "........వరప కంతిరితర్కంతో, తిమ్మిని బమ్మిని-బమ్మిని తిమ్మిని చేయడానికి రంగనాయకమ్మగారు పడరాని పాట్లు పడుతోన్నారు."

పేజీ: 44. "ఇలాంటి కుంతవాదనలు చేసేవారు లెనిన్ కాలంలోకూడా కొందరుండేవారు."

పేజీ: 51. "గాజు కిటికీం వెనక కూర్చుని, స్వయంనిర్మిత విప్లవ స్వప్న సీమల్లో విహరించే వారికి...."

పేజీ: 52 "...... పడికట్టురాళ్ళను ఘంఘాను ఘంఖంగా వాడుతో తన అమోఘమైన మార్క్సిస్ట్ సిద్ధాంత పాండిత్యాన్ని ప్రద ర్శించడం ద్వారా ఈమె ఎవర్ని హడలం గొట్టేందుకు సిద్ధ మైంది? మార్క్సిస్ట్ సిద్ధాంతంపై యింతటి వల్లమాలిన అభిమానం వలక బోస్తున్న ఈమె...."

పేజీ: 53. ....."కృతిమించిన అహంకారం ప్రదర్శించడం ........"

పేజీ: 53 తన పుర్రెలో పుట్టిన తిక్క తెలివితో 'సమ సమాజ నాస్తికులు' యిత్యాది ముద్దుపేర్లని తగిలించి, కృత్రిమ భేదాల్ని కల్పించి, వారిలో వారికి తంపులుబెట్టి, తమాషా చూడ్డానికి ఈమెవిఫల ప్రయత్న మేదైనా చేస్తోందా?

పేజీ: 54. " ఇలాంటి దివాళాకోరు వాదనల్ని చేయడానికి ముందుకొచ్చిన ఈమె. ఎవర్ని మోసగించాలని యత్నిస్తోంది?"

పేజీ: 57. "....వాదన కోసమే వాదన చేసే ఈమె గంటల తరబడి గాలితో పోట్లాడి, రోజుల తరబడి గోడతో మాట్లాడగలదు. ఈ నిరర్థకమైన వాదనల్తో కాయితాల్ని ఖరాబు చేయగలదు. తెలిసినవాడికి చెప్పవొచ్చు, తెయనివాడికి చెప్పవొచ్చు. తెలిసీ తెలియని మూర్ఖుడికి చెప్పడం చాలా కష్టం."

పేజీ:58. "... హేతువాద— నాస్తికోద్యమంపై ఎందేత పేడ కళ్ళాపు కొట్టడానికి సిద్ధమైంది? తాను చేసినవని గొప్పదీ - నాస్తికులు చేసేది తప్పుదార్లు పట్టించేదీ అనే దురహంకార పూరితమైన అవగాహనే ఇందుకు కారణమా?"

పేజీ: 58. "ఏమిటీతర్కం? ఏమిటీకట్టలుతెంచుకున్న దురహంకారం?"

పేజీ: 60. "....అలాంటి బావిలోని కప్పల్ని సానుభూతితో క్షమించడం మినహా మనేం చేయగలం?"

పేజీ: 60. "...ఈమెఅవర కొలంబస్‌లా మరోఅపూర్వమైన డిస్కవరీ చేసింది!"

పేజీ: 62. "నాస్తిక సిద్ధాంత బద్ధశత్రువులు సైతం ఆడని అబద్ధాల్ని, రంగనాయకమ్మగారు నిర్భీతిగా ఆడడానికి సిద్ధపడ్డారు. వొక వ్యక్తి, ఎన్నడూ చెప్పని వాటిని చెప్పారనీ, చెప్పిన వాటినిచెప్పలేదనీ, తన ఇష్టమొచ్చిన రీతిలో అతని భావాల్ని వక్రీకరిస్తో, తనకు అర్థమైన పద్ధతిలో కాళిదాసు కవిత్వానికి నా పైత్యం కొంత అన్నట్లు స్వంత వ్యాఖ్యానాలు గుప్పితో, తానుచెప్పిందే వేదం — తాను రాసిందే శాస్త్రమనే భావంతో ఈమె విర్రవీగుతోందా?"

పేజీ: 63. "అన్నమంటే సున్నమనీ, సున్నమంటే అన్నమనీ యిష్ట మొచ్చిన పద్ధతిలో అర్థం చేసుకుని, యిష్టమొచ్చిన రీతిలో ఊహించుకొని, తప్పుడు తర్కానికి అనుకూలంగా, నాస్తి కత్వానికి తన సొంత భాష్యం కొంత చేర్చడానికి రంగనాయ కమ్మగారు యత్నిస్తోన్నారు."

పేజీ: 64. "లోకాయతంగూర్చి యామెకున్న అజీర్తి భావాలు ........"

— సిద్ధాంత చర్చలో ఇదే సి.వి. ప్రదర్శించిన వైఖరి! నా మీద విమర్శగా రాసిన 35 పేజీలలోనూ దాదాపు సగానికి పైగా ఇదే ధోరణి! ఇక్కడ చూపించింది కొంతమచ్చుకి మాత్రమే. "నా నాస్తిక వాదం...." పుస్తకంలో నేను సి.వి. విషయంలో మర్యాదగా ప్రవర్తించి నప్పటికీ అతను నా పట్ల ఇంత నీచమైన వైఖరి అవలంబించాడు. కాబట్టి, ఈ

పుస్తకంలో సి.వి. పట్ల ఏకవచనాన్నే వాడుతున్నాను. మర్యాద చూపినప్పటికీ అవమానం చేసిన వ్యక్తి పట్ల మళ్ళీ మర్యాదచూపడమంటే— ఒక చెంప మీదకొడితే ఇంకో చెంప ఇవ్వడమే. అలాంటి ఆత్మాభిమానం లేని పనులమీదా, 'అహింసా సూత్రాలమీదా, ఏమీగౌరవం లేదు నాకు.

సి.వి నామీద చేసిన విమర్శలకు జవాబుగా మళ్ళీ నేనిది రాయడం సి.వి. కోసంగానీ, సి.వి.ల కోసంగానీ కాదు. బూర్జువా భౌతిక వాదులు మార్క్సిజాన్ని గుర్తించడానికి ఎంత మాత్రమూ ఇష్టపడరని మార్క్సిస్టు సిద్ధాంత కర్తలు ఏనాడో స్పష్టంచేశారు. నాస్తికత్వంమీద నేను ఇంతకు ముందు 2 పుస్తకాలు రాయడంగానీ, మళ్ళీ ఇది రాయడంగానీ, కరుడుగట్టిన నాస్తికుల కోసమూ కాదు; మార్క్సిస్టు సిద్ధాంతాన్ని బాగా ఎరిగిన మార్క్సిస్టుల కోసమూ కాదు, మార్క్సిజాన్ని కొత్తగా నేర్చుకుంటూ, నాస్తికత్వానికీ, మార్క్సిజానికీ సిద్ధాంత పరమైన తేడాలు తెలీక, రెంటినీ ఒక్కలాగే అర్థంచేసుకుని తికమక పడే మార్క్సిస్టుల కోసమూ ఆచరించడానికి సరైన మార్గం తెలీక, నాస్తిక వాదాన్నే అభ్యుదయ సిద్ధాంతంగా ఎంచి, దానికే ఆకర్షితులై వుండే అమాయక నాస్తికుల కోసమూ మాత్రమే.

ఈ రెండు తరహాల వారూ కూడా సి.వి. లేవనెత్తిన కొన్ని ప్రశ్నలకు తప్పనిసరిగా జవాబులు తెలుసుకోవాలనుకుంటారు. అందుచేత అటువంటి పాఠకుల కోసం మళ్ళీ ఇది రాయడం నా బాధ్యత.

రంగనాయకమ్మ

14-11-80

★

# 2వ ముద్రణకు 'ముందుమాట'

సి.వి. రాసిన "........ రంగనాయకమ్మకు సమాధానం" అనే పుస్తకానికి జవాబుగా నేను "పీడతో యుద్ధం" రాశాను కదా?

ఈ పుస్తకానికి జవాబుగా సి.వి. మళ్ళీ "........ రంగనాయకమ్మకు మళ్ళీ సమాధానం" అని ఇంకో పుస్తకం రాశాడు.

సి.వి. రాసిన "........ సమాధానాని"కి నేను జవాబు రాయలేదు. అందులో జవాబు ఇవ్వదగ్గ కొత్త పాయింట్లేమీ లేవు. అందులో విషయాలకు జవాబు ఇవ్వాలంటే "పీడతో యుద్ధం"లో చెప్పిన విషయాలే మళ్ళీ చెప్పాలి. చెప్పిన విషయాలే మళ్ళీ చెప్పి ఏం లాభం? సి.వి. ఇచ్చిన "మళ్ళీ సమాధా"నికికూడా "పీడతో యుద్ధం" లో వాదనలే సరిపోతాయి. ఇవే సరిపోకపోతే ఇక ఎన్ని జవాబులు చెప్పినా సరిపోవు. కాబట్టి సి.వి. రాసిన రెండో పుస్తకానికి జవాబు ఇవ్వలేదు.

రంగనాయకమ్మ

4 8 1988

★

# నీడతో యుద్ధం

నేను రాసిన "నాస్తికవాదం, హేతువాదం, నవ్యమానవ వాదం" పుస్తకం మీద నాస్తికుడైన సి. వి. చేసిన విమర్శలకు జవాబు చెప్పడమే ఇప్పటి వ్యాసం ఉద్దేశ్యం కాబట్టి, నా పుస్తకంలో వున్న విషయమేమిటో ముందు చాలా క్లుప్తంగా చెపుతాను.

నా పుస్తకం సారాంశం ఇదీ:

నాస్తికవాదం, హేతువాదం, నవ్యమానవ వాదం- వంటి వాదాలు ప్రకృతి శాస్త్రాన్నే పట్టించుకుంటాయి గానీ, వర్గ భేదాల గురించీ, శ్రమ దోపిడీ గురించి చెప్పే సామాజిక శాస్త్రాన్ని పట్టించుకోవు.

మానవుల మనసుల్లోంచీ ముందు మత మౌఢ్యం పోవాలంటాయి, ఈ వాదాలు. 'మతం' ఎందుకు వుందో, దాని భౌతికమూలం ఏమిటో గ్రహించి, ఆ మూలాన్ని (దోపిడీని) నాశనం చేసినప్పుడే మతం నాశన మౌతుందిగానీ, పైపై విషయాల్లో కలిగించే నాస్తిక భావాలవల్ల మతం నాశనం కాదనే సంగతి ఈ వాదాలు గ్రహించవు.

ఈ సమాజానికి పునాదిగావున్న దోపిడీని సరైన పద్ధతిలో ఎదుర్కొనని సిద్ధాంతాలు ఎన్నివున్నా, అవి సమాజ సమస్యల్ని ఎంతమాత్రం పరిష్కరించలేవు.

దోపిడీ గురించీ, వర్గ భేదాల గురించీ జ్ఞానం ఇవ్వగలిగిన సిద్ధాంతం మాత్రమే ఆ పని చెయ్యగలదు.

ప్రకృతినీ, సమాజాన్నీ శాస్త్రీయంగా అర్థం చేసుకున్న సిద్ధాంతం (మార్క్సిజం) ప్రపంచానికి తెలిసిన తర్వాత, నాస్తిక వాదాల్లాంటి వాదాలు

అసమగ్రమైనవీ, సంకుచితమైనవీ అయిపోయాయి. వాటికన్నా అభివృద్ధి కరమైనటువంటీ, సమగ్రమైనటువంటీ, వైరుధ్యాలు లేనటువంటీ, శాస్త్రీయమైనటువంటీ సిద్ధాంతంగా మార్క్సిజం రూపొందింది.

దోపిడీ పీడనలకు గురిఅవుతోన్న ప్రజలకు వర్గచైతన్యంతోపాటు నాస్తిక చైతన్యం కలిగించడంవల్ల వారి మతమౌఢ్యాన్నీ అజ్ఞానాన్నీ నిర్మూలించడానికి వీలవుతుందిగానీ, వర్గ చైతన్యంతో సంబంధం లేకుండా నాస్తిక చైతన్యం కలిగించే ప్రయత్నాలు చేస్తే ఆ ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోతాయి. అందుచేత, జనాలకు వర్గ చైతన్యం కలిగించేపని ప్రధాన విషయంగానూ, నాస్తిక చైతన్యం కలిగించేపని సెకండరీ విషయంగానూ వుండాలనే సంగతిని అర్థం చేసుకుని, ఆచరణలో దానికి తగిన విధంగా వ్యవహరించాలి. దీన్ని ఒప్పుకోకుండా, ఏది ఏమైనాసరే ముందు మత మౌఢ్యాన్నే నిర్మూలించాలనే వాదం చివరికి ప్రజల కేమాత్రమూ వుపయోగపడదు. అంటే, అది ప్రజా వ్యతిరేకులకే వుపయోగపడుతుంది. — ఇదీ నేను "నాస్తిక వాదం...." పుస్తకంలో చెప్పినదాని సారాంశం.

ఆ పుస్తకం మీద సి. వి. చేసిన అతి నీచమైన విమర్శల్లో ప్రధాన విమర్శేమిటంటే— మార్క్సిస్టు సిద్ధాంత కర్తలైన మార్క్సు, ఎంగెల్సు, లెనినూ, నాస్తికవాదం చాలా అవసరమని చెప్తే, నేను దానికి విరుద్ధంగా చెప్పాననేది. తన విమర్శను బలపర్చుకోవడం కోసం సి.వి. మార్క్సు నించీ, ఎంగెల్సునించీ, లెనిన్‌నించీ కొన్ని కొన్ని మాటలు చూపించాడు. తన వాదానికి మార్క్సిస్టు సిద్ధాంత కర్తలే 'సమర్థకులుగా' తెచ్చు కున్నాడు కాబట్టి, సి. వి. చేసిన ఈ విమర్శ గురించే మొట్టమొదట పరిశీ లించడం చాలాఅవసరం. మిగిలిన విమర్శల్ని తర్వాత తేలిగ్గా చూడ వచ్చు.

సి. వి. విమర్శల్ని కొన్ని పాయింట్లుగా విభజించి చర్చిస్తాను.

# 1. మార్క్స్ దృష్టిలో "మత విమర్శ"

నాస్తికవాదం గురించి మార్క్సూ, ఎంగెల్సూ, లెనినూ ఎటువంటి అభిప్రాయాలు ఇచ్చారో చూడాలంటే సి. వి. ఇచ్చిన కొటేషన్లే చూడవచ్చు.

ముందు మార్క్స్ మాటల గురించి చూద్దాం.

"అన్ని విమర్శలకీ నాంది మత విమర్శ" అనీ, "ప్రజలపాలిట మతం నల్లమందు" అనీ— మార్క్స్ అన్నమాటలు చూపిస్తూ, సి. వి. ఇలా అంటున్నాడు— ".... ....మార్క్స్ హెచ్చరించినట్లు, ప్రజల లోంచి మతం మత్తుమందని విస్మరించి, వారిని చైతన్యవంతుల్ని చేయాల్సిన అవసరం లేదా? మతం గూర్చి మార్క్స్ చెప్పిన సూక్తిని పూర్తిగా గంగపాల్జేయడం ఏ రకమైన మార్క్సిస్టు అవగాహన?" అని ప్రశ్నిస్తున్నాడు. (పేజీ 38)

"అన్ని విమర్శలకీ నాంది మత విమర్శ" అన్న కొటేషన్ పూర్తి రూపం ఇలావుంది. ఈ పూర్తిరూపం సి. వి. ఇవ్వలేదు.

"జర్మనీకి సంబంధించి—మతాన్ని విమర్శించడం అంటే అన్నిటినీ విమర్శించినట్టే: మతాన్ని విమర్శించడం అనేది అన్ని విమర్శలకూ నాంది" — ఇదీ పూర్తి కొటేషన్![1]

---

1. ఈ మాటలు మార్క్స్ రాసిన **Contribution to the critique of Hegel's Philosophy of Law. Introduction** లోవి.
ఆ కొటేషన్ ఇలా వుంది:
**"For Germany the criticism of religion is in the main complete, and criticism of religion is the premise of all criticism."**
**(In Marx & Engels. On Religion. Moscow : Progress publishers, 1975. P. 38).**

ఈ పూర్తి కొటేషన్‌లో వించి ప.వి. "జర్మనీకి సంబంధించి" అనే మాటలు పరుగు పరిచేశాడు. తనకు కావలసిన మాటలు మాత్రమే తనకు సపోర్టుగా తెచ్చుకున్నాడు.

"జర్మనీకి సంబంధించి" అని ప్రత్యేకంగా ఎందుకు చెప్పవలసి వచ్చింది? జర్మనీ ప్రత్యేక పరిస్థితి ఏమిటి?

19వ శతాబ్దపు జర్మనీ మీద హెగెల్ తత్వశాస్త్ర ప్రభావం చాలా ఎక్కువగా వుంది. (హెగెల్ జర్మన్ తత్వవేత్త. ఈయన జీవించిన కాలం 1770-1831) ఈ తత్వవేత్త, ప్రకృతినీ సమాజాన్నీ 'దేవుడి వునికికి సంబంధించిన రూపాలు'గా భావించాడు. అంటే, దేవుడు 'ప్రకృతి' అనే రూపంతోనూ, 'సమాజం' అనే రూపంతోనూ వున్నాడనీ, కాబట్టి ఈ ప్రకృతీ సమాజమూ అనేవి దేవుడి రూపాలనీ ఈయన అభిప్రాయం. ఈయన, తన కాలంనాటి ప్రష్యా (జర్మనీ) రాచరిక వ్యవస్థనే రాజకీయాలలో 'అత్యున్నత దశ'గా భావించాడు. ఈ రాచరిక వ్యవస్థ, శత్రువైరుధ్యాలన్నీ అంతరించిన సమాజమనీ, ఈ వ్యవస్థ ఇంకా వున్నత స్థితిలోకి మారేదేమీ లేదనీ, ఇది దేవుడి రాజ్యమనీ ఈయన భావించాడు. 'పరిపాలించడం' అనే అవసరంకోసం, ఏర్పడిన 'రాజ్యాంగ' యంత్రాంగాన్ని ఈ తత్వవేత్త, సమాజ వైరుధ్యాలనించీ పుట్టుకొచ్చిన విషయంగా గాక, సమాజంతో సంబంధంలేని దైవసృష్టిగా తలిచాడు. ఈ రకంగా, హెగెల్ ద్వారా, ఈ తప్పుడు భావాల ప్రభావం అప్పటి జర్మనీమీద బలంగా వుంది.

ఈ విషయాన్నే ఎంగెల్స్ కూడా ఒకచోట ఇలా చెప్పాడు— "జర్మనీలో ప్రత్యేకంచి, రాజ్యాంగ యంత్రం (స్టేట్) గురించిన మూఢ విశ్వాసం, తత్వశాస్త్రంనించి బూర్జువాల ఆలోచనల్లోకి, అభయకి అనేకమంది కార్మికుల ఆలోచనల్లో కూడా పాకింది. ఈ రకమైన తత్వ

శాస్త్రం ప్రకారం చూస్తే, రాజ్యాంగ యంత్రం అనేది 'భావం యొక్క రూపధారణ'. అంటే, 'భూమిపై భగవంతుని రాజ్యం.'"[2]

ఇలాంటి భావాలతో, వున్న శ్రామిక ప్రజలు, రాజ్యాంగాన్ని 'దేవుని రాజ్యం'గా భావించి అదేం చేసినా ఆమోదించే స్థితిలో వున్నారు కాబట్టి, అక్కడ, ఆ కాలంలో, ప్రధానంగా "మత విమర్శ" అవసరమైంది. అందుకే మార్క్స్ ఆ పరిస్థితుల్ని బట్టి — "జర్మనీకి సంబంధించి, మతాన్ని విమర్శించడంఅంటే అన్నిటినీ విమర్శించినట్టే. మతాన్ని విమర్శించడం అనేది అన్ని విమర్శలకూ నాంది" అన్నాడు.

"మార్క్స్ చెప్పింది జర్మనీకే కాదు, మనకి కూడా ఈనాడు వర్తిస్తుంది. రాజు దైవాంశ సంభూతుడూ, విష్ణు అంశ గలవాడే రాజవుతాడూ అనే నమ్మకాలు మన ప్రజలకి కూడా వున్నాయి"—అని ఎవరైనా ఈనాడు వాదిస్తే ఆ వాదం శూన్యంలో వీగి పోతుంది. ఈనాటి మన ప్రభుత్వాన్ని దేవుడి ప్రభుత్వంగా మన ప్రజల్లో ఎవ్వరూ నమ్మటంలేదు.

---

2. ఈ మాటలు, మార్క్స్ రాసిన "ది సివిల్ వార్ ఇన్ ఫ్రాన్స్" అనే పుస్తకానికి ఎంగెల్స్ రాసిన 'ఇన్‌ట్రడక్షన్'లోవి.
ఆ కొటేషన్ ఇలా వుంది—

"........In Germany particularly the superstitious belief in the state has been carried over from philosophy into the general consciousness of the bourgeoisie and even to many workers. According to the philosophical notion the state is the "realization of idea" or the Kingdom of God on earth,...."

(In Marx. The Civil War in France- Moscow: Foreign Languages Publishing House, 1948. P. 25).

'మతాన్ని విమర్శించడం అంటే అన్నిటినీ విమర్శించినట్టే'–అనే మాటలు మన దేశానికెంతమాత్రమూ వర్తించవు. ఈ మాటలు ఈనాటి జర్మనీకి కూడా వర్తించవు.

ఇక్కడ అతి ముఖ్యంగాగమనించవలసింది, 'మత విమర్శ'అనే దాన్ని గురించి మార్క్స్ 'మత విమర్శ' చెయ్యమన్నాడు కదా అని, ఈ నాస్తికులు తమ ధోరణిలో చేసే దాన్ని 'మత విమర్శ' అని చెప్పుకోడానికి వీల్లేదు. మతవిమర్శ అంటే మార్క్స్ అర్థం ఈ నాస్తికులు చేసేది మాత్రమే కాదు. మతానికి సంబంధించిన పైపై విషయాల్ని (పూజా పునస్కారాలూ, మంత్ర తంత్రాలూ, మూఢాచారాలూ వంటి వాటిని) మాత్రమే దుయ్యబట్టి, వాటిని బూతులు తిట్టి, వూరు కోవడమే నాస్తికులు చేసే విమర్శ' గావుంటుంది. మార్క్స్ చెప్పింది అదికాదు. (మార్క్స్ కొటేషన్ తర్వాత ఇస్తాను.)

మత విమర్శ అంటే— మతానికి గల భౌతిక మూలాన్ని గ్రహించి, ఆ మూలాన్ని ఎలా నాశనం చెయ్యడమో గ్రహించి, ఆ జ్ఞానంతో మత నాశనానికి చేసే విమర్శే సరియైన మత విమర్శ.... అని మార్క్స్ అర్థం. ఆ జ్ఞానంతో జరగని విమర్శ మతవిమర్శ కానేకాదు. మతానికి పునాదిగావున్న వర్గ సమాజాన్నీ, దాని రాజ్యాంగ యంత్రాన్నీ నాశనం చెయ్యడానికి పనికి రాని విమర్శ, మతతాలూకు గోటివి కూడా కదపలేదు.

కొందరు మానవులు ఏ శ్రమా చెయ్యకుండా ఇతరుల శ్రమలో అత్యధిక భాగాన్ని దోచుకోవడానికి అనుకూలంగా వున్న ఈ సమాజం, 'తిన్నగా'నిలబడివున్న సమాజంకాదు. ఇది తల్లకిందులుగావున్న సమాజం. ఈ తల్లకిందులుగా వున్నసమాజం, తల్లకిందులుగా వుండే భావాలనే కలిగిస్తుంది. ఆ తల్లకిందుల భావాలలోకొన్ని భావాలు మతము. మతాన్ని నాశనం చెయ్యాలీ అంటే, తల్లకిందులుగా వున్న సమాజాన్ని మొదల

తిన్నగా తిప్పాలి. అలా తిప్పే ప్రయత్నంలో మతానికి వ్యతిరేకంగా జరిగేపోరాటం(ఇన్‌డైరెక్ట్) పరోక్షపోరాటం అవుతుంది.(ఆర్థిక,రాజకీయ రంగాలలో జరిగే పోరాటాలు ప్రత్యక్ష పోరాటాలని మార్క్స్ అర్థం). కాబట్టి,మత విమర్శఅన్నా, మతాన్ని ఖండించడం అన్నా, మతానికి వ్యతిరేకంగా మాట్లాడడం అన్నా - దాని వర్గ మూలాన్నీ, దోపిడీనీ, రాజ్యాంగ యంత్రాన్నీ విమర్శించడం. అలాగాకుండా, భక్తుల్నీ, పూజారుల్నీ, వారి కార్యకలాపాల్నీ తిట్లవర్షంలో ముంచెత్తి'ఇదే మత విమర్శ, మతవిమర్శ చెయ్యమని మార్క్స్ కూడా చెప్పాడు' అని దబాయిస్తే అది మత విమర్శ అవదు.

"జర్మనీకి సంబంధించి — ........ మత విమర్శే అన్ని విమర్శలకూ నాంది" అనే మాటలు మార్క్స్ ఎక్కడైతే చెప్పాడో ఆ మాటల కిందే ఇంకాకొన్ని మాటలు కూడా చెప్పాడు 'మత విమర్శ' అంటే ఏమిటని మార్క్స్ చెప్పాడో చూడండి. "మతానికి వ్యతిరేకంగా చేసే విమర్శకి పునాది ఏమిటంటే — మతాన్ని మానవుడు తయారు చేస్తాడు గానీ, మతం మానవుణ్ణి తయారు చెయ్యదు.

మానవుడు అంటే—మానవ ప్రపంచం.

మానవ ప్రపంచం అంటే — రాజ్యాంగ యంత్రమూ, సమాజమూనూ.

ఈ రాజ్యాంగ యంత్రమూ, సమాజమూ మతాన్ని సృష్టిస్తాయి. అంటే తల్లకిందులుగా వున్న ప్రపంచ జ్ఞానాన్ని సృష్టిస్తాయి. ఎందుచేత తల్లకిందుల జ్ఞానాన్ని సృష్టిస్తాయంటే, అవి తల్లకిందులుగా వున్న ప్రపంచం గనక.

.... .... ....

మతానికి వ్యతిరేకంగా జరిగే పోరాటం అనేది, పరోక్షంగా, ఈ ప్రపంచానికి వ్యతిరేకంగా జరిగేపోరాటం. ఈ ప్రపంచానికి అంటే, ఏ

ప్రపంచమైతే మతం అనేదాన్ని ఆధ్యాత్మిక స్వభావంగా కలిగి వున్నదో ఆ ప్రపంచానికి వ్యతిరేకంగా —జరిగే పోరాటం" — ఇది మార్క్స్ 'మత విమర్శ' గురించీ, 'మత పోరాటం' గురించి ఇచ్చిన అభిప్రాయలు.[3] ఈ మాటల్లో 'తల్లకిందులుగావున్న ప్రపంచం' అంటే అర్థం, 'దోపిడీ జరుగుతోన్న ప్రపంచం' అని. దోపిడీ విధానంతో నడుస్తోన్న ప్రపంచం తల్లకిందుల ప్రపంచం గనక, ఈ తల్లకిందుల ప్రపంచం తల్లకిందులుగా వుండే జ్ఞానాన్నే (ఇక్కడ, మతాన్ని) సృష్టిస్తోంది. కాబట్టి, 'మతం'తో పోరాడ దల్చినవారు ఆ మతానికి మూలకారణమైన 'దోపిడీ విధానంతో ప్రధానంగా పోరాడాలి. మతవిమర్శ అనేది దోపిడీని తుడిచేసే లక్ష్యంతో సాగాలి. మార్క్స్ చెప్పేమత విమర్శకి ఇంత అర్థంవుంది. మార్క్స్ మాటల్నే తనకు ఆసరాగా తెచ్చుకున్న ఎ. వి. చేసే మత విమర్శ మార్క్స్ చెప్పే పద్ధతిలోనే వుందా ? దోపిడీని వ్యతిరేకించే లక్ష్యంతోనే వుందా? —లేదు.

ఎ. వి., ఈ పుస్తకం మీద చేసిన మనతర విమర్శలు అది వింత మోసంతోనే ప్రారంభ మయ్యాయి. మార్క్స్ మాటల్లోంచి 'ఫర్ జర్మనీ' అనే మాటలు మరుగున పెట్టెయ్యడంతోటే: మత

---

3. ఈ మాటలు కూడా మార్క్స్ రాసిన Contribution to the critique f Hegel's Philosophy of Law. Introduction లోవే.

~ కొటేషన్ ఇలావుంది: "The basis of irreligious criticism is: Man makes religion, religion does not make man.... Man is the world of man, the state, society.. This state, this society, produce religion, an inverted world-consciousness, because they are an inverted world.... The struggle against religion is therefore indirectly a fight against the world of which religion is the spiritual aroma"

విమర్శ గురించీ, మతపోరాటం గురించీ మార్క్స్ ఎంతో వివరంగా చెప్పినదాన్ని పట్టించుకోక పోవడంతోటి పి. వి. మోసం ప్రారంభమైంది. ఆయన నిజాయితీ ఈ మొట్ట మొదటి విషయంలోనే తేటతెల్లమయింది.

పి. వి. ఇచ్చిన మార్క్స్ కొటేషనలో రెండో దాన్ని గురించి, 'అంటే ప్రజల పాలిట మతం మత్తుమందు' అనేదాన్ని గురించిచూద్దాం. మార్క్స్ మతాన్ని 'మత్తు మందు' అన్నాడు కదా, అలాంటి మతంతో పోరాడ వద్దా ? అన్నది పి. వి. ప్రశ్న. 'మతం'తో పోరాడవద్దని గానీ, పోరాడనక్కరలేదనిగానీ మార్క్సిస్టులు అనడం లేదు. మార్క్సిజం అనేది భౌతిక వాద సిద్ధాంతమేగానీ 'భగవంతుణ్ని' మతాన్నీ అంగీకరించే సిద్ధాంతంకాదు. కాబట్టి, 'మతంమీద పోరాటం' కూడా మార్క్సిజంలో ఒక భాగంగా వుంటుంది. అయితే ఆ పోరాటం, కేవలం నాస్తికధోరణిలో మాత్రమే వుండకూడదనే మార్క్సిస్టు సిద్ధాంత కర్తలు చెప్పేది.

'మతం'మీద చేసే పోరాటం, మతవిమర్శతో ప్రారంభమై, ప్రజలు ఒక 'విప్లవం' సాధించి రాజకీయాధికారాన్ని చేతుల్లోకి తీసుకున్నప్పుడు, మత పీఠ విహారానికి సంకెళ్ళు వెయ్యడం ద్వారా ముందుకు సాగుతుంది.

మార్క్సిస్టులు 'నాస్తికధోరణి'లో మతపోరాటం చెయ్యరు కాబట్టి, అది మతంమీద పోరాటమే చెయ్యనట్టు నాస్తికులకు కనిపిస్తుంది. మతం మీద తిట్ల వర్షం కురిపిస్తూ, దాని పునాదిని మాత్రం రక్షిస్తూ వుండడమే చాలా గొప్ప 'మతపోరాటం', నాస్తికుల దృష్టిలో.

"మార్క్స్ సూక్తిని గంగపాల్జేయడం ఏ రకమైన మార్క్సిస్టు అవగాహన ?" అని పి. వి. ఎందుకు అడుగుతున్నట్టు ? మార్క్స్ సూక్తిని, రంగనాయకమ్మ గంగపాల్జేసినట్టు నిరూపించాలని పి. వి.

అనుకుంటున్నాడు. ఆ ధైర్యంతోనే — మార్క్సు మత పోరాటం చెయ్యమనలేదా, మతం పత్తమందని చెప్పలేదా?—అని ప్రశ్నిస్తున్నాడు. మత పోరాటం చెయ్యమన్న ముక్కలే పి. వి. కి కావాలిగానీ, ఆ పోరాటం ఏ పద్ధతిలో చెయ్యమని మార్క్సు అన్నాడో అది అక్కర్లేదు పి. వి. కి. మార్క్సు చెప్పిందాన్ని నాస్తికులే పాటిస్తున్నట్టూ, దాన్ని మార్క్సిస్టులే వదిలేసినట్టూ చెప్పడమే పి. వి. అభిప్రాయం.

# 2. ఎంగెల్సు సూచించిన "నాస్తిక" ప్రచారం

పి. వి. చూపించిన ఎంగెల్సు కొటేషన్ ఇది :

"గత శతాబ్దానికి చెందిన ఫ్రెంచి భౌతిక సాహిత్యాన్ని — ఏ సాహిత్యమైతే రూపంలోనూ, విషయంలోనూ ఫ్రెంచివారు సాధించిన గొప్ప విజయంగా ఇప్పటికీ వుందో ఆ సాహిత్యాన్ని—కార్మిక జనాలలో పంపిణీ చెయ్యడానికి శ్రద్ధ వహించాలి." (ఈ కొటేషన్ని పి. వి. ఇంగ్లీషులో మాత్రమే ఇచ్చాడు, దాన్ని నేను తెలుగులో ఇచ్చాను)

ఎంగెల్సు ఈ మాట అన్నాడని పి. వి. ఎందుకు చూపిస్తున్నాడు? ఫ్రెంచి భౌతిక సాహిత్యాన్ని కార్మిక జనాలలో పంపిణీ చెయ్యమన్నాడు కాబట్టి, ఎంగెల్సు నాస్తిక వాదాన్ని అంగీకరించాడనీ, రంగనాయకమ్మ మాత్రం ఎంగెల్సు చెప్పినదానికి విరుద్ధంగా రాసిందనీ రుజువు చెయ్యడం కోసం పి. వి. ఎంగెల్సు మాటలు చూపిస్తున్నాడు. పి. వి., ఏ వ్యాసం లించైతే ఈ మాటలు తీశాడో ఆ వ్యాసంలోనే ఎంగెల్సు 'నాస్తిక దృక్పథం' గురించి చాలా వివరంగా చెప్పిన మాటలు కూడా వున్నాయి. ఫ్రెంచి భౌతికవాద సాహిత్యాన్ని కార్మిక జనాలలో పంపిణీ చెయ్యాలని ఎంగెల్సు చెప్పిన సందర్భం ఏమిటో వివరిస్తాను.

1871లో మార్చి 18న, పారిస్ కార్మికులు, బూర్జువా ప్రభుత్వంపై తిరుగుబాటుచేసి పారిస్ నగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. 70 రోజుల విప్లవ పరిపాలన తర్వాత 'పారిస్ కమ్యూన్' ఓడిపోయింది. అనేక వేల మంది కమ్యూనార్డులు (కమ్యూన్‌కి చెందిన ఉద్యమకారులు) మరణ శిక్షల పొందు్యారు. అనేక వందలమంది కమ్యూనార్డులు ఫ్రాన్స్‌నించి విదేశాలకుపోయి తలలు దాచుకున్నారు. ఆ విధంగా లండన్‌కి వచ్చిన కమ్యూనార్డులు కొందరు, కొంతకాలం తర్వాత, 'ఫ్రాన్స్‌లో మళ్ళీ ఒక కొత్త కమ్యూన్‌ని స్థాపించాలనే' లక్ష్యంతో ఒక కొత్త కార్యక్రమం ప్రకటించారు.

ఆ 'కార్యక్రమ పత్రం' లో వారు—"మేము నాస్తికులము. కమ్యూనిస్టులము. విప్లవకారులము." అని చెప్పుకుంటూ, తమ 'నాస్తికత్వం' ఎటువంటిదో, తమ 'కమ్యూనిజం' ఎటువంటిదో, తమ 'విప్లవత్వం' ఎటువంటిదో ఆ పత్రంలో వివరించి చెప్పారు. అయితే, ఆ 3 విషయాలలోనూ వారి అవగాహన అశాస్త్రీయమైనదిగానే వుంది. (ఆ కమ్యూనార్డులు మార్క్సిస్టులు కారు. బ్లాంక్విస్టులు.)[4]

ఈ కమ్యూనార్డులు ప్రకటించిన 3 విషయాలలోనూ ఎలాంటి పొరపాట్లు వున్నాయో వివరిస్తూ ఎంగెల్స్ 1874లో "కమ్యూన్ నించీ పలుదేశాలకు వలస వెళ్ళిపోయిన బ్లాంక్విస్టుల కార్యక్రమం"అనే పేరుతో ఒక వ్యాసం రాశాడు. ఆ వ్యాసంలో, ఎంగెల్స్, ఆ కమ్యూనార్డుల

---

4. 'బ్లాంక్విస్టులు' అంటే బ్లాంక్వి అనుచరులు. 'బ్లాంక్వి' పూర్తి పేరు 'లూయీ అగస్టు బ్లాంక్వి' (1805–1881). ఈయన ఫ్రెంచి కార్మికనాయకుడు. 'పారిస్ కమ్యూన్' పోరాటంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు. కానీ, ఈయనకు కమ్యూనిజం పట్ల శాస్త్రీయమైన అవగాహన లేదు.

నాస్తిక ధోరణినీ, దానికి కమ్యూనిజంపట్లా, విప్లవతత్వం పట్లా వున్న తప్పుడు అవగాహనన్నీ విమర్శిస్తూ, సరియైన ఆలోచనా ధోరణి ఎలా వుండాలో వివరించాడు. ఎంగెల్స్ చేసిన ఆ విమర్శల్లో నాస్తికత్వంపై చేసిన విమర్శలు మాత్రమే, ఇక్కడ, ఈ సందర్భంలో మనకు అవసరం.

"మేము నాస్తికులము" అని చెప్పుకున్న కమ్యూనార్డులు, కొత్తగా ఏర్పర్చబోయే కమ్యూనులో, 'మతం' విషయంలో ఏమేమీ జాగ్రత్తలు తీసుకోదల్చుకున్నారో తమ కార్యక్రమ పత్రంలో ఇలా వివరించారు.

"గత కాలపు విషాదహాతం నించి, అంటే మానవుల దీనత్వానికి కారణమైన భూతం నించి (దేవుడి నించి) మానవజాతికి కమ్యూన్ శాశ్వతంగా విముక్తి కలిగిస్తుంది. కమ్యూన్‌లో మత గురువులకు స్థానం వుండదు. కమ్యూన్‌లో ప్రతీ మత సంస్థా, ప్రతీ మత కర్మకాండా, నిషేధించ బడాలి." మతాన్ని విర్శించే విషయంలో కమ్యూనార్డులు ప్రకటించిన ఈ 'నాస్తిక దృక్పధం', పొరపాటుగా వుందని ఎంగెల్స్ విమర్శించాడు.

'మానవుల దీనత్వానికి కారణమైన దేవుడనే భూతం' అని కమ్యూనార్డులు అన్నదాన్ని గురించి ఎంగెల్స్ "వునికిలో లేని దేవుడట కారణం!" అని హాస్యంగా అన్నాడు (మానవుల దీనత్వానికి—ఎక్కడాలేని దేవుడు కారణమెలా అవుతాడు. వునికిలో వున్నదేదో కారణం అవ్వాలి గాని—అని ఎంగెల్స్ అర్థం.)

"కమ్యూన్‌లో ప్రతీ మత సంస్థనీ, ప్రతీ మత కర్మకాండనీ నిషేధించాలి" అని కమ్యూనార్డులు అన్నదాన్ని గురించి ఎంగెల్స్ విమర్శిస్తూ, అటువంటి 'ఔత్తర్యం' ద్వారా జనానికి నాస్తిక భావాలు కలిగించడం సాధ్యం కాదనీ: జనాలు ఏ నమ్మకాలనైతే వదిలెయ్యాలో ఆ నమ్మకాల్ని నిషేధించడంవల్లా, ఆ నమ్మకాల్ని పాటించిన వాళ్ళని శిక్షించడం

వల్లా ఆ నమ్మకాల్ని పోగొట్టలేరు సరికదా, వాటిని మరింత గట్టిచెయ్యడమే అవుతుందనీ; మానవులు తప్పనిసరిగా నాస్తికులై వుండాలనే పద్ధతిలో నాస్తికత్వాన్ని ఒక మూఢాచారం లాగా చేస్తే అది దేవుడికి సేవ చెయ్యడమే అవుతుందనీ ఎంగెల్స్ అన్నాడు. ఆ మాటల్ని చూడండి.

"ఏ విషయాన్నయినా కాయితం మీద ఉత్తర్వుగా జారీ చేసెయ్యవచ్చు. అంతమాత్రాన ఆ ఉత్తర్వు అసలు జరిగితీరుతుందని అర్థం కాదు."

"శిక్షించడం అనేది, అవాంఛనీయ విశ్వాసాల్ని మరింత బలపర్చడానికి ఉత్తమమైన మార్గం."

"ఒకటి మాత్రం ఖచ్చితం. ఈనాడు కూడా దేవుడికి చెయ్యగలిగే ఏకైక సేవ ఏమిటంటే, నాస్తికత్వాన్ని తప్పనిసరిగా పాటించవలసిన మూఢాచారం లాగా ('కంపల్సరీ డాగ్మా'లాగా) చెయ్యడం"[5]

ఈ విధంగా, ఎంగెల్స్, కమ్యూనార్డుల నాస్తిక ధోరణిని విమర్శిస్తూ, ప్రజలలో వుండే మత భావాలు పోగొట్టాలంటే, వారికి భౌతిక

---

5. ఈ మాటలు ఎంగెల్స్ రాసిన Programme of the Blanquist Commune Emigrants అనే వ్యాసంలోవి.

ఆ కొటేషన్ ఇలా వుంది :

"....anything can be decreed on paper but that this does not mean that it will be carried out...."

"....persecution is the best means of strengthening undesirable convictions!"

"This much is certain : the only service that can still be rendered to God today is to make atheism a compulsory dogma........"

(In Marx & Engels - Selected Works - Volume Two - Moscow : Progress Publishers, 1973 P. 384).

వాద భావాలు కలిగిస్తూ, వారిని ఎడ్యుకేట్ చేస్తూ ఆ పని సాధించాలని చెప్తూ, ఈ సందర్భంలోనే - "గత శతాబ్దపు ఫ్రెంచి భౌతికవాద సాహిత్యాన్ని కార్మిక జనాలలో పంచాలి" అన్నాడు. ఇదీ, ఆ మాటలకు వెనక చరిత్ర.

సి. వి. లాంటి నాస్తికులు, ఎంగెల్స్ చెప్పినదాంట్లోంచి 'ఫ్రెంచి భౌతికవాద సాహిత్యాన్ని కార్మికులలో పంచాలి' అనే మాటలే తీసుకుంటారు గానీ, 'నాస్తికత్వాన్ని మానవులందరూ తప్పనిసరిగా పాటించాలనే పద్ధతిలో చేస్తే అది దేవుడికి సేవ చెయ్యడమే అవుతుంది. అది మతాన్ని నశించిపోకుండా చెయ్యడమే అవుతుంది' అన్న మాటలు మాత్రం తీసుకోరు. ఈ మాటలు వాళ్ళ చేష్టలకి సపోర్టుగా వుండవుకదా ?

ఎంగెల్స్ ఆ వ్యాసంలోనే ఇంకోచోట, "ఈ రోజుల్లో నాస్తిక వాది కావడం చాలా తేలిక" అని కూడా నాస్తికవాదుల్ని వెటకారం చేశాడు. (....it is easy enough these days to be an atheist). ఇంత స్పష్టంగా ఎంగెల్స్ 'నాస్తికవాద దృక్పథాన్ని' వ్యతిరేకిస్తూవుంటే, ఎంగెల్స్ 'నాస్తికవాదాన్ని' సమర్థించినట్టుగా సి. వి. వాదిస్తున్నాడు.

'ఫ్రెంచి భౌతికవాద సాహిత్యాన్ని కార్మిక జనాలలో పంపిణీచేసి వాళ్ళకి భౌతికవాద జ్ఞానం కలిగించాలి' అని చెప్పడం అంటే, 'నాస్తికులు చేసే నాస్తిక ప్రచారం సరియైనదే,, నాస్తిక ప్రచారం అలాగే జరగాలి' అని అంగీకరించడమా? ఫ్రెంచి భౌతికవాద సాహిత్యాన్ని చదవమన్నాడు కాబట్టి ఎంగెల్స్ నాస్తికుల పద్ధతిని సమర్థించినట్టా ?— ఎంతమాత్రమూ కాదు.

ప్రపంచంలోవున్న భౌతికవాద సాహిత్యమంతా నాస్తికుల సొత్తే అయినట్టూ, భౌతికవాద సాహిత్యంలోంచి జ్ఞానం నేర్చుకోవడం అంటే అది నాస్తికవాదాన్ని అనుసరించడమే అయినట్టు, నాస్తికులు భావిస్తూ

వుంటారు. అందుకే ఫ్రెంచి భౌతికవాదం చదవమని ఎంగెల్సు చెప్పాడు కదా' అనడం.

అవును, చెప్పాడు. ఎందుకు చెప్పాడు? ఆ భౌతికవాదంలో వున్న 'మంచి'నీ జ్ఞానాన్నీ తెలుసుకోమనిగానీ ఆ భౌతికవాద స్థాయిలోనే వుండమని కాదు. అక్కణ్ణించి ఎదగవద్దని కాదు.

ఫ్రెంచి భౌతికవాదం ఇచ్చిన జ్ఞానం మరింత అభివృద్ధిచెంది, కత్తు పై దుర్వ్యాలులేని స్థాయికి చేరి, "గతి తార్కిక భౌతికవాద జ్ఞానం"గా మారింది. అయినప్పటికీ నాస్తికులు ఇంకా ఫ్రెంచి భౌతికవాద కాలంలోనే చతికిలబడి 'మా ఫ్రెంచి భౌతికవాదం' అని మురుస్తున్నారు.

ఎంగెల్సు 'నాస్తిక ధోరణిని' వ్యతిరేకించారని రుజువు చెయ్యడం కోసం నేను 'ఫ్రెంచి కమ్యూనార్డుల వుదాహరణ' చూపించాను. కానీ, ఈ ఉదాహరణని బట్టి ఫ్రెంచి కమ్యూనార్డుల నాస్తికస్థాయీ, ఇప్పటి మన ఆంధ్రదేశపు నాస్తికుల స్థాయీ ఒకేరకంగా వున్నట్టు అర్థం చేసుకో కూడదు. ఫ్రెంచి కమ్యూనార్డులకు 'నాస్తికత్వం' విషయంలో సరైన దృక్పథం లేకపోయినప్పటికీ వారి దృక్పథం ఆంధ్రదేశపు నాస్తికుల దృక్పథమంత తక్కువ స్థాయిలో మాత్రం లేదు. దోపిడీ ప్రభుత్వాన్ని కూలదోసి, రాజకీయాధికారాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాతనే మతాన్ని నిర్మూలించగలము— అనే అభిప్రాయం ఫ్రెంచి కమ్యూనార్డులకు చాలా స్పష్టంగా వుంది. (ఆ నిర్మూలించే విధానం గురించి వారికి సరైన అవగాహన లేకపోవచ్చుగాక.) కానీ మన నాస్తికులకైతే, దోపిడీని వ్యతిరే కించే పరిపాలన ఏర్పడిన తర్వాతనే మతాన్ని నిర్మూలించే పని ప్రాక్టికల్‌గా ప్రారంభించగలము— అనే అవగాహనలేదు. కాబట్టి, ఎంగెల్సు విమర్శలకు గురిమైన ఫ్రెంచి కమ్యూనార్డులూ, మన నాస్తికులూ ఒకే స్థాయిలో వున్నట్టుగా మనం అర్థంచేసుకోకూడదు.

పైగా, ఆ కమ్యూనార్డులు 1874లో వాళ్ళయితే, ఈ నాస్తికులు

1980లో వాళ్ళు! వీళ్ళు 100 సం॥ల తర్వాత వాళ్ళు! ఆ కమ్యూనార్డులు 'మత నిర్మూలన' గురించి ఏమైనా పొరపాటు అభిప్రాయాలు వ్యక్తం చేశారంటే అది చాలా న్యాయం. అందుకే ఎంగెల్స్ కూడా వాళ్ళని చాలా మృదువుగానే మందలించాడు.

ఆ మందలింపుల్ని మన నాస్తికులు బొత్తిగా అర్థం చేసుకునే స్థితిలో లేరు. పైగా ఏ వ్యక్తి అయితే నాస్తిక ధోరణిని విమర్శించాడో ఆ వ్యక్తి సపోర్టే తమకు దొరికినట్టు, ఆ వ్యక్తి చెప్పిన మాటల్లోనించీ కొన్ని మాటల్ని మాత్రమే బయటికితీసి, వాటి ద్వారా తమ సిద్ధాంతాన్ని సమర్థించుకోవాలని తంటాలు పడుతున్నారు.

# 3. నాస్తికవాదంపై లెనిన్ విమర్శలు

మార్క్స్ విషయంలోనూ, ఎంగెల్స్ విషయంలోనూ సి. వి. ఎలాంటి పధకం అవలంబించాడో సరిగ్గా లెనిన్ విషయంలో కూడా అలాంటి పధకమే అవలంబించాడు (నాస్తికులు పధకాలు మార్చరు కాబోలు !).

లెనిన్. 'నాస్తికవాదాన్ని' సమర్థించాడని రుజువు చెయ్యడంకోసం సి. వి. లెనిన్‌నించీ చాలా కొటేషన్లు ఇచ్చాడు.

"ఈ ప్రజా బాహుళ్యానికి అనేక రకాల నాస్తిక ప్రచార సాహిత్యాన్ని అందజేసి తీరాలి."

"18వ శతాబ్దానికి చెందిన నాస్తిక రచనలు, ఎంతో నిశితమూ, ప్రతిభావంతమూ అయినవి ........ సారహీనంగా వుండేటటువంటి మార్క్సిస్టు వ్యాసాలకన్నా ఈ నాస్తిక రచనలు ప్రజల మత మౌఢ్యాన్ని నిర్మూలించడానికి వెయ్యిరెట్లు వుపయోగపడతాయి. "ఇలా, 'నాస్తిక ప్రచారం అవసరం' అని చెప్పిన మాటల్ని మాత్రమే లెనిన్ నించి ఏరుకున్నాడు సి. వి.

'నాస్తిక ప్రచారం అవసరం' అనడాన్ని 'నాస్తికవాదాన్ని సమర్థించడం'గా భావిస్తున్నాడు సి. వి.

'నాస్తిక ప్రచారం అవసరం' అనే మాటలు లెనిన్ ఏ వ్యాసాల్లో అయితే చెప్పాడో, ఆ వ్యాసాల్లోనే మత వ్యతిరేకత అనేది ఎలా వుండాలో, 'మత సమస్యలపట్ల వివేకవంతమైన దృక్పథాన్ని' ప్రజలకు ఎలా కలిగించాలో, వర్గ భావాలకూ నాస్తిక భావాలకూ ఎటువంటి సంబంధం వుండాలో — వగైరా విషయాలన్నీ కూడా లెనిన్ ఎంతో వివరంగా చర్చించాడు.

'మతభావం' అనేది సమాజంలోని 'ఆర్థిక భారంయొక్క ఫలితమే' ననీ, దాని ప్రతిబింబమేననీ, వర్గ పుద్యమాలతో సంబంధంలేని నాస్తిక ప్రచారం బూర్జువా దృక్పథమనీ కూడా లెనిన్ స్పష్టం చేశాడు. లెనిన్ మాటల్ని, సి. వి., ఏ వ్యాసాలనించైతే తీశాడో ఆ వ్యాసాలలోనే ఈ మాటలు కూడా వున్నాయి, చూడండి.[6]

"నిరంతరం ఇతరులకోసమే పనిచేసే శ్రమతోనూ, లేమితోనూ, ఒంటరి జీవితం కారణంగా కలిగే బెంగతోనూ, నలిగిపోయిన ప్రజారాసు

6. లెనిన్ మాటలుగా నేను ఇస్తున్న కొటేషన్లు అన్నీ లెనిన్ రాసిన రెండు వ్యాసాలకు సంబంధించినవి.

ఆ వ్యాసాల పేర్లు :

1. సోషలిజం, మతం.

2. మతం పట్ల కార్మికుల పార్టీ వైఖరి.

ఈ వ్యాసాలు "వి.ఐ.లెనిన్, సోషలిస్టుభావశాస్త్రము, సంస్కృతి" అనే సంపుటంలో వున్నాయి. (ప్రచురణ : ప్రగతి ప్రచురణాలయం, మాస్కో) ★

2)

లను సర్వే సర్వత్రా కుంగదీసే గుదిబండగా తయారైన ఆధ్యాత్మిక హింసయొక్క ఒక రూపం మతం."

"బూర్జువా వర్గంలోని రాడికల్ డెమోక్రాట్లు ఈ మత విషయక మైన ప్రశ్నను అతి తరచుగా వేస్తోన్న విధంగా, వర్గ పోరాటంతో సంబంధం లేని అభౌతికమైన పద్ధతిలోనూ, భావవాద యుతమైన పద్ధతి లోనూ, "హేతువు"ని ఆరంభస్థావంగా తీసుకున్నట్టి పద్ధతిలోనూ ఈ ప్రశ్న వేయవలసిన ప్రమాదంలో మనం (మార్క్సిస్టులం) ఎట్టి సంద ర్భంలోనూ పడకూడదు. కార్మిక రాసులను అంతులేని హింసలకూ, మొరటుతనానికీ లోనుగావించడం అనే పునాదిపైనే ఏర్పడిన సమాజంలో కేవలం ప్రచార మార్గంతో మాత్రమే మత ధురభిమానాలను పార ద్రోలడానికి వీలవుతుందని అనుకోవడం పరిహాసాస్పదమే అవుతుంది."

"మానవాళిని కుంగదీస్తున్నట్టి మతం అనే 'భారం' కేవలం సమాజంలోవలనే వున్న ఆర్థికభారం యొక్క ఫలితమేననీ, దాని ప్రతి బింబమేననీ మరిచిపోవడం బూర్జువా సంకుచితత్వమే అవుతుంది."

మతంపై ఎలాపోరాడాలో, అలా ఎందుకు పోరాడాలో, నాస్తికులు చేసే మత పోరాటంలోవున్న లోపమేమిటో—లెనిన్ చెప్పేది చూడండి.

"మతంతో పోరాడాలి అనేది—భౌతిక వాదానికంతటికీ, దాని ఫలి తంగా మార్క్సిజానికీ కూడా ఓనమాలు. కానీ ఓనమాలుతో ఆగిపోయే భౌతికవాదం కాదు మార్క్సిజం. అంతకంటేకూడా ముందుకు వెళ్తుంది మార్క్సిజం.

"మతంపై ఎలా పోరాడాలో మనం తెలుసుకోవాలి. ఇందుకోస మని మతం పట్లనూ, మత విశ్వాసాలపట్లనూ ప్రజారాసులలోవున్న మూలాధారాన్ని మనం భౌతికవాద దృష్టితో వివరించాలి" అని మార్క్సిజం చెపుతుంది.

మత వ్యతిరేక పోరాటాన్ని అస్పష్టమైన భావవాద బోధనకు పరిమితం చెయ్యకూడదు. అలాంటి బోధనకు దిగజార్చకూడదు.

మతానికి వున్న 'సామాజిక మూలాలను' పీకి పెళ్ళగించే లక్ష్యం గల వర్గవుద్యమంయొక్క స్పష్టమైన ఆచరణ కార్యంతో ఈ మత పోరాటానికి లింకు కలపాలి.

పట్నవాస శ్రామిక వర్గంలో వెనకబడిన శ్రేణులపైనా; అర్ధ శ్రామిక వర్గంలో విస్తృత శ్రేణులపైనా, రైతు ప్రజానీకంపైనా, మతం ఎందుచేత తనప్రాబల్యాన్ని నిలబెట్టుకోగలుగు తోంది?- ఇందుకు కారణం ప్రజల అజ్ఞానమే నని బూర్జువా అభ్యుదయవాదీ, రాడికల్ వాదీ, బూర్జువా భౌతికవాదీ, జవాబు చెపుతారు. అందుచేతనే, 'మతం నాశనం కావాలి' 'నాస్తికవాదం వర్ధిల్లాలి!' 'నాస్తిక భావాల ప్రచారం మన ప్రధాన కర్తవ్యం!' అని నినాదాలు ! 'ఇది నిజం కాదు' అంటాడు మార్క్సిస్టు. ఇది పై పై అభిప్రాయం. ఇది సంకుచిత బూర్జువా సాంస్కృతికతత్వం. మతంయొక్క మూలాలను ఇది తగినంతగా లోతుకువెళ్ళి వివరించడం లేదు. వాటిని ఇది భావవాద దృష్టితో వివరించుతున్నదేగాని, భౌతికవాద దృష్టితో వివరించడంలేదు. ఆధునిక పెట్టుబడిదారీ దేశాల్లో ఈ మూలాలు ప్రధానంగా సామాజిక స్వభావం కలిగినవై వుంటున్నాయి .... తానింకా ఓనమాలు తరగతి భౌతికవాదిగానే వుండిపోవానికి ఇష్టపడని భౌతికవాది, ఈ విషయమంతా ప్రధానంగానూ, మొట్టమొదటగానూ మనసులో పెట్టుకోవాలి."

ఇంతవరకూ చూసిన లెనిన్ మాటల్లో ఒక విషయం స్పష్టంగా వుంది.

'ప్రజల మత మౌఢ్యానికి కారణం అజ్ఞానమే' అనడం అంటే, అది బూర్జువా సంకుచితత్వమనీ, అది భావవాదదృక్పథంతో వివరించడం

అనీ, ఆ అజ్ఞానానికికూడా ఒక భౌతిక కారణం చెప్పగలగాలనీ, లెనిన్ అంటున్నాడు.

సరిగ్గా ఈ విషయాలే నేను నా "నాస్తికవాదం...." పుస్తకంలో చెప్తే, 'బూర్జువా భౌతికవాది' అయిన సి. వి., నన్నిలా వెటకారం చేస్తున్నాడు. "అసంఖ్యాకమైన ప్రజలు దైవభీతితో వుండడానికి అజ్ఞానమే కారణమని నాస్తికులూ, హేతువాదులూ అంటారు. మరి మీరేమంటారు రంగనాయకమ్మగారూ?" అని, ఈ ప్రజల దైవభీతికి అజ్ఞానం కారణం కాదా అని అడుగుతున్నాడు (పే. 32). మరి ఈయన లెనిన్ వ్యాసాల్లోంచి కొన్ని మాటలు 'నేర్పుగానే' తీశాడే, 'అజ్ఞానమే కారణం' అనే వాళ్ళని గురించి లెనిన్ అన్నదేమిటో చూడలేదా?

మత మౌఢ్యానికి అజ్ఞానమే కారణమని చెప్పేవాళ్ళని బూర్జువా భౌతిక వాదులని లెనిన్ విమర్శించాడే! మరి ఈ సి.వి., రంగనాయకమ్మ మీద చేసిన వెటకారం, లెనిన్‌మీదా, లెనిన్ సిద్ధాంతంమీదా చెయ్యక పోయాడా? 'ప్రజల దైవభీతికి అజ్ఞానమే కారణమని మేమంటాం. మరి మీరేమంటారు లెనిన్‌గారూ' అని లెనిన్‌ను ప్రశ్నిస్తే, సి. వి. కి నాస్తిక వాదంమీద వున్న దీక్షకి ఎవరైనా సంతోషిస్తారు.

"... నాస్తికోద్యమం కేవలం బూర్జువా సంస్కరణ వాదనమేనని బుకాయించడం భాషతో వ్యభిచరించడమే" అంటున్నాడు సి. వి. నన్ను విమర్శిస్తూ. మరి నాస్తికోద్యమం గురించి లెనిన్ అన్నదిఏమిటి? బూర్జువా అభ్యుదయవాదుల్నీ, రాడికల్ వాదుల్నీ, బూర్జువా భౌతికవాదుల్నీ విమర్శిస్తూ లెనిన్ అన్నదేమిటి? 'మతం నాశనం కావాలి! నాస్తిక వాదం వర్ధిల్లాలి! నాస్తిక భావాల ప్రచారం మన ప్రధాన కర్తవ్యం!' అని నినాదాలిచ్చేవాళ్ళగురించి లెనిన్ అంది ఏమిటి? "ఇది పైపై అభిప్రాయం. ఇది సంకుచిత బూర్జువా సాంస్కృతిక తత్వం. (....it is

a superficial view, the View of narrow bourgeois uplifsters)" అని లెనిన్ అన్నది సి. వి. కళ్ళ బడలేదా?

" .... నాస్తికోద్యమాన్ని బూర్జువా సంస్కరణవాద మనతం భాషతో వ్యవహరించడమే" అని సి. వి. లెనిన్‌విషయంలో కూడా అనకపోయాడా మరి ?

లెనిన్‌ని విమర్శిస్తే కథ నడవదని తెలుసు ఈయనకి.

లెనిన్‌ని చదివి, లెనిన్‌నించి నేర్చుకుని, లెనిన్ చెప్పిన విషయమే నేను చెప్పినందుకు నన్ను కారుకూతలు కూసి, లెనిన్‌ని మాత్రం తనకు "సమర్థకుడి"గా తెచ్చుకుంటున్నాడు. సి. వి. లెనిన్‌నించీ 'నాస్తిక ప్రచారం చెయ్యా'లనే మాటలు మాత్రమే ఏరుకుని, ఆ నాస్తిక ప్రచారం ఏ పద్ధతిలో చెయ్యాలన్నాడో: వర్గపోరాటాలంకూ, నాస్తిక ప్రచారానికీ లింకు ఎలా కలపాలన్నాడో: ఆ రెంటిలోనూ ఏది ప్రధాన కర్తవ్యమనీ, ఏది రెండో కర్తవ్యమనీ, దేనికి ఏది లోబడి వుండాలనీ అన్నాడో - ఈ సంగతులేవీ మన నాస్తిక విప్లవకారుడు పట్టించుకోలేదు.

లెనిన్ మాటలు ఇంకా కొన్ని చూడండి.

(ఈ మాటల్లో వచ్చే 'సోషల్ డెమాక్రసీ' అనే మాటని 'కమ్యూనిజం' అని అర్థం చేసుకోవాలి.)

"సంఘటిత మైనట్టీ, ప్లానుతో కూడినట్టీ, చైతన్యవంతమైనట్టీ మార్గంలో, మతం యొక్క మూలంపై, అన్ని రూపాంలోనూ వున్న 'పెట్టుబడి' యొక్క పరిపాలనపై, పోరాడటం నేర్చుకునేంతవరకూ..... ప్రజా రాసుల మనస్సుల నించి మతాన్ని ఎట్టి ప్రబోధాత్మక గ్రంథమూ విముక్తించ జాలదు.

మతానికి వ్యతిరేకంగా రచింపబడిన విద్యా ప్రబోధక గ్రంథాలు హానికరమనీ, అనవసరమనీ దీనిఅర్థమా?—కాదు. ఎంతమాత్రమూ

కాదు. సోషల్ డెమాక్రసీ యొక్క నాస్తిక ప్రచారం, దానియొక్క ప్రధాన కర్తవ్యానికి లోబడి - అనగా, 'దోపిడీ దారులకువ్యతిరేకంగా, దోపిడీకి గురి యవుతూవున్న ప్రజా రాసుల వర్గపోరాటాన్ని అభివృద్ధి చేయడం' అనే కర్తవ్యానికిలోబడి వుండాలి, అని మాత్రమే దీని అర్థం. 'ఇదేమిటి' వేలాది సంవత్సరాలనించీ సాగే మతపోరాటం, రాజకీయార్థిక రంగాలలో జరిగే వర్గ పోరాటానికి లోబడి వుండాలా ? అనే ప్రశ్న రావచ్చు. ........" - అంటూ లెనిన్ నాస్తిక పోరాటం వర్గపోరాటానికి ఎందుకు లోబడి వుండాలో వివరించడానికి ఒక 'సమ్మె' వుదాహరణని కూడా చెప్పాడు (సమ్మె కూడా వర్గ పోరాటానికి ఒక రూపం.)

సమ్మెలోకి ఎక్కువ మంది కార్మికుల్ని సమీకరించ గలిగితే వారి డిమాండ్సు నెరవేరి, సమ్మె విజయవంత మవుతుంది. సమ్మెలోకి వచ్చే కార్మికులు నాస్తికులుగానే వుండాలనే పట్టుపెట్టుకుంటే, సమ్మె ఫెయిలవు తుంది. దానివల్ల పెట్టుబడిదారుడికి మేలు జరుగుతుంది. అందుచేత కార్మి కులు సమ్మెలోకి రావడమే ప్రధానంగానీ. వారు నాస్తికులుగా వుండితీరా లన్నది ప్రధానం కాదు. అందే ప్రజలు, వర్గపోరాటాల ద్వారానే క్రమ క్రమంగా మిగిలిన విషయాలు నేర్చుకోవలసి వుంటుంది.

ఆ వ్యాసంలోనే లెనిన్, మార్క్సిస్టులు మతంతో తప్పనిసరిగా పోరాడాలని చెప్తూ— "అయితే దీని అర్థం, మతప్రశ్నను ముందుకు తీసుకువచ్చి అది ఎన్నటికీ వహించజాలని ప్రధమస్థానంలో దానిని విం పెట్టమని ఎంతమాత్రమూ కాదు." అన్నాడు.

ఈ విధంగా మార్క్సు, ఎంగెల్సు, లెనినూ 'నాస్తికత్వం' గురించి ఎంతో సూటిగా చెప్పిన అనేక విషయాల్లోంచి 'నాస్తికప్రచారం అవసరం అన్న ముక్కలు మాత్రమే ఏరుకుని, ఆ నాస్తిక ప్రచారానికే సంబంధిం చిన ఇతర అంశాలన్నిటినీ వొదిలేశాడు పి.వి. ఇది ఎంత మోసపూరిత

మైనదృష్టి? తన సిద్ధాంతంలో వున్న లోపాన్ని గ్రహించుకోక పోగా, దాన్నే మరింత బలపర్చుకోడానికి మార్క్సిస్టు సిద్ధాంత కర్తల్నే తనకు సపోర్టర్సుగా పెట్టుకున్నాడు.

నాస్తిక ప్రచారం ఎంతో అవసరమనీ, మతంతో పోరాడాలనీ మార్క్స్ ఎంగెల్సులూ, లెనినూ చెప్తే ఈ రంగనాయకమ్మ నాస్తిక ప్రచారం అక్కర్లేదంటున్నది, అనే ధోరణిలో నామీద విమర్శలు గుప్పించాడు.

నేను 'నాస్తికత్వం' మీద రాసిన రెండు పుస్తకాలలోనూ నాస్తిక ప్రచారం అవసరాన్ని ఎంత మాత్రమూ మరుగు పరచలేదు. అయితే, ఆ ప్రచారం, నాస్తిక వర్గ చైతన్యం కలిగించే దానితో పాటు కలిసి జరగాలనీ, దానికి లోబడి జరగాలనీ ఇది సెకండరీ కర్తవ్యంగా జరగాలనీ చెప్పాను. ఇది 'మార్క్సిజం'నించి నేర్చుకున్నదేగానీ,దానికివిరుద్ధమైనది కాదు. మార్క్సిస్టు సిద్ధాంత కర్తలు చెప్పిన దానికి నేను విరుద్ధంగా వెళ్ళలేదని ఇంత వరకూ నేను రుజువు చేశాను. సి.వి. తన వాదాన్ని సమర్థించుకోడానికే తంటాలు పడ్డాడు గానీ, తన వాదంలో లోపాన్ని గ్రహించుకో దల్చలేదన్న సంగతి కూడా దీనితో పాటు రుజువైంది.

ఒక బూర్జువా భౌతిక వాది (నాస్తికవాది) 'మార్క్సిజం' చెప్పిన ప్రకారం నడవాలని నే ననడంలేదు. ఆ వ్యక్తికి, మార్క్సిజం అంగీకారమయ్యే సిద్ధాంతంకాదని అందరికీ తెలిసిందే. అయితే ఆ వ్యక్తి తను ఏ సిద్ధాంతాన్నయితే అంగీకరించాడో ఆ సిద్ధాంత కర్తల ద్వారానే తన వాదానికి బలం చేకూర్చుకోవాలని ప్రయత్నం చేశాడు.

నాస్తికుడికి ఇది ఒక కొత్త ఎత్తుగడ!

కానీ చాలా తెలివి తక్కువ ఎత్తుగడ! తన మోసాన్ని మార్క్సిస్టులు బయటకి లాగుతారనే జ్ఞానంలేని ఎత్తుగడ!

# 4. నాస్తికుల దృష్టిలో "దోపిడీ"

నేను, "నాస్తిక వాదం ...." పుస్తకంలో ఒకచోట—"ఇప్పుడు, నాస్తిక వాదులు కూడా 'దోపిడీ' 'విప్లవం అనేమాటలు వాడుతున్నారు. "దోపిడీ అంటే వీరిఅర్థం 'శ్రమదోపిడీ అనికాదు. బాబాలూ,స్వాములూ ప్రజల్ని భ్రమల్లో పెట్టి మోసాలుచేసి డబ్బులాగుతారే, దాన్నే దోపిడీ అంటారు నాస్తికులు" అని రాశాను.

నా మాటల్ని చక్కగా నిజం చేస్తూ సి.వి. తన "హేతువాద నాస్తికోద్యమం" పుస్తకంలో దోపిడీకి సంబంధించిన పట్టికలు ఇచ్చాడు. ఆ పట్టికలు 'శ్రమ దోపిడీ'కి సంబంధించినవికావు. తిరపతి దేవుడిగుళ్లో దేవుడి సేవ పేరుతో ఎంతెంత వసూలు చేస్తారో దాని పట్టిక ఒకటీ, పుష్కరాల్లో ఒకవ్యక్తి తన పితృదేవతల్లో ఎవరెవరికిపిండాలు పెయ్యాలని శాస్త్రులుచెపుతారో దానిపట్టిక ఒకటీ, పురోహితులకు చెల్లించే రేట్ల పట్టిక ఒకటీ. ఈ దోపిడీని సి.వి. 'ఆధ్యాత్మిక దోపిడీ' అని పేర్కొన్నాడు.— ఇది సి.వి. దృష్టిలో ప్రజలపై జరుగుతోన్న అసలైన దోపిడీ.

రోజుకి 8గంటలో, పది గంటలో శ్రమచేసి, దాంట్లోంచి ఒక్క గంట శ్రమనో; 2 గంటల శ్రమనో మాత్రమే శ్రామికుడు తన'జీతంగా' తీసుకుని మిగిలిన శ్రమనంతటినీ పెట్టుబడిదారుడికో, భూస్వామికో అప్పగించవలసి వస్తున్న ఘోరమైన పరిస్థితికి ఈయన చలించడుగానీ, దేవుడి గుళ్ళల్లోనూ, పుష్కరాల్లోనూ ప్రజలు ఖర్చుపెట్టేదాన్ని మాత్రం, ఈయన సహించలేక పోతున్నాడు.

ప్రజలమీద పడ్డ బాధల్లో శ్రమదోపిడీకన్నా ఆధ్యాత్మిక దోపిడీయే పెద్ద బాధయినట్టుగా ఈయన భావిస్తున్నాడు.

ఒక శ్రామికుడు (పురుషుడైనా, స్త్రీ అయినా) ఒక సంవత్సర కాలంలో తన మత మూర్ఖత్వం వల్ల ఒక వంద రూపాయలు పోగొట్టుకున్నాడు అనుకుంటే ఆ వ్యక్తిని ఆ సంవత్సరకాలంలోనే శ్రమదోపిడీకి గురి అవడంవల్ల అనేక వందల, వేల రూపాయలు పోగొట్టుకుంటున్నాడు. కానీ, శ్రమ దోపిడీకన్నా ఆధ్యాత్మిక దోపిడీయే బ్రహ్మాండమైనసమస్యగా భావించే వ్యక్తి, ఆ శ్రామికుడికి సమస్యల మూలాన్ని ఏమీ అర్థంచేసుకో దల్చడం లేదన్నమాట. ఆ శ్రామికుడికి నిజంగా వుపకారం చెయ్య దల్చడం లేదన్నమాట!

శ్రామికుడు వుత్పత్తిచేసే "విలువ" అంతాఅతనికే దక్కితేఅతని పేదరికమూ, కష్టాలుపోతే: చదువుకునివిజ్ఞాన శాస్త్రాలు నేర్చుకోవడమూ, మత మౌఢ్యం పోగొట్టు కోవడమూ, ఒక సమస్యలా ?

శ్రమదోపిడీ ముందు ఆధ్యాత్మిక దోపిడీ ఒక లెక్కా అది !

పైగా, ఆధ్యాత్మిక దోపిడీ అనేది, శ్రమదోపిడీ నించే పుట్టుకొస్తూ వున్నప్పుడు ఆధ్యాత్మిక దోపిడీని నిర్మూలించ దల్చుకున్న వాళ్ళు మొదట శ్రమదోపిడీ వేపు దృష్టి సారించ వలసిందే కదా? ఆ రెండిటికీ వున్న సంబంధాన్ని గుర్తించ వలసిందే కదా ?

"ఆ సంగతి నేను గుర్తించక పోలేదు. పూర్తిగా గుర్తించాను" అని ఎవరైనా అని, మళ్ళీ నాస్తిక ప్రచారం మాత్రమే ప్రారంభిస్తే (శ్రమ దోపిడీ గురించి ప్రస్తావించకుండా చేసే నాస్తిక ప్రచారం ప్రారంభిస్తే) ఆ వ్యక్తి అసలు సంగతిని గుర్తించినట్టు కానేకాదు.

జనం గుళ్ళల్లోకి వెళ్ళడం' మొక్కులు చెల్లించడం, కొబ్బరి కాయలు కొట్టడం, శనివారాలు చెయ్యడం, గుండ్లు చేయించుకోవడం, పుష్కర స్నానాలు చెయ్యడం, పుట్టల్లో పాలు పొయ్యడంవంటి పనుల్ని వి.వి., తనదైన తిట్ల పదజాలంతో దుయ్యబట్టాడు. తను

రాసిన ఇతర పుస్తకాల్లో కూడా ఈయన మత విమర్శ వచ్చినప్పుడల్లా రకరకాల బూతులిట్లు గుప్పిస్తూ వుంటాడు.

'నాస్తికులు తమ మత వ్యతిరేక పోరాటంలో పైపై విషయాలు మాత్రమే పట్టించుకుంటారు' అని లెనిన్ అనడంలో అర్థం సరిగ్గా ఇదే.

'పిల్లి శాపాలకే వుట్లు తెగుతాయా' అన్నట్టు, నాస్తికుడి తిట్లకే మతం నశిస్తుందా?

గదిలోకి చేరిన విషసర్పాన్ని కర్ర వుపయోగించకుండా, తిట్లవర్షం తోటీ, విమర్శల వరంపరతోటీ చంపడం ఎంతసాధ్యమో, మనుషులజీవితాల్లోకి చేరినమతాన్ని కేవలం తిట్లతోటీ, విమర్శలతోటీ, నాస్తిక ప్రచారం తోటీ చంపడం అంతసాధ్యం. పాముని కర్రలతో కొట్టడం ఎలాంటిదో, మతాన్ని ఆర్థిక రాజకీయపోరాటాలతో కొట్టడం అలాంటిది.

మతానికి వున్న అసలు పునాదిని పట్టించుకోకుండా మతపోరాటం చెయ్యడమంటే, అసలు శత్రువుని వొదిలేసి దాని నీడతో యుద్ధం చెయ్యడమే. శతృవు పోయినప్పుడే దాని నీడకూడాపోతుందనే జ్ఞానం లేకపోవడమే.

సి. వి., తన పుస్తకంలో ఒకచోట ఇలా అంటున్నాడు — "దేవుడిలో విశ్వాసం మానసిక బానిసత్వానికి దారితీస్తుందనీ, సామాన్య జనాన్ని మోసగించి వారిని అజ్ఞానాంధకారంలో వుంచడానికి మతం తోడ్పడుతుందనీ మేము చెప్తోంటే కొందరు మిత్రులు మాపై ఎందుచేత విరుచుకు పడుతున్నారో నాకర్థం కావడం లేదు" (పే. 41)

అవును, నీకర్థంకాదు. ఎందుకంటే, నువ్వు అర్థం చేసుకోదల్చలేదు గనక. నీ మెదడుకి వుండే తలుపులు మూసుకున్నావు గనక.

మార్క్సు నించీ, ఎంగెల్స్ నించీ, లెనిన్‌నించీ కొటేషన్లు తీసిన వ్యక్తి, ఆ వ్యాసాలలోనేవున్న అత్యంత జ్ఞానవంతమైన విషయాలకు

వీపుతిప్పి, ఒక్క జ్ఞాన కిరణాన్ని కూడా మెదడులోకి చొరబడనివ్వక పోతే, ఆ వ్యక్తికి నిజంగానే అర్థం కాదుమరి !

దేవుడిలో విశ్వాసం మానసిక బానిసత్వానికి దారితీసే మాట నిజమే! సామాన్యజనాన్ని మతం అజ్ఞానాంధకారంలో వుంచేమాట నిజమే! ఆ నిజాల్ని మార్క్సిస్టులు కాదనడంలేదు. 'మతంతో పోరాటంవొద్దు'ని మార్క్సిస్టులు అనడం లేదు. కానీ, ఆ పోరాటం నాస్తిక పద్ధతిలో వుండరాదని మాత్రమే మార్క్సిస్టులు అంటున్నారు. మార్క్సిస్టుల విమర్శ నాస్తికులకు 'విసుగు పడడం'గా కనిపిస్తోంది.

మత పోరాటం గురించి మార్క్సిస్టులు చేస్తోన్న విమర్శ ఏమిటో సి. వి. కి నిజంగానే అర్థంకాకపోతే — "నాకీ అంశాలు అర్థంకావటం లేదు. సందేహాలు కలుగుతున్నాయి" అని వాటిని సంస్కారవంతంగా చర్చలోకి తీసుకురావాలి. అంతేగానీ, అవతల వాళ్ళు ఏం చెప్తున్నారో, ఎందుకు చెప్తున్నారో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించకుండానే వ్యంగ్యాలతోటీ, వెటకారాలతోటీ వాళ్ళ మీద దండెత్తడం కాదు చెయ్యవలసిన పని.

"మతం, దేవుడు, కులం - ఇత్యాదులకు వ్యతిరేకంగా జరిపే ప్రచారం నూతన సంస్కృతీ వికాసానికి ఎంతగానో దోహదం చేస్తుందే గానీ, సోషలిస్టు భావాలకి ఏ మాత్రం ద్రోహం చెయ్యదు" అంటున్నాడు సి. వి. (పే. 41). విషయాల్ని పైపైనే చూస్తే ఇలాగే అనిపిస్తుంది- 'మతమూ' దేవుడూ లాంటి మూఢనమ్మకాలు వుండకూడదని చెప్పడంలో తప్పేమిటి ?' అనిపిస్తుంది. మూఢనమ్మకాల్ని పోగొట్టే ప్రయత్నంలో తప్పేమీ లేదు. తప్పంతా ఎక్కడ వుందంటే, జీవితంలో వుండే సమస్యలన్నీ 'మతం' వల్లనే పుట్టుకొచ్చినట్టూ, మతం పోతేనే అవిపోతాయి అన్నట్టూ చిత్రించడంలో వుంది. ఇలా చిత్రిస్తూ, నాస్తిక పద్ధతిలో జరిగే మత పోరాటాలవల్ల, శ్రమ దోపిడీకి గురి అయ్యే ప్రజలకు నష్టం.

రహస్యం కారణం తెలియకుండా పోతుంది. శ్రామిక ప్రజల్ని వర్గ పోరాటాల వేపు పోకుండా చెయ్యడానికి దోపిడీదారులు, నాస్తిక పోరాటాల్ని ప్రోత్సహించిన సంఘటనలు చరిత్రలో జరిగాయి.

'నాస్తిక పోరాటాలు, నూతన సంస్కృతికి దోహదం చేస్తాయే గానీ, సోషలిస్టు భావాలకు ద్రోహం చెయ్యవు కదా' అనే సి. వి. మాటలు, చారిత్రక వాస్తవాల్ని ఎరగని మాటలే. దేవుడికీ, మతానికీ వ్యతిరేకంగా 'నాస్తిక ధోరణి'లో చేసే ప్రచారం వర్గపోరాటాలకూ, సోషలిస్టు ఉద్యమానికీ తప్పకుండా ద్రోహం చేస్తుందని చరిత్రలో రుజువు అయింది.

జర్మనీలో బిస్మార్కు కాలంలోనూ, ఫ్రాన్సులో బూర్జువా రిపబ్లిక్ కాలంలోనూ జరిగిన మత వ్యతిరేక పోరాటాలు కార్మికుల దృష్టిని వర్గ పోరాటం మీదనించి మళ్ళించడానికి ఉపయోగపడ్డాయి. ఈ అనుభవాల వల్లనే కమ్యూనిస్టులు, బూర్జువాల ఎత్తుగడల్ని సాగనివ్వకుండా చెయ్యడం కోసం మత వ్యతిరేక పోరాటాల్ని వర్గ పోరాటాలకు లోబరిచి వుంచాలనే సంగతి గ్రహించ గలిగారు.

మత వ్యతిరేక పోరాటాలనే ప్రధాన కర్తవ్యంగా చేయడం వల్ల అవి వర్గ పోరాటాలకు హాని కలిగించడం చూసి, కమ్యూనిస్టులు మత వ్యతిరేక పోరాటం పట్ల 'ఉదాసీనత' వహించారు. కమ్యూనిస్టులకు, నాస్తిక ప్రచారం పట్ల 'ఉదాసీనత' కలగటానికి చారిత్రక కారణం వుందని లెనిన్ అన్నాడు (ఆ ఉదాసీనత పోగొట్టుకొని, మత వ్యతిరేక పోరాటాన్ని సరైన దృష్టితో చెయ్యాలనడంలో ఏమీ సందేహం లేదు. అంతేగానీ, ఆ ఉదాసీనతని అలాగే వుంచుకోవాలని అర్థంకాదు)

వర్గ భావాలతో సంబంధంలేని నాస్తిక భావ ప్రచారంవల్ల మేలు జరుగుతుందా, కీడు జరుగుతుందా అనే విషయంలో లెనిన్ అభిప్రాయాలు

చూడండి. (ఈ మాటల్లో వచ్చే 'సోషల్ –డెమాక్రాట్లు' అనే మాటని 'మ్యూనిస్టులుగా' అర్థం చేసుకోవాలి)

"....బూర్జువా ప్రభుత్వాలు మత గురువుల వ్యవస్థకు వ్యతిరేకంగా కుహనా లిబరల్ దాడిని సంఘటిత పరిచి, ఈ విధంగా ప్రజా రాసుల దృష్టిని సోషలిజం నుంచి మళ్ళించడానికి బుద్ధి పూర్వకంగా ప్రయత్నించాయి. జర్మనీలో కల్చర్ కంప్ యొక్క, ఫ్రాన్స్‌లో క్లెరికలిజానికి వ్యతిరేకంగా బూర్జువా రిపబ్లికన్లు చేసిన పోరాటం యొక్క నిజస్వభావం ఇదే. కార్మిక రాసుల దృష్టిని సోషలిజం నుంచి మళ్ళించడానికి ఒక సాధనంగా బూర్జువాలు చేపట్టిన క్లెరికలిజంపై వ్యతిరేకత-ఇదే పాశ్చాత్య దేశాల్లో మత వ్యతిరేక పోరాటం వల్ల సోషల్ -డెమోక్రాట్లలో అధునిక 'ఉదాసీన' వాదాలు విస్తరించడానికి హర్వం జరిగిన సంగతి! ....బూర్జువా వర్గం యొక్క, బిస్మార్క్ యొక్క 'క్లెరికలిజంపై వ్యతిరేకత'ను భంగ పుచ్చేందుకు సోషల్–డెమోక్రాట్లు మత వ్యతిరేక పోరాటాన్ని సోషలిజం కోసం సాగించే పోరాటానికి లోబడి వుండేటట్లు చెయ్యవలసి వచ్చింది."

దీన్నిబట్టి అర్థం చేసుకోవలసింది ఏమిటి?–వర్గ పోరాట దృష్టిలేని మత పోరాటం, వర్గ పోరాటానికి హాని చేస్తుందని.

"మా నాస్తిక ప్రచారం సోషలిజానికే సహాయం చేస్తుందిగానీ, దానికి ద్రోహం చెయ్యదు కదా?" అని పి.వి. అడిగిన ప్రశ్న నిజంగా అమాయకంగా అడిగినదే. అయితే. పి.వి. ఏ సోషలిజానికి సహాయం చెయ్యాలనుకుంటున్నారో ఆ సోషలిజం గురించి శాస్త్రీయంగా చెప్పిన వాళ్ళ మాటల్ని శ్రద్ధగా అర్థం చేసుకోవాలి — (సోషలిజానికి ఏది సహాయ పడుతుందో, ఏది సహాయపడదో పి.వి. కన్నా లెనిన్ వంటి వాళ్ళకే సరిగా తెలుసు కాబట్టి). మతానికి వ్యతిరేకంగా నాస్తికులు జరిపే పోరాటానికీ, సోషలిస్టులు జరిపే పోరాటానికీ వున్న తేడాని అర్థం చేసు

కోవాలి. ఎవరి పోరాటం, (ఎవరి పోరాట పద్ధతి), మతాన్ని నిర్మూలించగలిగే డైరెక్షన్‌లో వుందో అర్థం చేసుకోవాలి.

నాస్తిక ప్రచారం సోషలిజానికి సహాయం చేస్తుందనే మాట నిజమే. కానీ, ఎప్పుడు? ఆ ప్రచారం ఏ పద్ధతిలో, ఏ స్వభావంతో జరిగినప్పుడు? ఆధ్యాత్మిక దోపిడీ ఏ వర్గాలకు మేలు చేస్తుందో తెలిసేలాగ ప్రజలకు 'వర్గజ్ఞానం' కలిగించినప్పుడు! ఈ 'వర్గజ్ఞానాన్ని' ఇవ్వని నాస్తిక ప్రచారం ప్రజలకు ద్రోహమే చేస్తుంది. ఎలాగంటే— 'ముందు మతం మీద దెబ్బకొట్టాలి' అనే భావాలే ఈ ప్రచారం ద్వారా కలిగించడం వల్ల ఆ భావాల్ని నమ్మిన వాళ్ళు మత వ్యతిరేక పోరాటాలకే ఎక్కువ విలువ ఇస్తారు. వాటినే ప్రధాన కర్తవ్యంగా ఎంచి, తమ శక్తి సామర్థ్యాల్ని ప్రధానంగా నాస్తిక ప్రచారంమీద కేంద్రీకరిస్తారు. మతాన్ని వొదిలించుకుంటే తమ జీవితం ఎంతో బాగుపడుతుంది అనుకుంటారు. ఈ అభిప్రాయం ఏర్పడినవాళ్ళు వర్గ పోరాటం మీద దృష్టి నిల్పరు. దాన్ని సెకండరీ విషయంగా చూస్తారు.

కాస్సేపు ఆర్గ్యుమెంట్ కోసం— సామాన్య ప్రజలందరూ నాస్తికులై పోయారనుకుందాం. వారంతా మత నమ్మకాల్ని వొదిలేసి, మతం పేరుతో ఒక్కపైసా కూడా ఖర్చు పెట్టకుండా వుంటున్నారనుకుందాం. అంటే, ఆధ్యాత్మిక దోపిడీకి గురి కాకుండా వుంటున్నారనుకుందాం.— దీనివల్ల వాళ్ళ జీవితాలు చక్కబడ్డట్టేనా? మతం పోయిందంటే జీవితం చాలా సౌఖ్యంగా వుండాలి కదా? అంత సుఖంగా వుంటుందా ఇప్పుడు? —మరి పేదరికాన్ని కలిగిస్తోన్న, శ్రమదోపిడీ మాటేమిటి? మతాన్ని మొదట వొదిలించుకొని, శ్రమ దోపిడీని తర్వాత వొదిలించుకోవచ్చు కదా?— అంటారా? అది పిచ్చిమాట. ఆర్థిక దోపిడీ చెక్కు చెదరకుండా వుండగానే 'మతం' పోవడం సాధ్యంకాదని చరిత్ర అనేకసార్లు రుజువు చేసింది.

ప్రజల్ని నాస్తిక ప్రచారం వేపు ఆకర్షించడమంటే వర్గపోరాటాల వేపు వెళ్ళకుండా చెయ్యడమే. ఇది సోషలిజానికి ద్రోహం చెయ్యడం కాదా? 'శ్రమదోపిడీ'ని స్థిరంగా వుంచడానికే సహాయం చెయ్యడం కాదా? (చరిత్రలో ఇలా జరిగిందని లెనిన్ చెప్పిన మాటలు ఇంతకుముందే చూశాం.)

"మతంమీద మాత్రమే చేసే యుద్ధ ప్రకటనలు దాన్ని మరింత బలంగా వుంచడానికే సహాయపడతాయి"—అని ఎంగెల్సు అన్నదాన్నీ:

"ఏది ఏమైనాసరే, దేవుడిపై యుద్ధం చేసి తీరాలని ప్రబోధించే వ్యక్తి ఆచరణలో మత గురువులకూ, బూర్జువా వర్గానికి సహాయం చేస్తాడు" అని లెనిన్ అన్నదాన్నీ, శ్రద్ధగా అర్థం చేసుకోవాలి.

ఆర్థిక దోపిడీకి సహాయం చెయ్యడం ఇష్టంలేని నాస్తికులు "నాస్తిక ప్రచారం" అనేదాన్ని "వర్గ చైతన్యంతో కూడిన నాస్తిక ప్రచారం"గా సరిదిద్దుకోవాలి. వర్గ చైతన్యం కలిగించే క్రమంలోనే నాస్తిక చైతన్యం కలిగించాలి. నాస్తిక ప్రచారాన్ని రెండో స్థానంలో వుంచాలనే సంగతి అర్థం చేసుకోవాలి. ఈ విధంగా, వర్గ వుద్యమాలంకే ప్రథమ స్థానం వుంచాలని చెప్పే నాస్తిక ప్రచారమే సోషలిజానికి సహాయం చేయగలుగుతుందిగానీ, లేకపోతే దానివల్ల సోషలిజానికి సహాయం జరగదు సరికదా హానే జరుగుతుంది.

'దోపిడీ', 'విప్లవం', 'సోషలిజం' అని విప్లవపదాలు వల్లించినంత మాత్రానే ఎవరూ విప్లవకారులు కాలేరు. నాస్తిక ప్రచారం చేసే వాళ్ళు నిజమైన విప్లవకారులంకన్నా గొప్ప విప్లవ పదాలు గుప్పిస్తారని లెనిన్ అన్నాడు— "ల్యాటిన్ దేశాలలో అరాచకవాదులూ, బ్లాంకిస్టులూ జర్మనీలో మోస్ట్ (డ్యూరింగ్ శిష్యుడు) రకం వాళ్ళూ, ఆస్ట్రియాలో 1880లలో అరాచకవాదులూ, మత వ్యతిరేక పోరాటాలలో విప్లవాత్మక పదజాల ప్రయోగాన్ని పరమోన్నత స్థాయికి తీసుకుపోయారు."—

అంటే, మత వ్యతిరేక పోరాటాలు మాత్రమే చేసేవాళ్ళు ఎంత విప్లవ పదజాలం గుప్పించినా లాభంలేదని లెనిన్ తేల్చి చెప్తున్నాడు.

అందుచేత, సి.వి. లాంటి నాస్తికులు ఎంత విప్లవ పదజాలం వాడినా, ఎన్ని 'పారిస్ కమ్యూన్లు' గానం చేసినా, తమ నాస్తిక ధోరణిని మార్చుకోకపోతే మాత్రం ఎన్నటికీ ప్రజలకు మేలుచేసే విప్లవకారులు కాలేరు.

# 5. ఏది ప్రధానం? మౌలిక సమస్యల పరిష్కారమా? "మానసిక వికాసమా?"

ప్రజలలో మతమౌఢ్యం పోవాలంటే, వారికి మొదట విజ్ఞాన శాస్త్ర జ్ఞానం నేర్పాలని వాదించే నాస్తికుల అవగాహనలో వున్న లోపమేమిటో చెప్పడం కోసం "నాస్తిక వాదం...." పుస్తకంలో నేనిలా అన్నాను.

"రాతిలో కప్ప ఎలా జీవిస్తుందో తెలుసుకుంటే పేద రైతుకి అప్పులన్నీ తీరతాయా? భూమి వలకంగా లేదనీ గుండ్రంగా వుందనీ తెలుసుకుంటే ఒక వ్యవసాయకూలీకి దున్నుకోడానికి భూమి దొరుకుతుందా? చంద్రుడు దేవుడు కాదని కార్మికులు తెలుసుకుంటే, సామ్రాజ్యవాదుల పెట్టుబడులు వొదిలేసి పోతాయా?" .... అన్నాను.

ప్రజల తక్షణ సమస్యల్ని ఏ మాత్రం పట్టించుకోకుండా, వారికి విజ్ఞాన పాఠాలు నేర్పాలని ప్రయత్నించే నాస్తికుల్ని నేనడిగిన ప్రశ్న లాంటి ప్రశ్నలు తప్పకుండా అడగవలసినవే. నాస్తికవాదాన్ని నేనలా ప్రశ్నించి నందుకు సి.వి. మండిపడుతూ ఇలా జవాబు చెప్తున్నాడు.

"రంగనాయకమ్మగారు 'రామాయణవిషవృక్షం' రాస్తే, దేశంలోని పేద ప్రజలకి తిండీ, గుడ్డా దొరుకుతుందా— అని అడిగే ప్రశ్న ఎంత

సుందర ముదరష్టమైనదో, పై ప్రశ్నలు గూడా అంత సుందరముదరష్టాలైనవే. రంగనాయకమ్మగారి 'కాపిటల్' చదివితే, రైతుకుఅప్పులు తీరతాయా? వ్యవసాయకూలీకి భూమి లభిస్తుందా – అని అడిగే ప్రశ్న ఎంత బుద్ధిహీనమైందో, పై ప్రశ్నలుగూడా అంత బుద్ధిహీనమైనవే. అంచేత పొంతనలేని రకరకాల సంఘటనల్నీ, అంశాల్నీ అత్యంత కృత్రిమంగా జతపర్చి, పరమకంతిరితర్కంతో తిమ్మినిబమ్మిని, బమ్మినితిమ్మిని చేయడానికి రంగనాయకమ్మగారు పడరాని పాట్లు పడుతోన్నారు. కష్టజీవులకి అప్పులు తీరడమూ, దున్నుకోడానికి భూమి దొరకడమూ యిత్యాది సమస్యలు మౌలిక మైనవే. అయితే వాటికి 'మానసిక వికాసం' కల్గించవలసిన అవసరంలేదని ఈమె భావమా? ఇలాంటి కుంతవాదనలు చేసేవారు లెనిన్ కాలంలోకూడా కొందరుండేవారు. ఇలాంటి పండిత పుత్రుల్ని ఆయన అత్యంత తీవ్రంగా మందలించాడు." (పే. 44)

కుంత వాదనలు చేసేవారు లెనిన్ కాలంలోకూడా కొందరుండేవారు! ఇప్పుడు సి.వి. కాలంలో కూడా కొందరున్నారు! ఆ కొందరిలో రంగనాయకమ్మ ఒకతె! కుంతల్ని లెనిన్ అత్యంత తీవ్రంగా మందలించాడు గాబట్టి ఇప్పుడు రంగనాయకమ్మని సి.వి. అత్యంత తీవ్రంగా మందలిస్తున్నాడు!

లెనిన్, రంగనాయకమ్మలాంటి కుంతల్ని మందలించాడో, సి.వి. లాంటి కుంతల్ని మందలించాడో గ్రహించేపని పాఠకులకే వొదిలేస్తాను. ఇప్పుడు నేను చెప్పేదేమిటంటే, సి.వి. మాటల్లో ఒకవిషయం చూడండి.

"కష్టజీవులకు అప్పులు తీరడమూ, దున్నుకోడానికి భూమి దొరకడమూ, యిత్యాది సమస్యలు మౌలికమైనవే." సరి! "అయితే, వాటికి మానసిక వికాసం కలిగించ వలసిన అవసరం లేదని ఈమె భావమా?" అని గొప్ప జ్ఞానవంతమైన ప్రశ్న అడుగుతున్నాడు.

3)

మౌలిక సమస్యల్ని మొదటపట్టించుకోకుండా మానసికవికాసాన్ని మొదట పట్టించు కుంటూడా తలకాయ వున్న మనిషి ? మౌలిక విషయాన్ని వెనక్కి పెట్టి, మానసిక వికాసాన్ని ముందుకు తెస్తాడా జ్ఞానం వున్న మనిషి ? మౌలిక సమస్యల్లో సతమతమయ్యే వారికి, ఆ సమస్యని పరిష్కారం కాకుండానే మానసిక వికాసం కలుగుతుందని భావిస్తాడా బుంరకాని మనిషి ?

ఎవరిది ఛుంఠ వాదం ? కంత్రీవాదం?

నాదే ఛుంఠ వాదం అయితే, లెనిన్‌ది ఛుంఠవాదమే. నాదీ కంత్రీ వాదం అయితే లెనిన్‌దీ కంత్రీవాదమే. ఎందుకంటే — లెనిన్ చెప్పిందే నేను చెప్పాను. మౌలిక సమస్యని ముందు పరిష్కరించాలనీ, దాన్నే ప్రథమ స్థానంలో వుంచాలనీ, మత సమస్యని ఎన్నటికీ ప్రథమ స్థానం లోకి తీసుకురాకూడదనీ లెనిన్ దగ్గిరే నేర్చుకుని చెప్పాను.

నోటికి వొచ్చిందల్లా పేలడమే సిద్ధాంత చర్చ అయితే, ఆ చర్చలో సరియైన మార్క్సిస్టులు నెగ్గలేరు. వైరుధ్యాల్ని పరిష్కరించు కుంటూ పోయే సిద్ధాంత చర్చే వాళ్ళ ఆయుధం గానీ సంస్కార హీన మైన వాగుడు వాళ్ళ ఆయుధం కాదు. తిట్లతో నెగ్గదలిస్తే ఏ రంగంలో నైనా పి.వి. లాంటి పెద్దలదే విజయం.

# 6. మతవిశ్వాసాల స్థానం

"తన పేదతనాన్ని పోగొట్టుకోవాలనీ, తన శ్రమని యజమానులు దోపిడీ చేస్తున్నారనీ వ్యవసాయకూలీ అనుకోడానికి, అతడు నమ్మే కర్మ సిద్ధాంతమూ, దేవుడు రాసే రాత- ఇత్యాది విశ్వాసాలు అడ్డుపడ్డం లేదా?"- పి.వి. (పే. 50)

తప్పకుండా అడ్డు పడుతున్నాయి. కానీ 'అడ్డుపడడం'అనే పనిలో అవి రెండో స్థానంలో వున్నాయి.

'అష్టపదపదం' అనే పనిలో మొదటి స్థానంలో వున్నవి ఆస్తికి సంబంధించిన పాత విశ్వాసాలే.

"ఆస్తి ధనికుడి స్వంతం. భూమి భూస్వామి స్వంతం, వాళ్ళతెలివి వల్లనే వాళ్ళు ఆస్తులు సంపాదించుకో గలుగుతున్నారు. కూలివాడికి కూలి డబ్బులు మినహా ఏమీ రాదు." అనే భావాలే పేదతనాన్ని వదిలించుకునే పనిలో మొట్టమొదట అడ్డంపడుతున్నాయి, బలంగా అడ్డంపడుతున్నాయి.

మత విశ్వాసాలు కూడా ఆ పనికి అడ్డుపడుతున్నాయి గానీ, ఆ అడ్డు చాలా బలహీనమైనదీ, మొదటి అడ్డుకి కొంత సహాయం చేసేదీ మాత్రమే.

రామారావు అనే మంచి వ్యక్తితో, సుబ్బారావు అనే దుర్మార్గుడు అన్యాయంగా పోట్లాడుతున్నాడనుకుందాం. రామారావు తరఫున ఎంత న్యాయం వున్నా అతడు చాలా బలహీనంగా వున్నాడు. సుబ్బారావు దేహ బలంతో పొగరుమోత్తనంగా వున్నాడు. ఇష్టం కలబడి కొట్టు కుంటున్నాడు.

సుబ్బారావుకి అతని తమ్ముడొకడు పదేళ్ళవాడు సహాయం చేస్తు న్నాడు. వాడు కూడా రామారావుని చిన్న చిన్న దెబ్బలు కొడుతున్నాడు.

రామారావుతో పోట్లాడే వాళ్ళు ఇద్దరైనప్పటికీ, వాళ్ళలో గట్టిగా పోట్లాడేవాడు సుబ్బారావే. అతని తమ్ముడు అతనికికొంత సహాయం చేసే వాడిగా వున్నప్పటికీ ఆ చిన్న పిల్లాడి దెబ్బలు రామారావుకేమంత లెక్క కావు. సుబ్బారావే పెద్ద పెద్ద దెబ్బలు కొడుతున్నాడు.

ఇలాంటి పరిస్థితిలో, రామారావు మంచివాడని తెలిసి అతనికి సహాయం చెయ్యాలనే అభిప్రాయంతో ఎవరైనా ఆ పోట్లాటలోకి దిగితే ఆ సహాయకుడు మొట్టమొదట ఎవరితో పోట్లాడాలి? సుబ్బారావుతో పోట్లాడాలి. కానీ, మన సహాయకుడు సుబ్బారావుని వొదిలేసి,ఆ 'పిల్లాడి' కేకలు అవీ మాని వొప్పుకుంటే, మరి ఆ పిల్లాడితో పోట్లాట మొదలు

పేదవాడనుకోండి. ఆ పిల్లాడు అందకుండా ఇటూ అటూ పరుగులు తీస్తూ వుంటే మన సహాయకుడు "ముందు నీ అంతుచూస్తా" అని ఆ పిల్లాడి వెనకాలే పరుగులు తీస్తాడనుకోండి. సుబ్బారావు వేపే కన్నెత్తి చూడ డనుకోండి, ఇలా చేస్తే ఈయన రామారావు కేమైనా సహాయం చెయ్య గలడా?

"పెద్దాణ్ని వొదిలేసి పిల్లాడివెనక పడ్డావేమిటి? ఇలాగైతే రామా రావుకి చేసే సహాయమేముంది? రామారావుకి సహాయం చెయ్యడం లేదంటే, అది సుబ్బారావుకి సహాయం చేసినట్టే" అని ఎవరైనా ఆ సహాయకుడితో అంటే, ఆయన వొప్పుకుంటాడా? ఇంత ఎత్తున ఎగిరి పడతాడు.

"ఏం,ఈ పిల్లాడు మాత్రం రామారావుతో పోట్లాడడంలేదా? వీడు మాత్రం రామారావుకి శత్రువుకాదా? నేను రామారావుకే సహాయం చేస్తు న్నాను. కాదని నువ్వంటే నేనొప్పుకుంటానా? నీ పెదవ తర్కానికేమిలే" —అని మళ్ళీ ఆ పిల్లాడి వెనకాలే పడితే ఎలా వుంటుంది?

ముందు ఆ పిల్లాడితోనా పోట్లాడ వలసింది? పెద్ద శత్రువుని పడగొడితే తర్వాత ఆ పిల్లా డెక్కడికెళ్తాడు? అన్న కిందపడితే ఎలాగూ మాయం అయిపోతాడు. పోనీ మాయం అవకుండా వాడింకా దెబ్బలాడు తూనే వున్నా తర్వాత వాడిని తేలిగ్గానే పట్టొచ్చు.

ఈ వుదాహరణలో— రామారావుకి ఒక పెద్ద శత్రువూ, ఒక పిల్లశత్రువూ వున్నట్టే, ఒక శ్రామికుడికి—పేదతనం వొదిలించుకోవడంలో ఒక పెద్ద ఆటంకమూ, ఒక చిన్న ఆటంకమూ వున్నాయి. అందుకే, "పేద వ్యక్తి అభివృద్ధికి మతం అడ్డుపడడం లేదా?" అనే ప్రశ్నకిజవాబు —"అడ్డు పడుకోంది, అడ్డుపడే పనిలో అది రెండో స్థానంలో వుంది" అన్నదే.

# 7. సాంస్కృతిక రంగంలో మార్పులు ఎలావస్తాయి ?

సి.వి. ప్రశ్నల్లో ఒక ప్రధానమైన ప్రశ్న?— నాస్తిక ప్రచారం చెయ్యాలంటే సోషలిజం వచ్చేదాకా ఆగాలా? అన్నది. సి.వి. వాదనల్లో ఇది ఒక అంశం- "....సోషలిస్టు వ్యవస్థ స్థాపించబడేంత వరకూ సమాజంలోని సమస్త బ్రహ్మ జెముళ్ళకి వ్యతిరేకంగా కృషి సాగించాల్సిన అవసరం లేదనీ, సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని భవిష్యత్తుకు వాయిదా వేయాలనే వాదన అర్థరహితమైంది. రాజకీయ, ఆర్థిక రంగాల్లో జరుపుతోన్న కృషి సంస్కృతీ రంగం వద్ద కొచ్చేప్పటికి తటపటాయించడం ఎంచేత జరుగుతుందో ఎంతకీ అర్థం కాని విషయం. రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాహితీ, సాంస్కృతిక రంగాలు వాస్తవానికి వేరువేరు గదులు కానేకావు. అవి ఒకే సాంఘిక శరీరంలోని వివిధ అంగాలు మాత్రమే." (పే.42)

దీన్ని నేను మూడు భాగాలుగా విభజించి జవాబు చెపుతాను.

(1) "సాంస్కృతిక పునరుజ్జీవనం" అని సి.వి. వాడిన మాట సరైనది కాదు. 'పునరుజ్జీవనం' అంటే, గతంలో కొంతకాలం జీవించి, వాడి మరుగున పడిపోయినదాన్ని తిరిగి జీవింప చెయ్యడం అని. 'సాంస్కృతిక పునరుజ్జీవనం' అంటే, గతంలో వున్న సంస్కృతిని తిరిగి జీవింప జెయ్యడం అని.

సి.వి. ఏ 'భౌతికవాద సంస్కృతి'ని కోరుతున్నాడో అలాంటి సంస్కృతి ప్రజాసామాన్యంలో పెద్ద వట్టుగా ఎన్నడూ లేదు.

"చార్వాక సంస్కృతిని పునరుజ్జీవింప చెయ్యాలనే భావంతో నేనా మాట వాడాను," అని సి.వి. అంటే కూడా అది సరైంది కాదు.

సి.వి.యే తన పుస్తకంలో ఇంకోచోట "నూతన సంస్కృతీ వికాసానికి" అనే మాటలు వాడాడు. నాస్తికుల అర్థంతో చూసినా కూడా "సాంస్కృతిక పునరుజ్జీవనం" అనడం కన్నా "నూతన సంస్కృతీ వికాసం" అనడమే సరైనది.

(2) "సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని భవిష్యత్తుకు వాయిదా వేయాలనే వాదన అర్థరహితమైంది"

మార్క్సిస్టు సిద్ధాంతకర్త లెవ్వరూ ఈ అర్థరహితమైన వాదన చెయ్యలేదు. సోషలిస్టు సమాజం ఏర్పడే వరకూ నాస్తిక ప్రచారం గానీ, సంస్కృతికి సంబంధించిన ఇతర ప్రచారాలు గానీ అక్కర్లేదనీ, సోషలిజం తర్వాతే వాటిని ప్రారంభించాలనీ మార్క్సిస్టు సిద్ధాంతం అనడం లేదు.

నాస్తిక ప్రచారం విప్లవానికి ముందునుంచీ అవసరమేనని లెనిన్ అన్నాడు— "మన కార్యక్రమం విజ్ఞాన శాస్త్రీయ దృక్పథంపైనే, అంతే కాకుండా, ప్రత్యేకంగా, భౌతిక, ప్రాపంచిక దృక్పథంపైనే సంపూర్ణంగా రూపొందించబడింది. అందుచేత, మన కార్యక్రమంలో ఇచ్చే వివరణలో మత విషయకమైన పొగమంచు తెరకు వున్నటువంటి యథార్థమైన చారిత్రాత్మక, ఆర్థిక మూలాల వివరణ తప్పనిసరిగా వుంటుంది. మన ప్రచారంలో నాస్తికత్వ ప్రచారం తప్పనిసరిగా ఒక భాగంగా వుంటుంది."
—అన్నారు లెనిన్ 1905లో. అంటే 'సోషలిజం' ప్రారంభంకాక ముందే.

'సోషలిజం వచ్చాకే నాస్తిక ప్రచారం ప్రారంభించాలిగానీ ఇప్పుడే దాన్ని గురించి మాట్లాడకూడదు" అని ఏమార్క్సిస్టయినా అంటే

ఆ వ్యక్తి ఈ నాస్తిక ప్రచారం విషయంలో మార్క్సిస్టు దృక్పథాన్ని అర్థం చేసుకోలేదని చెప్పవలసిందేగానీ, ఆ తప్పు మార్క్సిస్టు సిద్ధాంతానిది కాదు.

నూతన సంస్కృతీ నిర్మాణ కృషి పాత సమాజంలోనే ప్రారంభమవుతుంది. అది సరైన మార్గంలో నడిస్తే, పాత సమాజం వుండగా కూడా కొంత అభివృద్ధి చెందుతుంది. అంతలో ఆర్థికరంగంలో విప్లవం జరిగిన పాత భౌతిక పరిస్థితులు విప్లవాత్మకంగా మారుతూ వున్నప్పుడు, సాంస్కృతిక రంగం కూడా ఆచరణలో త్వరత్వరగా విప్లవాత్మకంగా మారడం ప్రారంభమవుతుంది.—ఇదీ సాంస్కృతిక రంగానికి సంబంధించిన పరిణామ క్రమం. ఈ క్రమాన్ని అర్థం చేసుకోకుండా ఈ దోపిడీ సమాజం ఇలా వుండగానే "నూతన సంస్కృతీ వికాసం" కలుగుతుందని భావించడం అర్థరహితమైనది.

(3) "రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాహితీ. సాంస్కృతిక రంగాలు వేరు వేరు గదులు కానేకావు. అవి ఒకే శరీరంలోని వివిధ అంగాలు మాత్రమే."

అవి వేరు వేరు గదులు కానేకావనడంతప్పు. ఒక ఇంటి గదులు వేరు వేరు గదులుగానూ వుంటాయి, మళ్ళీ ఒకదానిలో ఒకటి పూర్తిగా దూరంకాని సంబంధంలోనూ వుంటాయి. అదే వాటిమధ్య భిన్నత్వమూ, ఏకత్వమూ కూడా.

'రాజకీయార్థిక సాహితీ సాంస్కృతిక రంగాలు వేరు వేరుగదులు కావు,— అని సి.వి. అనడంలో అర్థం, అన్నిరంగాలకీ సమానమైన ప్రాధాన్యత ఇచ్చి, కృషి చెయ్యాలనే.

"సాంస్కృతిక రంగంలోకృషి" అంటే ప్రధానంగా సి.వి.అర్థం 'మత వ్యతిరేక కృషి' అనే. ఈ మత వ్యతిరేక కృషికి, రాజకీయార్థిక రంగాలలో జరగవలసిన కృషితో సమానస్థాయి ఎప్పుడూవుండదు

ఒక సమాజంలో విప్లవకరమైన మార్పులు జరిగి అది కొత్త సమాజంగా మారాలంటే, అన్ని రంగాలలోనూ ఒక కాలంలోనే మౌలిక మైన మార్పులు జరగవు. అందుచేత, అన్ని రంగాలకూ సమానమైన ప్రాధాన్యత ఇవ్వాలనడం పొరపాటు. (దీని అర్థం, సాంస్కృతిక రంగంలో కృషి అక్కర్లేదని కాదు.)

ఒక సమాజంలో వున్న రంగాల్ని ఒక శరీరంలోని అంగాలతో పోల్చాడు పి.వి. ఈ పోలిక సరైందే, మంచిదే. ఈ పోలికతోనే పి.వి. వాదంలో వున్న ఒక పొరపాటుని రుజువు చెయ్యవచ్చును.

ఒకరోగి శరీరంలో, నాలుగైదు రకాల జబ్బులున్నాయను కుందాం. గుండెజబ్బు వుంది. బి.పి.వుంది. తలనొప్పి వుంది. వంటినొప్పి వుంది. కాళ్ళనొప్పులు వున్నాయి. కొంచెం దగ్గుకూడా వుంది. ఈ లక్షణాలన్నీ ఒక రోగికి వుండడంలో ఆశ్చర్యం ఏమీలేదు. అయితే, ఈ రోగికి వైద్యం చేసే డాక్టరు 'అన్నీ అంగాలూ ఒకే శరీరంలోనివి కాబట్టి' అన్ని బాధలకూ ఒకేరకమైన ప్రాధాన్యత ఇస్తాడా? జ్వరానికీ వంటి నొప్పికీ కూడా ఒకే ప్రాధాన్యత ఇస్తాడా? బి.పి.కీ దగ్గుకీ కూడా ఒకే ప్రాధాన్యత ఇస్తాడా?

ఏ బాధ తీవ్రంగా వుందో, ఏ బాధ రోగికి ఎక్కువ హానికలిగించే టట్టు వుందో దాన్ని ముందు తగ్గించాలని చూస్తాడు. ఆ రోగికి పూర్తి ఆరోగ్యం కలిగించాలంటే ఆ పని ఒక క్రమంలో వరసగానే చేస్తాడు.

ఈ సమాజానికి వచ్చిన రోగాల్లో 'ఆర్థిక దోపిడీ' గుండెజబ్బు లాంటిది అయితే, 'మత మౌఢ్యం' వంటినొప్పి లాంటిది. ఇలాంటి పరిస్థితిలో గుండెకీ, వంటికీ ఒకే ప్రాధాన్యత ఇవ్వాలని వాదిస్తే ఆ వాదం ఆ రోగికేమీ మేలు చెయ్యదు. ఇలాంటి రోగికి వైద్యం చెయ్యాలని వస్తే పి.వి. లాంటి వైద్యుడు గుండెజబ్బుని పట్టించుకోకుండా వంటి

సాహిత్యంలో, నాట్య సాహిత్యంలో మంచి పనులు "ఒక ఆరోగ్యంగా ఉను పోతావుకే" అంటారు. "అంగాల విభజన లేదు" అన్న అంశం ఒక్కటే అర్థం చేసుకుని, "అంగాల విభజన కూడా ఉన్నాయి" అన్న రెండో అంగాన్ని కూడా అర్థం చేసుకోకపోవడమే పరిశీలనలో తప్పు దొర్లుతుంది.

ఒక సమాజంలో ఉన్న ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలు విభజనగా ఉన్నాయి, ఒక సంబంధం ద్వారా ఐక్యంగానూ ఉన్నాయి. వాటిని ఒక కోణంలో చూసినప్పుడు విభజనగానూ, ఇంకో కోణంలో చూసినప్పుడు ఐక్యంగానూ కనపడతాయి.

ఆ రంగాలలో జరగవలసిన మౌలికమైన మార్పుల సంగతీ. ఏవ కోణాలలో చూస్తే విడిగానూ ఉంటుంది, సంబంధంగానూ ఉంటుంది.

మొట్టమొదట— ఆర్థిక, రాజకీయ రంగాలలో మౌలికమైన మార్పులు జరిగి, వాటి ప్రభావంతోనే తర్వాత క్రమేణా, కొద్దికాలంలో సాంస్కృతిక విషయాలలో మౌలికమైన మార్పులు జరుగుతాయి. తర్వాత జరగడం అంటే, 'ఆ మార్పుల క్రమం' అంతకు పూర్వం ప్రారంభమే కాదని అర్థం కాదు. ఆ మార్పుల క్రమం పాత సమాజం లోనే ప్రారంభమై, కొత్త సమాజంలో అది పెరిగి ప్రగతి చెంది సంపూర్తిగా 'మౌలికమైన మార్పు' రూపాన్ని తీసుకుంటుంది.

## 8. ఏక తమాషా వాదం

మావో చేసిన ఒక తమాషా వాదం చూడండి.

ఫ్యూడలిజం వెళ్ళిన ప్రభావం మాత్రమే మిగిల్చిపోయినట్లు ఎలాంటి ఎదురు ప్రశ్నల దారావళి కింద చూస్తూ చేసిన విషయం చాలా చాలా, ఆశ్చర్యకరంలో.

"దేవుడు లేడు, కర్మలేదు, అలాంటి మూర్ఖభావాలు పోగొట్టుకోవాలి నువ్వు". అని నాస్తికులు ఒక పేద వ్యక్తికి చెప్తారే అనుకోండి. "కర్మలేదా? నా కర్మ కాకపోతే నేనెందుకిలా పేదతనంతో కష్టాలు పడుతున్నాను?" అని ఆ పేదవ్యక్తి అడిగితే కర్మలేదని చెప్పిన నాస్తికుడు ఆ పేద మనిషికి ఏం జవాబు చెప్పవలసి వుంటుంది? ఆ పేదమనిషి జీవితానికి సంబంధించిన ఆర్థిక పరిస్థితిని పరిశీలించి చెప్పవలసి వుంటుంది. నీ శ్రమలో చాలాభాగం నీకు దక్కకుండా పోతోంది కాబట్టే నువ్విలా పేదవాడిగా వున్నావు అని ఆర్థిక దోపిడీని చెప్పవలసి వుంటుంది. అంటే, నాస్తికుడు తాను చెప్పదల్చుకున్న కర్మసంగతీ, దేవుడి సంగతీ కాస్సేపు వెనక్కి పెట్టి, ముందు ఆర్థిక పరిస్థితిని వివరించవలసి వచ్చింది. అంటే, ముందు మత మౌఢ్యాన్ని పోగొట్టాలని చూసే నాస్తిక వాదానికి ఇది చావు దెబ్బకాదా? అందుకే నేనేమన్నానంటే— "దేవుడు లేడు, కర్మలేదు- అని నాస్తికులు చెప్పేది విని, ఒక పేదవ్యక్తి 'కర్మలేకపోతే నేనెందుకిలా వున్నా'నని ఒక్క ప్రశ్న అడిగితే చాలు, నాస్తికత్వానికి నడ్డి విరుగుతుంది" అన్నాను, నా పుస్తకంలో.

దీనిమీద సి.వి. ఒక 'అవాస్తవిక' వాదం తీసుకొచ్చాడు.

సరే, ఆ పేదమనిషి ప్రశ్నకి ఆర్థిక దోపిడీ గురించే చెప్తాం. నువ్వు దోపిడీకి గురవుతున్నావు అనే చెప్తాం.— "అంతా విన్నతర్వాత "ఇదంతా నా కర్మ కాకపోతే నేనెందుకిలా పేదవాడిగా కష్టాలు పడుతున్నాను? పూర్వజన్మలో చేసిన పాపానికి ఈ జన్మలో అనుభవిస్తున్నా. మీ పిచ్చిగానీ బగమంతుడు ఎట్టా రాస్తే అట్టాగే ఈ బతుకు తెల్లారుద్ది. నారుపోసినవాడు నీరు పోయడా?'' అని అంటే, అప్పుడెవరి నడ్డివిరుగుతుంది?"— అని అడుగుతున్నాడు సి.వి. (పే. 50)

నా జవాబేమిటంటే- అప్పుడు కూడా నాస్తికవాదం నడ్డే విరుగుతుంది. ఎలాగంటే, ఈ వుదాహరణలో తీసుకున్న పేదవ్యక్తి శ్రామిక

వర్గాని కంతటికీ ప్రతినిధి. ఆర్థిక దోపిడీ గురించి ఆ వ్యక్తికి చెప్పడం అంటే, శ్రామికవర్గాని కంతటికీ చెప్పడమే." నీ శ్రమలోఎంతోభాగాన్ని దోపిడీదారులు దోచుకుంటున్నారు.' అని పేదవానికి ఎంత చెప్పినా అది కదలకుండా 'నా కర్మ ఇది' అని వాళ్ళు ముడుచుకుని కూచోడమే నిజమైతే, మానవ సమాజం బానిస వ్యవస్థ నించీ సోషలిస్టు వ్యవస్థ దాకా ఎలా మార్పులు చెందుతూ వచ్చింది?

వర్గ భేదాలంటూ ఏర్పడ్డ తర్వాత 'బానిస వ్యవస్థ'లో వద్దసమాజం, అక్కడే వుండిపోక ఎందుచేత పరిణామం చెందుతూ వచ్చింది? దోపిడీకి గురిఅయ్యే వర్గాలు 'మా కర్మే ఇది. నారుపోసినవాడు నీరు పొయ్యడా?' అని కదలకుండా చతికిల బడి కూర్చుంటే సమాజం ఒక్క అంగుళం కూడా కదలకుండా పుండవలసిందేనే! కాని చరిత్రలో అలా జరగలేదే! సమాజం అనేక దశల్లోకి మార్పులు చెందుతో వచ్చిందే!

"సమాజం మారుతూ వున్నమాట నిజమే, కానీ ఆ మార్పుకి కారణం నాస్తిక చైతన్యమే" అంటారన్న మాట నాస్తికులు! వందసార్లు అవకృతంలతో అరిగిన పాత పాటే ఇది. దీనిమీద నా పుస్తకంలో చాలా ప్రశ్నలు అడిగాను.

ఒక బానిస, యజమాని దగ్గర్నించీ పారిపోయాడంటే, లేదా, పదిమంది బానిసలు కలిసి యజమాని మీద తిరగబడ్డారంటే, ఆ పని తమ బానిసత్వాన్ని వొదిలించుకోవానికి చేసిందే. ఆ పనిని వాళ్ళు 'వర్గ పోరాటం' అనే పేరుతో పిల్చుకోక పోవచ్చు. కానీ, వాళ్ళ తమ భౌతిక స్థితిని ఎదిరిస్తారన్నమాట! ఆ బానిసలకు ఎన్ని మత విశ్వాసాలున్నా తమ దాస్యానికి ఎదురు తిరగడం మానలేదు.

అలాగే ఫ్యూడల్ సమాజంలో కౌలు రైతులూ చేశారు. అలాగే, పెట్టుబడిదారీ సమాజంలో కార్మికులూ చేశారు, చేస్తున్నారు.

రష్యాలోనూ, చైనాలోనూ సోషలిస్టు సమాజాలు ఏర్పడ్డాయి⁷ అంటే, అక్కడ కమ్యూనిస్టు పార్టీలు ప్రజలకు ప్రధానంగా వర్గచైతన్యం కలిగించాయా? నాస్తిక చైతన్యం కలిగించాయా?- ప్రధానంగా వర్గ చైతన్యమే కలిగించాయి.

'నాస్తిక చైతన్యం కలిగిస్తేగానీ, కర్మమీద విశ్వాసాలు పోగొడితేనే గాని ప్రజలు కదలరు. మా కర్మ ఇంతే అని చతికిలబడి కూర్చుంటారు.' అని నాస్తికులు వాదిస్తే, అది వాస్తవికతకే,చరిత్రనడకకే విరుద్ధమైనవాదం. ఆ వాదంలోవున్న తప్పే దాని ఓటమికి కారణ మవుతుంది.

శ్రామిక వర్గానికి వర్గ చైతన్యం కలిగించబోతే, అది ఆ చైతన్యాన్ని నమ్మకంగా నేర్చుకోదనీ, కర్మనే పట్టుకుని వేళ్ళాడుతుందనీవాదిస్తే ఆ వాదం శుద్ధ తప్పుడు వాదంగా తన లోపాలు తానే బయటికి రుజువు చేసుకుని, తన నష్టి తనే ముక్కలు ముక్కలు విరగగొట్టుకుంటుంది.

# 9. కమ్యూనిస్టు దేశాల్లో "మతం"

పి.వి. అడిగిన ప్రశ్నల్లో ఇంకో ముఖ్యమైన ప్రశ్న వుంది, 'ఆస్తిక దోపిడీ పోతే మతం పోతుందంటున్నారు కదా మార్క్సిస్టులు? రష్యా

7. రష్యా చైనాలు సోషలిస్టు మార్గాన్ని వదిలిపెట్టి, రివిజనిస్టు మార్గాన పట్టాయనే సంగతి ఈ పుస్తకంలోనే కొంచెం తెలుస్తుంది. ఈ విషయం కొంచెం వివరంగా తెలియాలంటే (ముఖ్యంగా చైనా గురించి) "చైనాలో ఏం జరుగుతోంది?" అనే పుస్తకం చూడండి. ఇది "చార్లెస్ బెతల్ హామ్" అనే ఫ్రెంచి మార్క్సిస్టు రాసిన పుస్తకానికి అనువాదం. ఈ పుస్తకం దొరికే చోటు: జాస్తిరెడ్డి పబ్లికేషన్స్ ట్రస్ట్, ప్లాట్ నెం–81, జూబ్లీహిల్స్, హైదరాబాదు-500034 లేదా హైదరాబాద్ బుక్ట్రస్ట్, 10వ వీధి, హిమాయత్‌నగర్, హైదరాబాదు–500 029. ★

చైనాల్లో ఇంకా మతం ఎందుకు వుంది? ఆ దేశాల్లో ఇంకా మతం వుందంటే అక్కడ ఇంకా దోపిడీ సాగుతున్నట్టేనా?' అనే పద్ధతిలో సి.వి అడుగుతున్నాడు.

సి.వి. మాటల్లో—

రష్యాలో సోషలిస్టు వ్యవస్థ ఏర్పడిన 63 సంవత్సరాల అనంతరం కూడా నేటికీ మతం వున్నదంటే అక్కడ ఇంకా దోపిడీ వ్యవస్థ కొనసాగుతూనే వుందని రంగనాయకమ్మగారి భావమా?" (పే. 35)

"జన చైనాలో ముప్పయ్ ఏళ్ళ తర్వాతగూడా నేటికీ మతంవున్నదంటే, అక్కడ దోపిడీ వ్యవస్థ కొనసాగుతూనే వుందని ఈమె భావమా? ఆ దేశాల్లో 'కొత్త భౌతిక పరిస్థితి' ఏర్పడినా పాత మతభావాలే ఎందేత నేటికీ చలామణిలో వున్నాయి?" (పే. 35)

"....దోపిడీ జరిగే భౌతిక పరిస్థితి ఈ దేశాల్లో ఇంకాపోలేదా? దోపిడీ జరిగే పరిస్థితి ఇంకా కొనసాగుతున్నందువల్లనే, శ్రమజీవుల్ని యింకా మత మౌఢ్యంలో వుంచవలసిన అవసరం ఏర్పడిందా? ఈమెకు తెలిసిన గతి తార్కిక చారిత్రక భౌతికవాదం సాయంతో ఈమె ఈ సమస్యను వివరించ యత్నిస్తారా?" (పే. 36–37)

వివరించడానికి 'యత్నించడం' కాదు. సూటికి నూరుపాళ్ళ—కాన్ఫిడెన్స్‌తోనే వివరిస్తుంది రంగనాయకమ్మ. గతి తార్కిక, చారిత్రక, భౌతిక వాదాన్ని సాయంగా తీసుకున్న వాళ్ళెవరైనాసరే ఈ విషయాన్ని నిస్సందేహంగా వివరించ గలుగుతారు.

కానీ, ఎవరెంత వివరించినా, జ్ఞానానికీ, సత్యానికీ పీకలిప్పే పి.వి. లాంటి నాస్తికుల తలకాయలకి ఆ వివరణలు ఎక్కవు.

నేను విషయాలన్నీ వివరించేది పి.వి.ల కోసం కాదని మొదటే చెప్పాను.

సి.వి. ప్రశ్నకు జవాబేమిటని ఎదురు చూసే పాఠకుల కోసమే వేసి విషయం వివరిస్తాను.

'నాస్తికత్వం'మీద నేనురాసినరెండు పుస్తకాల్లోకూడా ఈవిషయం ప్రస్తావించాను. ముఖ్యంగా "నాస్తికత్వం-ఒక పరిశీలన"లో 'మార్క్సిస్టు దృక్పథంలో నాస్తికత్వం' అనే హెడ్డరులోని ఈ వాక్యాలుచూడండి.

"'వస్తువు' పోయిన తక్షణమేదాని 'భావం' కూడా పోవడం సహజం కాదు. వునికిలో లేనివస్తువు గురించి దాని భావంలేకుండా క్రమ క్రమంగా నాశనమవుతుంది. మతానికి మూలమైన దోపిడీ పోయినతర్వాత కూడా మతం పోవడానికి కొంతకాలం పడుతుంది. అందుకే దోపిడీ లరి కట్టే శ్రామిక పరిపాలనకూడా తక్షణమే ప్రజల మనసులనించి మత భావాన్ని తొలగించలేదు."

"కమ్యూనిస్టు దేశాల్లో కూడా ఇంకా మతం వున్నదంటే, మతానికి మూలమైన 'దోపిడీ సంపూర్ణంగా నాశనం గాకుండా ఇంకా తలఎత్తడానికి ప్రయత్నిస్తూ వున్నదన్నమాట. దోపిడీకి అనుకూలంగా వున్న స్వభావం ఇంకా సజీవంగా వుండడం చేతనే దాని ప్రతిబింబమైన మతం కూడా ఇంకా కనపడుతూనే వుంది. అంతేగాక, ఎంతోకాలం మూఢ నమ్మకాలలో వున్న కొన్ని తరగతుల ప్రజలకు-రైతాంగం, చేతివృత్తులవారూ, స్త్రీలూ మొదలైన వారికి-గత కాలంలో పొత్తిగా విజ్ఞాన శాస్త్రంతో సంబంధం లేకపోవడం చేత, అన్ని రకాల శాస్త్రీయ దృక్పథం ఏర్పడడానికి చాలా కాలం పట్టవచ్చును."— కమ్యూనిస్టు దేశాల్లో మతం వెంటనే పోకపోవడం గురించి నేను మొదటి పుస్తకంలో ఇచ్చిన వివరణ ఇది.

"భౌతిక పరిస్థితి మారినా కూడా మతం ఎందుకు పోలేదు?" అనే ప్రశ్నకి సరిపోయే జవాబు "నాస్తికవాదం...." పుస్తకంలో కూడా ఇచ్చాను. ఒక సమాజపు భౌతిక పరిస్థితి అంటే ఏమిటో, అది మారడంలో ఎటువంటి క్రమాన్ని తీసుకుంటుందో కొంతవరకూ వివరించాను.

ఆర్థిక రంగంలో పరిస్థితి మారిన వెంటనే మతం మాయంకాదు. దానికి ఎంతో పరిణామక్రమం అవసర మవుతుంది.

అయితే, రష్యా చైనాల్లో అసలా క్రమం ప్రారంభమైందా, లేదా? మతాన్ని నిర్మూలించే కార్యక్రమాలు అక్కడేపైనా జరుగుతున్నాయా, లేదా?— అనే విషయాలు చూడాలి.

'రివిజనిజం' నాలుగు పాదాలా నడుస్తోన్న నేటి రష్యాలో, మతం విజృంభించి వున్న సంగతి ప్రపంచానికంతటికీ తెలిసిందే.

ఇటీవలే రివిజనిస్టు రోడ్డున పడ్డ చైనాలో కూడా (ప్రజల ప్రతిఘటన ఓడిపోయి ఈ రివిజనిజం ఇలాగే కొనసాగితే) త్వరలోనే మత విజృంభణ ప్రారంభమైతే ఆశ్చర్య పడ నక్కర్లేదు.

ఈ రివిజనిస్టు దశల్ని అలా వుంచి, కమ్యూనిస్టు ప్రభుత్వాలు పరిపాలన ప్రారంభించిన వెంటనే, మత నిర్మూలన విషయంలో, ఆ రెండుదేశాల్లోనూ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టారో చూద్దాం.[8]

---

8. ఇక్కడ ఇస్తున్న వివరాలు రెండు పుస్తకాలనుంచీ తీసుకున్నాను.

(1) Islam in China by M. Rafiq Khan (Delhi. National Academy. 1963)

(2) Christianity in a Revolutionary Age. A History of Christianity in the Nineteenth and Twentieth Centuries -Volume IV. The Twentieth Century in Europe. The Roman Catholic, Protestant and Eastern Churches. By Kenneth Scott Latourette. Newyork: Harpet & Brothers. Publishers, 1961. Chapter XIX Christianity in Revolutionary. Russia PP: 484-521. AND Volume V— The Twentieth Century Outside Europe. The Americas, the Pacific. Asia and Africa: the Emerging World Christian Community (By the Same author). Newyork: Harper & Row Publishers. 1962. Chapter XIII. The Course in warsmitten, Revolutionary China-PP: 371-411 ★

ఈవేళాల చేసిన పనుల్లో ఒక్క పని అయినా మార్క్సిస్టు వ్యక్తిత్వం చేసుంటానా, రాజకీయాధికారాన్ని స్వీకారం చేసుకుంటానా, పత్రికాపత్రిక ప్రచారంతో ఎవరైనా వెయ్యగలరేమో ఆలోచించండి.

మొదట రష్యాలో జరిగిన కార్యక్రమాలు చూద్దాం.

1917 నవంబరులో కమ్యూనిస్టులు రాజకీయాధికారం తీసుకున్నాక తర్వాత మత నిర్మూలన విషయంలో ప్రారంభించిన కార్యక్రమాల్లో కొన్ని :

- 1917 డిసెంబరులో - మాస్కోలోని చర్చిని జాతీయం చేయటంతోపాటు, చర్చీలనూ, మసీదులనూ, ఇతర మత సంస్థలనూ చెందిన భూముల్ని కూడా జాతీయం చేశారు.
- మత సంస్థల ఆధీనంలో ఉన్న విద్యాలయాన్నీ, మతసంస్థల ఆధీనంలో వ్యాపారాల్లో పెట్టిన పెట్టుబడుల్ని స్వాధీనం చేసుకున్నారు.
- 1918 ప్రారంభంలో-ప్రభుత్వం నుంచి మతసంస్థల్ని విడదీశారు. మత సంస్థలకు ఆర్థిక సహాయం నిలిపేశారు. (మత సంస్థలు తమకు అవసరమైన దాన్ని భక్తుల నుంచి మాత్రమే వసూలు చేసుకోవాలి.)
- మత కార్యకలాపాలలో వాడే కొవ్వొత్తులు, పంచాంగాలు మొదలైన ప్రచురణలు, తైలాలు వంటి వస్తువుల్ని కొన్ని మతసంస్థలు తమ స్వంత ఫ్యాక్టరీలలో ఉత్పత్తి చేసి, ఇతర మతసంస్థలకు అమ్ముతూ ఉండేవి. అలాంటి ఫ్యాక్టరీలన్నిటినీ జాతీయం చేశారు. ఒక్కొక్క మత సంస్థకీ ఎంతెంత కావాలో ప్రభుత్వం అడిగితే అంతమేరకు మాత్రమే సప్లయి చేస్తూ. కాని మత సంస్థలు తామే ప్రచురణల్ని ఉత్పత్తి చేసి అమ్మి 'లాభం' సంపాదించే అవకాశం తీసేశారు.
- ముస్లిం మత సంస్థలు, మాంసం అమ్మే ముస్లింల నించి 'పన్ను' వసూలు చేసే పద్ధతి రద్దుచేశారు

[illegible]

- [illegible]
- [illegible]
- [illegible]
- [illegible]
- [illegible]
- [illegible]
- [illegible]
- [illegible]
- [illegible]

- కొత్త మత సంస్థల్ని నిర్మించడానికి వీలులేదు.
- మత సంస్థల్లో జరిగే పెళ్ళిళ్ళకు చట్టబద్ధమైన గుర్తింపు వుంటుంది గానీ, మత సంస్థల్లో జరిగే 'విడాకుల'కు చట్టబద్ధమైన గుర్తింపు వుండదు.(మతసంస్థల ద్వారా జరిగే విడాకుల్లో స్త్రీలకు అన్యాయం జరుగుతుంది కాబట్టి.) విడాకులు మాత్రం సివిల్ కోర్టుల ద్వారా జరగవలసిందే.
- 1919 మార్చిలో - 18 సంవత్సరాల లోపు పిల్లలకు మతబోధ చెయ్యడాన్ని నిషేధించారు. 18 సం॥లు దాటిన వారికి మతబోధ చెయ్యవచ్చును. ఇష్టమైతే వారు మత బోధకులుగా కూడా వుండవచ్చును. కానీ ఆ మత బోధకులు వుత్పత్తి కార్యక్రమంలో తప్పని సరిగా పాల్గొనాలి.
- దేశంలో ప్రతివ్యక్తికీ మతాన్ని అంగీకరించడానికి గానీ, అంగీకరించకపోవడానికి గానీ స్వేచ్ఛవుంటుంది. భక్తులుగా వుండడానికి గానీ, నాస్తికులుగా వుండడానికి గానీ స్వేచ్ఛ వుంటుంది.
  కానీ, బయట మత ప్రచారం చేసే హక్కు భక్తులకులేదు. నాస్తిక ప్రచారంచేసే హక్కు నాస్తికులకు వుంటుంది.
  ప్రభుత్వ చట్టాన్ని ధిక్కరించి కొన్ని మత సంస్థలు మత ప్రచారం చేసినప్పుడు అలాంటి సంస్థల్ని నిషేధించారు.
  ఉదా॥ 1928లో ఒక ముస్లిం సంస్థ, "షైల్డ్ ఆఫ్ ఇస్లామ్"అనే పత్రిక ప్రారంభించినప్పుడు, ఆ సంస్థని నిషేధించి, ఆ మత కార్యకర్తల్ని అరెస్టు చేశారు.
- మత గురువుల్నీ, ఇతర మత కార్యకర్తల్నీ కొట్టడమూ, తిట్టడమూ,వారిపై భౌతిక మైన దాడులు చెయ్యడమూ నిషేధించారు.
- ప్రభుత్వం మతాధికారుల మీద శిక్షలువిధిస్తే రాజకీయ కారణాల్ని బట్టే ఆ పని చేసింది గానీ, మత కారణాల్ని బట్టి చెయ్యలేదు.

(రాజకీయ కారణాలంటే ఆ మతాధికారులు విదేశీ గూఢచారులుగా వుండడంగానీ, విప్లవ ప్రతీఘాతకులుగా వుండడంగానీ, ఇంకా అలాంటి కారణాలు.)

- 1921లో దేశంలో ఘోరమైన కరువు వొచ్చినప్పుడు ప్రభుత్వం మత సంస్థలకు చెందిన బంగారు వస్తువులు అమ్మేసి, ఆ డబ్బు ప్రజల అవసరాలకు వినియోగించింది.
- 1920లో కొన్ని మత సంస్థలు మూతపడ్డాయి. (మత కార్యకలాపాల నిర్వహణకి రాబడి లేకా, భక్తులసంఖ్య తగ్గిపోవడంవల్లా)
- 1929లో మత వ్యతిరేక ప్రచారం ఎక్కువ స్థాయిలో జరిగింది. కార్మిక సంఘం 8వ సమావేశం మత నిర్మూలన కోసం కొన్ని కార్యక్రమాలు ప్రకటించింది.

  మత సంబంధమైన పుస్తకాలు ప్రింటు చెయ్యకూడదని ప్రెస్ కార్మికులు నిర్ణయించారు.

  మత సంబంధమైన వస్తువుల్ని రవాణా చెయ్యకూడదని రవాణా కార్మికులు నిర్ణయించారు.
- 1929వ సంవత్సరంలోనే ఎక్కువ మత సంస్థలు మూతపడ్డాయి. మత గురువుల సంఖ్య తగ్గిపోయింది.

  మత కార్యకలాపాలులేక ఖాళీ అయిన భవనాల్ని ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగించింది. శిల్ప సౌందర్యంగలవాటిని మ్యూజియములుగా మార్చి, మిగిలిన వాటిని పాఠశాలల కోసం, సినిమాహాళ్ళకోసం, హోటళ్ళకోసం, అస్పత్రుంకోసం వినియోగించింది.
- కమ్యూనిస్టు రష్యాలో మతప్రభావం క్రమక్రమంగా తగ్గిపోవడం ప్రారంభమైంది.

  1917లో— 50,967 మంది మతగురువులు వుండే,

1941 నాటికి — 5,665 మంది అయ్యారు.
1917లో — 46,457 చర్చిలు వుండే,
1941 నాటికి—4,225 అయ్యాయి.

* బష్కిరియా ప్రాంతంలో—
1929 లో—3,000 మంది ముల్లాలు వుండే,
1932 నాటికి—300 మంది అయ్యారు.

చైనాలో—

చైనాలో 1949లో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన "ప్రజాతంత్ర ప్రభుత్వం" ఏర్పడింది. మత నిర్మూలన కోసం ఆ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో ఇవికొన్ని :

* మత సంస్థలకు సంబంధించిన భూములు స్వాధీనం చేసుకున్నారు.
* విదేశాలకు చెందిన మత సంస్థల్ని బహిష్కరించారు. వాటి మతాధికారుల్ని, ప్రచారకుల్ని (మిషనరీల్ని) పంపించి వేశారు. కొందర్ని రహస్య రాజకీయ కార్యకలాపాలు సాగించినందుకు కోర్టుల్లో విచారించారు.
* దేశంలో వుండే మత సంస్థలు, సామ్రాజ్యవాద దేశాల మత సంస్థలతో సంబంధాలు పెట్టుకోవడానికి వీలులేదు.
దేశంలో మత సంస్థలు—ఫ్యూడల్ వ్యతిరేకతకూ, సామ్రాజ్య వాద వ్యతిరేకతకూ హాని కలిగించరాదు. విప్లవ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనరాదు.
* సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే చర్చిలన్నీ కలిసి "దేశభక్తియుత కేథలిక్ చర్చి"గా ఏర్పడడాన్ని ప్రభుత్వం ప్రోత్సహించింది. ఈ చర్చి, మత కార్యక్రమాలకు వెచ్చించే కాలాన్ని తగ్గించుకుని ఉత్పత్తిలో పాలుపంచుకోవాలని నిర్ణయించింది. ఈచైనా చర్చిని సామ్రాజ్యవాద దేశాల చర్చిలన్నీ వ్యతిరేకించాయి.

- 1950లో, ప్రభుత్వం, ప్రొటస్టెంట్ మతానికి సంబంధించిన నాయకులతో చర్చలు జరిపింది. "దాని ఫలితంగా, ఆ మత నాయకులు ఒకకొత్త "క్రిష్టియన్ మానిఫెస్టో"ని తయారుచేసి ప్రకటించారు. ఒాస్వామ్య విధానాన్నీ సామ్రాజ్యవాదాన్నీ, వివరం కులాధికార పెట్టుబడి దారీ విధానాన్నీ వ్యతిరేకించడంలో తాము కమ్యూనిస్టుపార్టీతో సహకరిస్తామనీ: విప్లవాత్మక భూసంస్కరణల్ని బలపరుస్తామనీ వారు ప్రకటించారు.
- మత సంస్థల్ని చెక్ చెయ్యడం కోసం, "మత వ్యవహారాల శాఖ" అనే శాఖని తెరిచింది ప్రభుత్వం.

  మత సంస్థంలో జరిగే కార్యకలాపాలు రోజూ ఒక ప్రత్యేకమైన సమయంలో మాత్రమే, మత సంస్థల ఆవరణల్లో మాత్రమే, ప్రభుత్వ ప్రతినిధి సమక్షంలో మాత్రమే జరగాలని శాసించింది ప్రభుత్వం.
- కొత్త మత సంస్థల నిర్మాణంపై నిషేధం.
- పిల్లలకు 'మతబోధ పై నిషేధం.
- పాఠశాలల్లో 'మతబోధ'ని నిషేధించడమేగాక, విద్యార్థులు ఖాళీగా వుండే సమయాలలో, వాళ్ళు మత కార్యకలాపాలవేపు ఆకర్షితులు గాకుండా, "యువజన కమ్యూనిస్టు సంఘాల" వారు తమ కార్యక్రమాలలోకి విద్యార్థుల్ని ఆకర్షించే విధానాలు పారంభించారు.
- తమ తమ సాంప్రదాయానుసారం కొన్ని వృత్తులలో మాత్రమే వుండే ముస్లిములను, ప్రభుత్వం రకరకాల వృత్తులలోకి వచ్చేలాగ ప్రోత్సహించింది.
- కమ్యూన్ లా, కో-ఆపరేటివ్ లా, మతాంతర వివాహాల్ని ప్రోత్సహించాయి.

మత సంస్థల్లో ఒక్కొక్కటే మూతబడటం ప్రారంభమైంది. మూతబడ్డ భవనాల్ని ఆయా ప్రాంతాల కమ్యూన్‌లు స్వాధీనం చేసుకున్నాయి.

షాంఘై నగరంలో—
1949లో — 200 చర్చిలు వుండే,
1958 నాటికి— 15 మిగిలాయి.

ఈ విధంగా — 'మతాన్ని నిర్మూలించాలంటే మత మూలం మీద దెబ్బకొట్టాలనే' శాస్త్రీయమైన అవగాహనతో, రష్యాలోనూ చైనాలోనూ కమ్యూనిస్టులూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎటువంటి తటపటాయింపూ లేకుండా మత వ్యతిరేక కార్యక్రమాలు ప్రారంభించారు.

కానీ, ఈనాడు రష్యాలో 'మతం'కోలుకుంది. ప్రస్తుతానికి దానికి ప్రమాదం తప్పింది. రివిజనిస్టులు దానికి రకరకాల టానిక్కులు ఇచ్చి కాపోపెట్టారు.

చైనాలో కూడా—రివిజనిస్టు 'పరిమళాలు' మతరంగంలోకి పాకడం ఇప్పుడిప్పుడే చూడగలుగుతున్నాము.

ఈ మధ్యే, "న్యూస్ ఫ్రమ్ చైనా" పత్రిక "మతానికి" ప్రోత్సాహం కలిగించే వార్త ఒకటి ప్రకటించింది.

1980 ఆగస్టు 13న, రంజాన్ పండుగనాడు పెకింగ్‌లో వున్న రెండు మసీదుల్లో 6 వేలమందికిపైగా ముస్లిములు హాజరయ్యారు. 1949లో 'నవచైనా' ఏర్పడిన తర్వాత పండుగ దినాన మసీదుల్లో ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవడం అనేది ఎన్నడూ జరగలేదు.

అంతేగాక గత 31 సంవత్సరాల కాలంలో, ముస్లిమ్‌లకు పండుగ నాడు సెలవు ఇవ్వటం అనేది ఇప్పుడే మొట్టమొదటిసారి జరిగింది

—ఇదీ చైనా ఇచ్చిన తాజా మత వార్త[9]

నవచైనా ఏర్పడిన తర్వాత 31 సంవత్సరాలలో ఎన్నడూ జరగని దని ఒకటి ప్రారంభమైంది! అది మతాన్ని ప్రోత్సహించే దని!

ఈ విధంగా చైనాలో కూడా మతానికి 'కాళ్ళునొక్కే' దని ప్రారంభమైంది. రష్యా, చైనాలు రివిజనిస్టుదారిన పడ్డాయి కాబట్టే అక్కడ మతం కోలుకొంటోంది.

రష్యా చైనాల సంగతి అలా వుంచుదాము.

ఒక వేళ, ఒక కమ్యూనిస్టు దేశం చాలా సరియైన కార్మికవర్గ చైతన్యం కలిగిన రాజకీయ నాయకత్వాన నడుస్తూ వున్నప్పటికీ కూడా, అక్కడ మతం ఇరవయ్యేళ్ళకో, ముప్ఫయ్యేళ్ళకో, నలభయ్యేళ్ళకో' ఎనభయ్యేళ్ళకో సంపూర్ణంగా అదృశ్యమైపోదు.

సోషలిజం వచ్చిన తర్వాతకూడా వర్గపోరాటం అనేక రంగాలలో, అనేక రూపాలలో జరుగుతూనే వుంటుంది. దోపిడీ వర్గభావాలు ఇంకా వున్నాయీ అంటే మత భావాలుకూడా ఇంకా వుంటూనేవుంటాయి.

దోపిడీ తలెత్తడానికి ప్రయత్నిస్తూ వున్నంత కాలమూ, అది మతాన్ని బతికించడానికి ప్రయత్నిస్తూనే వుంటుంది. అందుచేత వర్గ

---

9. ఈ వార్త ఇలా వుంది—

"Beijing, August 13 (Xinbua) - More than 6, 000 Moslems gatherad at Beijing's two mosques today to celebrate the festival of fast - breaking. This is the largest number of people, attending the festival since the founding of New China in 1949. It is the first time in 31 years that Moslems in China have been given the day off for the festival." (In News from China. Issued by the Information Office Embassy of the People's Republic of China, New Delhi. No. 62 : dated August 16, 1980.)

రహిత సమాజం ఏర్పడే వరకూ మత సమాజాన్ని ఊహించలేము. ఇది ఏభయ్యేళ్ళకో, అరవయ్యేళ్ళకో జరిగే వ్యవహారం కాదు.

సరియైన శ్రామిక వర్గ చైతన్యంతో దోపిడీని వ్యతిరేకించే రాజకీయాలే మతాన్ని కూడా విప్లవకరంగా వ్యతిరేకిస్తాయి. రివిజనిస్టు ధోరణులను ఎప్పటికప్పుడు ప్రతిఘటించే వున్నతమైన రాజకీయచైతన్యం ప్రజలందరికీ ఏర్పడే వరకూ మతం మళ్ళీమళ్ళీ కోలుకొంటూనే వుంటుంది.

దేశ జనాభాలో అందరికీ (నూటికి 99 మందికి) సామాజిక శాస్త్ర జ్ఞానం కలగాలి. ప్రకృతి శాస్త్రజ్ఞానం కలగాలి. అందరూ గత కాలపు విశ్వాసాల ప్రభావాన్ని వదుల్చుకోగలగాలి, ఏ బాధలవిముక్తికై తే మనిషి భగవంతుణ్ని 'ఆశ్రయిస్తాడో', ఆ బాధల విముక్తిని మనిషి తనకు తానుగానే కలిగించుకోవడానికి వీలుగా సమాజం వున్నత స్థాయికి చేరాలి. ఆ దశ ఏర్పడే వరకూ మనిషి ఆలోచన నుంచి దేవుణ్ని పూర్తిగా తీసెయ్యడం సాధ్యంకాదు.

ఈ లోపల 'మతం' విషయంలో కమ్యూనిజం తీసుకొనే జాగ్రత్త ఏమిటంటే- 'మతం' గత దోపి' వ్యవస్థల్లో సమాజానికి ద్రోహం చేసినట్టుగా కమ్యూనిస్టు వ్యవస్థలో కూడా చెయ్యడానికి వీల్లేకుండా దాన్ని చావగొట్టి వదేస్తుంది. (పూర్తిగా చంపడం ఇంకా సాధ్యం కాదు. అంటే ప్రజలందరి మనసులలోంచీ మతభావాలు తీసెయ్యడంఇంకాసాధ్యంకాదు.)

మతాన్ని పూర్తిగా నాశనం చెయ్యాలంటే వర్గాల్ని పూర్తిగా నాశనం చెయ్యాలి.

వర్గ మానవుడు, వర్గరహిత మానవుడై అన్నివిధాలా భౌతికదృష్టి సమిష్టి దృష్టి కలిగిన వాడైనప్పుడు, మతం ఆఖరిసారిగా ఆ మానవుడి వేపు ఒక వెర్రిచూపు చూసి శాశ్వతంగా కన్నుమూస్తుంది.

మతం నశించడానికి ఇంత దీర్ఘమైన క్రమం అవసరమైవుండగా, యాభై అరవై ఏళ్ళలో మతాన్ని ఎందుకు నాశనం చెయ్యలేదని అడిగే ప్రశ్న మతం గురించి ముక్కూ మొహం తెలీని ప్రశ్న.

ఒక కమ్యూనిస్టు దేశంలో మతం నశించడానికి ఎంతకాలం పడు తుందీ అనేదీ- ఆ దేశంలో వున్న వర్గ పోరాట స్థాయినిబట్టీ, ఆ సమా జంలో వున్న సాంస్కృతిక స్థాయిని బట్టీ, అభివృద్ధికోసం ఆ సమా జంలో జరిగే కృషినిబట్టీ వుంటుంది.

ఈ సందర్భంలో అతి ముఖ్యంగా గమనించవలసిన విషయం ఏమిటంటే- "కమ్యూనిస్టు దేశంలో కూడా కొంతకాలం పాటుమతం వుంటుంది." అన్నప్పుడు, ఈ 'మతం వుండడం' అనేది, దోపిడీదేశాల్లో ఏ స్థాయిలో ఏ రూపంలో వుంటుందో అలాగే వుంటుందని అర్థమా?- కాదు. దోపిడీ దేశాల్లో మతాన్ని, ప్రభుత్వం, చంటిపిల్లని పెంచినట్టు పెంచుతూ వుంటుంది. మతానికి ప్రభుత్వం ధన సహాయం చేస్తూ వుంటుంది. దాన్ని మూడు పువ్వులా, ఆరు కాయలూగా విజృంభించేటట్టు చూస్తూ వుంటుంది.— ఇలాంటి పరిస్థితుల్లో మతం ప్రతీ చిన్నపిల్ల, మెదడులోకీ సూక్ష్మక్రిమిలా ప్రవేశించి, దాని ఆలోచనా శక్తికి అంగ వికలత్వం కలిగించి, చివరికి మనిషిని తలకాయలేని రోగిగా తయారు చేస్తుంది.

కమ్యూనిస్టు దేశంలో మతం వుండడం అంటే, దాని ఆటలేమీ సాగవు. పాపం కమ్యూనిస్టు దేశంలో మతానికి ఏ స్వేచ్ఛలూ వుండవు. దాని హక్కులూ, అధికారాలూ, ఆధారాలూ అన్నీపోయి కొంచెం నలు గుతూ ఒక మూల పడివుండడమే దాని గతి.

మతం మీద తిట్ల వర్షం మాత్రం జోరుగా కురిపించే ఏకైక లక్ష్యం గల నాస్తికుడు, కమ్యూనిస్టు దేశంలో మతాన్ని చూసి మండి పడుతూ ఈ మతమూ, దోపిడీ దేశాల్లో వున్న మతమూ ఒకే స్థితిలో

వున్నట్టు, పెద్ద పోజుగా "కమ్యూనిస్టు దేశంలో ఇంకా మతం వుందేం?" అని అడుగుతాడు.

'చైనాలో ముప్పయ్యేళ్ళయినా ఇంకా మతం పోలేదేం?' అని అడుగుతున్నాడు—సి.వి. ఈ చైనా రివిజనిస్టు చైనా. ఒకవేళ ఈ చైనా సోషలిస్టు చైనా అయినా మతం పూర్తిగా నశించడానికి 30 ఏళ్ళ కాలం చాలదు. నాస్తికులైతే ముప్పయ్యేళ్ళు పట్టకుండానే మతాన్ని 'మాయం' చేసేస్తారన్నమాట! అలాంటి మంత్రదండాలు కమ్యూనిస్టుల చేతుల్లో వుండవు. వర్గాల నిర్మూలనా, ప్రజల సాంస్కృతిక స్థాయీ పెంపూ—వంటి కార్యక్రమాలతోనే వాళ్ళు సతమతమవుతూ వుంటారుగానీ, మంత్రదండాల వ్యవహారం పెట్టుకోరు.

కమ్యూనిస్టు దేశాల్లో ఇంకా మతం వుందేం?— అని అడగడంలో సి.వి. వుద్దేశ్యం ఏమిటంటే— 'దోపిడీ పోతే మతం పోతుందనే సిద్ధాంతం తప్పు. మరి కమ్యూనిస్టుదేశాల్లో దోపిడీపోయినా మతంపోలేదు కదా? అందేత, మతాన్ని ఛోగొట్టగలిగే సరిమైన సిద్ధాంతం నాస్తికత్వమే గానీ మార్క్సిజం కాదు' అని చెప్పడమే.

ఈ సందర్భంలో ఈ నాస్తికుణ్ణి ఒక ప్రశ్న అడగాలి.

నాస్తిక సిద్ధాంతం వందల, వేల సంవత్సరాలనుంచీ ప్రచారంలోనే వుంది కదా? చార్వాకుల కాలంనించీ ప్రచారంలోనే వుంది కదా? మరి దానిద్వారా ఇంకా మతం పోలేదేం?

మార్క్సిస్టు సిద్ధాంతం వల్ల 30 ఏళ్ళలోనో, 60 ఏళ్ళలోనో మతం పోలేదేం-అని అడిగిన, నాస్తికుడు, తన సిద్ధాంతం వల్ల వేల సంవత్సరాలనించీ కూడా మతం ఎందుకు పోలేదో చెప్పాలికదా?

నాస్తిక సిద్ధాంతం వందల, వేల సంవత్సరాల నించీ ప్రచారంలో వున్నా కూడా మతం పోలేదంటే మరి మతం ఇంకెన్ని వేల సంవత్సరాలకు పోతుంది? మతాన్ని నిర్మూలించడానికి నాస్తిక సిద్ధాంతానికి ఇన్ని

వేల సంవత్సరాలు పడితే ఎలాగ? సి.వి. ప్రకారం 30 సంవత్సరాల కన్నా తక్కువ పట్టాలి కదా? నాస్తిక సిద్ధాంతం ప్రారంభమై 30 సంవత్సరాలు కాలేదా?

అసలు మతాన్ని నిర్మూలించడానికి నాస్తిక సిద్ధాంతంలో ఏం కార్యక్రమం వుంది? (తిట్ల కార్యక్రమం వున్నట్టు తెలుసుననుకోండి. అదిగాక ఇంకోటి ఏదైనా వుందా అని.)

మత సంస్థల ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడం, ఫ్యాక్టరీల్ని స్వాధీనం చేసుకోవడం— లాంటి కార్యక్రమాలేమైనా వున్నాయా నాస్తిక వాదానికి? ఇవేవీ అక్కరలేకుండానే, ఇవేవీ చెయ్యకుండానే, భక్తుల మొక్కుల్నీ, శనివారం పూజల్నీ, పుష్కర స్నానాల్నీ, పూజార్ల ధనాశనీ పట్టుకు తిడితేనే మత సంస్థలు నాశనమై పోయేటట్టయితే: నాస్తికులు మహిమాన్వితులే! పిల్లి శాపాలకు వుట్లు తెగి కింద పడ్డట్టే!

# 10. 'ప్రభుత్వ'ం పట్ల నాస్తికదృష్టి, విప్లవ దృష్టి

"ప్రభుత్వం మతాన్ని ప్రోత్సహించకూడదనీ, రేడియోలో భక్తి కార్యక్రమాలు పెట్టకూడదనీ, ఆఫీసుల్లో పూజలు చేయించకూడదనీ, బాబాలను ప్రోత్సహించకూడదనీ, ప్రజలకు నాస్తిక భావాలు కలిగించే కార్యక్రమాలు చేపట్టమనీ నాస్తికులు ప్రభుత్వాన్ని 'కోరుతూ' వుంటారు. దీన్నిబట్టి, ఈ నాస్తికులకు ప్రభుత్వ స్వభావం గురించి ఏమీ తెలీదని గ్రహించవచ్చు"—అని నేను "నాస్తికవాదం....లో" రాసినదాన్ని గురించి సి.వి.- ఇలా అంటున్నాడు.

"పేద ప్రజలకు కిలో బియ్యం రూపాయిన్నరకే అందజేయాలనీ, భూసంస్కరణలు తప్పకుండా అమలుచేయాలనీ, చుక్కలంటే ధరలు తగ్గించాలనీ, వేతనాలు పెంచాలనీ, బోనస్‌లు ఇవ్వాలనీ, స్త్రీల మాన ప్రాణా

లకు రక్షణ కల్పించాలనీ,— దేశంలోని వివిధ రాజకీయ పార్టీలూ సాహితీ సాంస్కృతిక సంస్థలూ, మహిళా సంఘాలూ ఆందోళనచేస్తూ, ప్రజలలో ప్రచారం చేస్తున్నాయి. ఈ పని ఎందుకు చేస్తున్నాయి? ఈ పొలిటికల్ పార్టీలు ఈ దోపిడీ ప్రభుత్వానికి 'అతివాద రాజకీయ పాఠాలు బోధించాలని చూడ్డం శుద్ధ బుద్ధి తక్కువే కదా! అంటున్నాడు. (పే 54)

సి.వి. ప్రస్తావించిన — వివిధ రాజకీయ పార్టీలన్నీ. సాహితీ సాంస్కృతిక సంస్థలన్నీ. మహిళా సంఘాలన్నీ "విప్లవ" దృక్పథంతో వున్నవి కావు. వాటిలో కొన్ని దోపిడీ దృక్పథంతో వున్నవీ, కొన్ని రివిజనిస్టు దృక్పథంతో వున్నవీనూ. అలాంటి సంస్థలు ఎందుకా పనులు చేస్తాయో వాటి తరుఫున చెప్పవలసిన అవసరం నాకులేదు.

విప్లవ దృక్పథం కలిగిన సంస్థలు ప్రభుత్వాన్ని ఎందుకు అడుగుతాయో, తమ ప్రచారాందోళనల్నిఏ దృష్టితో ఏ మార్గాన నిర్వహిస్తాయో, నిర్వహించాలో - వివరించవలసిన అవసరం మాత్రమే నాకు వుంది. (నేను 'విప్లవ సిద్ధాంతం' తరుఫున మాట్లాడుతున్నాను కాబట్టి).

విప్లవ దృక్పథం కలిగినవాళ్ళు కూడా ప్రభుత్వాన్ని కొన్నికొన్ని విషయాలకోసం ఎందుకు అడుగుతారంటే —

1. చట్ట బద్ధమైన అంశాల్ని అమలు చేయించుకోవడం ప్రజల హక్కు కాబట్టీ.

2. దోపిడీ ప్రభుత్వ స్వభావాన్ని ప్రజల ముందు బట్టబయలు చెయ్యాలి కాబట్టీ,

3. ప్రజల చైతన్య స్థాయినీ, పోరాట స్థాయినీ పెంచాలి కాబట్టీ విప్లవ కారులకు వుండే కార్యక్రమం, ప్రభుత్వాన్ని 'అడగడం, ఒక్కటేకాదు: ప్రభుత్వం నెరవేర్చని అంశాల్ని సాధించాలంటేప్రజలు

మత పోరాటాల ద్వారా ప్రభుత్వాన్ని లొంగదీసి, సాధించుకొనేటట్టుచేసే కార్యక్రమం కూడా విప్లవకారులకు వుంటుంది.

ప్రజల్ని పోరాటాలోకిసమీకరించే పనిని, విప్లవకారులు, చట్టబద్ధ రూపాలలో మాత్రమే గాక, చట్ట వ్యతిరేక రూపాల్లో కూడా చేస్తారు. ఈ పోరాటాలన్నీ 'ఒక విప్లవానికి' దారితీసే మార్గంలో సాగుతాయి.

విప్లవకారులు ప్రభుత్వాన్ని కొన్ని అంశాల కోసం అడగడం అనేది, వారి విప్లవ కార్యక్రమంలో ఒకచిన్న భాగంగా మాత్రమే వుంటుంది. అంతేకానీ, ప్రభుత్వాన్ని అడగటమే విప్లవకారుల పూర్తి కార్యక్రమం కాదు.

నాస్తికుల దృక్పథం ఇటువంటిదికాదు. ప్రభుత్వాన్ని 'అడగడం' అనే విషయంలో గానీ, ఏ అంశం కోసమైతే ప్రభుత్వాన్నిఅడుగుతారో ఆ అంశాన్ని సంపూర్ణంగా ఎప్పుడుపరిష్కరించుకోగలమనే విషయంలో గానీ, .... విప్లవకారులకుండే లక్ష్యాలూ మార్గాలూ నాస్తికులకు లేవు. ప్రభుత్వాన్ని ఒక అంశం కోసం అడిగి, దాన్ని ప్రభుత్వం నెరవేర్చే పక్షంలో, దాన్ని ప్రజలు తప్పనిసరిగా నెరవేర్చుకొనేటట్లు చెయ్యడానికి నాస్తికులకు కార్యక్రమం ఏదీలేదు. ప్రభుత్వం దయదల్చి ప్రసాదిస్తే ప్రసాదించినట్టూ, లేకపోతే లేనట్టూ. ఇస్తే అందుకోడం, లేకపోతే వూరుకోడం: ఇదే నాస్తికుల కార్యక్రమం.

సి.వి. ఇంకో పాయింట్ కూడా తీసుకొస్తున్నాడు. — 'మార్క్స్ ఎంగెల్సు జీవించిన కాలంలో ఫాక్టరీ కార్మికులు రోజుకి 18 గంటలు పని చేయవలసిన అమానుష విధానానికి వ్యతిరేకంగా ఆ మహనీయులిద్దరూ ఎన్నో గ్రంథాలు రాసి, ఎన్నోఉద్యమాలు నిర్వహించి, ఎంతో కృషి చేశారంటే అదంతా ఎందుకు చేశారు? ప్రభుత్వ వర్గ స్వభావం తెలీకే వారు 8 గంటల పనిదినం కోసం పోరాడారా ?' — అని కూడా ప్రశ్నిస్తున్నాడు. (పే. 55)

మార్క్స్, ఎంగెల్సులు 8 గంటల పనిదినం కోసం కృషి చేశా రంటే, ఆ కృషి నాస్తికధోరణిలో చేశారా? నాస్తికధోరణిలో ప్రభుత్వాన్ని కోరడం వల్లనే 8 గంటల పనిదినం వచ్చిందా? — కాదు అది వర్గపోరాటం ద్వారా మాత్రమే వచ్చింది.

చిత్రహింసలకూ, మరణ శిక్షలకూ పెరవక రక్తపాతంలోంచి నడిచి, లక్షల సంఖ్యలో అమెరికా కార్మికులు సంఘటితంగా ప్రభుత్వ సాయుధ బలగాల్ని ఎదుర్కోవడమూ, దీర్ఘమైన సమ్మెలు చెయ్యడమూ వంటి చర్యల ఫలితమే 8 గంటల పనిదినం. ప్రభుత్వాన్ని అర్థించి ప్రభుత్వం దయతో ఇస్తే అందుకున్నది కాదు. అంటే, వర్గ చైతన్యంతో పోరాడిన ఫలితం అది.

ఈ 8 గంటల పనిదినం కోసం కార్మికులు చేసిన పోరాటాన్ని వర్ణిస్తూ ఎంగెల్స్— "ఇప్పుడు వాళ్ళు (అమెరికా కార్మికులు) ఒక్క సారిగా సంఘటిత సమూహాలుగా పెట్టుబడిదారీవర్గం మొత్తాన్ని గడగడ లాడించారు"—అన్నారు.[10]* ఈ రకమైన పోరాటాల ద్వారా లభించిన '8 గంటల పనిదినం' ప్రభుత్వాన్ని అభ్యర్థించడంవల్ల మాత్రమే వచ్చినట్టు మాట్లాడుతున్నాడు సి. వి.

"నాస్తిక ప్రచారం చెయ్యమని ప్రభుత్వాన్ని కోరడంలో తప్పేముంది? మార్క్స్– ఎంగెల్సులు మాత్రం 8 గంటల పనిదినం కోసం ఆ పని చెయ్యలేదా?" అని వాదన చేస్తున్నాడు.

---

10. * ఈ మాటలు Florence Kelley — Wischnewetzky అనే ఆయనకు ఎంగెల్స్ రాసిన వుత్తరంలోవి.

"....now they appear all of a sudden in such organised masses as to strike terror into the Whole Capitalist Class" (In Marx & Engels. Selected Correspondence Moscow: Progress Publishers, 975. P. 372). ★

8 గంటల పనిదినం కోసం మార్క్స్-ఎంగెల్సులు చేసిన కృషి, నాస్తిక ప్రచారం చెయ్యమని ప్రభుత్వాన్ని కోరడంలో నాస్తికులు చేసే కృషి ఒకటే అయినట్టు పోజు పెడుతున్నాడీయన !

# 11. వర్గ చైతన్యం బ్రహ్మ పదార్థమా ?

"చెవిలోంచి చీముకారుతోంటే నాగేంద్రుడికి మొక్కుకుని పాముల పుట్టలో పాలుపోసే ఈ ప్రజలకి మీరు చెప్పే వర్గచైతన్యం అంత సులభంగా అర్థమవుతుందని అమాయకంగా భావిస్తున్నారా రంగనాయకమ్మ గారూ ?"— సి. వి. (పే. 51)

జబ్బులపాలైనప్పుడు వాళ్ళ అతిగతిమూ సేనాథుడులేడు దేశంలో.

గ్రామాలలో వుండే వైద్య సౌకర్యాల సంగతి, సి. వి. లాంటి వాళ్ళకితప్ప నాస్తికులలో కూడా చాలా మందికి తెలిసే వుంటుంది.

దిక్కులేని వారికి దేవుడే దిక్కు కదా !

చెవిలోంచి చీము కారితే పుట్టలో పాలు పోస్తున్నారని పరిహాసమే గానీ, వాళ్ళావని ఎందుకు చేస్తున్నారో, ఏం ఆశించి చేస్తున్నారో, వాళ్ళ 'మనసుల్ని' గ్రహించే దృష్టేలేదు సి.వి.కి.

బూర్జువా భౌతిక వాదానికీ, గతి తార్కిక భౌతికవాదికీ ఇదే తేడా!

గతి తార్కిక భౌతికవాదం, పరిస్థితులన్నిటి మధ్యా అంతర్గత సంబంధాల్ని చూసే జ్ఞానం నేర్పుతుంది.

తగిన వైద్యసౌకర్యాలులేకనే ప్రజలు, తమ జబ్బుల విషయంలో మూఢనమ్మకాల పాలబడుతున్నారనే వాస్తవాన్ని గ్రహిస్తే, ఈ మూఢ నమ్మకాల్ని పోగొట్టాలంటే వైద్య సౌకర్యాల్ని ఏర్పరచడమే ప్రధాన కర్తవ్యమని తేలిగ్గా గ్రహించవచ్చు.

"ఆస్పత్రులు వున్న వూళ్ళల్లో కూడా ప్రజలు మూఢాచారాలే పాటిస్తారు కదా?" అనొచ్చు నాస్తికులు.

ఆస్పత్రులు ఏ విధంగా వున్నాయి? అక్కడ ఎంత మందికి శ్రద్ధగా వైద్యం జరుగుతుంది? అలాంటి ఆస్పత్రులైనా ఎన్నిగ్రామాల్లో వున్నాయి?

భారత దేశంలో నూటికి 99 మందికి వైద్యం అందుబాటులో లేదు. ఆ మిగిలిన ఒక్కడూ 'మహా ధనికుడై'వుంటాడు. వాడు ఎలాగూ భారతదేశంలో వైద్యం చేయించుకోడు.

ఆస్పత్రుల వెంట నెలంతరవరకీ కాళ్ళరిగేలా తిరిగి, రోజుల తరబడీ ఆ గుమ్మాలముందు పడిగాపులుపడి, ఆస్పత్రివాళ్ళ విదిలింపులకీ, చీదరింపులకీ, డబ్బు పీడింపులకీ ఆస్తులూ, ఆత్మాభిమానాలూ పణంపెట్టి, చివరికి తప్పుడు వైద్యంతో జబ్బు తగ్గకుండానే బైటికి రావడంకాదు— వైద్య సౌకర్యం వుండడమంటే.

దేశం మొత్తం మీద ప్రైవేటు ఆస్పత్రుల్లోగానీ, ప్రభుత్వాసుపత్రుల్లోగానీ, ప్రజలకు సరైన ఆదరణతో వైద్యం చేసే పరిస్థితేలేదు.

ఇలాంటి పరిస్థితుల్లో మనుషులు చెట్లనీ, పుట్లనీ నమ్ముకోక ఏం చేస్తారు? ఈ నాస్తిక విజ్ఞానానికి ఇది పెద్ద నవ్వులాట!

ఈ విజ్ఞాని గమనించని అతి ప్రధానమైన అంశం ఒకటుంది. చెవిలోంచి చీముకారుతోందని నాగేంద్రుడికి మొక్కుకునేవాళ్ళు, ఆ మొక్కులతోటే వూరుకోరు. వాళ్ళకు చేతనైన వైద్యంకూడ ఏదో ఒకటి చేసుకుంటారు. గడ్డాకో, పువ్వాకో తెచ్చి రసంతీసి చెవిలోపోసుకుంటారు. ప్రతీ ఒక్క జబ్బుకీ వాళ్ళకి 'తెలిసిన' వైద్యం వాళ్ళు చేసుకుంటారు. 'దేవుణ్ణి నమ్మాం కదా, అంతా దేవుడే చూస్తాడు' అనే నమ్మకతోం వున్న వాళ్ళు, ఎలాంటి వైద్యాలూ చేసుకోకూడదు. కానీ, వాళ్ళు అంత మూర్ఖత్వం ప్రదర్శించరు. భౌతికజ్ఞానం అనేదాన్ని వాళ్ళకి తెలీకుండానే

వాళ్ళు పాటిస్తారు. 'భౌతికజ్ఞానం' అనే మాటని వాళ్ళు కాన్షియస్‌గా (తెలిసి) మాట్లాడరుగానీ, నిత్యజీవితంలో ఆ జ్ఞానాన్ని అనుసరిస్తూనే వుంటారు. రకరకాల చూర్ణాలూ, తైలాలూ, ఆకురసాలూ, పట్టుకాల్పులూ సూది కాల్పులూ — లాంటివన్నీ గ్రామీణ ప్రజల భౌతిక దృక్పథానికి నిదర్శనాలే. (అది మహా మొరటు రూపంలో వుండవచ్చుగాక.) ఈ పనంతో పాటు వారు మొక్కులు మొక్కుకోవడం, పూజలు చెయ్యడం, 'మంత్రాలు' వేయించుకోవడంలాంటి పనులుకూడా చేస్తూవుంటారు. ప్రజలకున్న ఈ రెండు రకాల దృక్పథాల్లోనూ, పి.వి. లాంటి వాళ్ళు, 'మూర్ఖ కోణాన్ని మాత్రమే చూస్తారుగానీ, ప్రజల వైద్య విధానంలో వున్న భౌతికదృష్టిని ఏ మాత్రమూ పట్టించుకోరు.

మానవుడు, భౌతికజ్ఞానానికి విరుద్ధమైన మూర్ఖపు పనులు చాలా చేస్తోన్నా, భౌతికజ్ఞానం కలిగిన పనులుకూడా ఎన్నో చేస్తూనే వుంటాడు. అలా చెయ్యకపోతే మానవజాతి అనేది, ఏనాడో భూమిమీద లేకుండా నాశనమైపోయి వుండేది.

నాగేంద్రుణ్ణి పూజిస్తాం కదా అని మానవుడు పాము కనబడితే చంపకుండా వుండడంలేదు. పాము కాటువేస్తే ఆకాశానికి ఒక దణ్ణం పెట్టినా, వేపాకో ఇంకో ఆకో, గడ్డో గాదమో నమలకుండా వుండడం లేదు. ఒక క్రూరమృగం తరుముకొస్తే పరుగుతీసిచెట్టెక్కకుండా దేవుణ్ణి ప్రార్థిస్తూ దాని ఎదురుగా నిలబడడం లేదు.

ప్రజలు, నిత్య జీవితంలో ప్రకృతికి సంబంధించిన అంశాల్లో ఒక భౌతిక దృక్పథంతో ప్రవర్తించబట్టే, నానాటికీ అభివృద్ధి చెంది బతికి బట్టగడుతున్నారు. అలాగాకుండా, మూఢనమ్మకాన్ని మాత్రమే పాటిస్తూ వుండిపోతే, ప్రజలలో ఈనాడువున్న 'వైద్యం' అనే మాటనే వినగలిగే వాళ్ళంకాదు.

ఇక, 'సామాజిక విషయాల'లో కూడా, ప్రజలు తమకు స్పష్టంగా తెలియకుండానే (అన్ కాన్షియస్‌గానే) భౌతిక దృక్పథాన్నే అనుసరిస్తున్నారు. ఎన్ని చెట్లనీ, ఎన్ని పుట్లనీ నమ్మినప్పటికీ, సామాజిక సమస్యల ద్వారా పుట్టుకొచ్చే పోరాటాలలోకీ వుద్యమాలలోకీ కదలకుండా ప్రజలు వుండడం లేదు. ఈ విషయాన్ని దేశదేశాల చరిత్రలూ రుజువు చేస్తున్నాయి.

పుట్టల్లో పాలుపోస్తే మూర్ఖజనం కూడా, ఒక రూపాయి కూలి ఎక్కువకావాలని అడగడానికి విముఖంగా వుండరు.

"మా కర్మ ఇది. ఎక్కువ కూలి అక్కర్లేదు మాకు ఎంత ఇస్తే అంతే మా భాగ్యం. ఏం చేస్తాం మరి? మా కర్మ!" అని తలవొంచి వూరుకోవడం లేదు.

'వర్గ చైతన్యం' అనేది, సులభంగా అర్థం చేసుకోలేని భారమైన విషయంగా నాస్తికుడి జ్ఞానానికి అనిపించవచ్చుగానీ, 'శ్రమ'లో మునిగి తేలేవాళ్ళకి అది భారమైన విషయం కాదు.

"కూలి పెంచుతావా, పెంచవా?" అని కూలీలు పొలంలోకి దిగకుండా గట్టున కూర్చున్నారంటే, దాని అర్థం వాళ్ళు వర్గ చైతన్యంతో ప్రవర్తిస్తున్నారని. శ్రమచేసే వ్యక్తిలో వర్గ చైతన్యం ఎప్పుడూ బీజ రూపంలో వుంటుంది. దాన్ని సరైన దారిలో పెంచి పెద్ద చెయ్యడమే మార్క్సిజం చేసే పని.

వర్గ చైతన్యం అనేది 'బ్రహ్మ పదార్థం' కాదు, సులభంగాఅర్థం గాకపోడానికి.

"....ఈప్రజలకి, మీరు చెప్పే వర్గ చైతన్యం సులభంగా అర్థమవుతుందను కుంటున్నారా?"—అని ఆశ్చర్య పడుతున్నాడు సి.వి.ఆయన అభిప్రాయం, ప్రజలకి వర్గ చైతన్యంకన్నా నాస్తిక చైతన్యమే సులభంగా అర్థమవుతుందని.

వాళ్ళ తిండికీ, గుడ్డకీ సంబంధించిన విషయమే వాళ్ళకి సులభంగా అర్థం గాకపోతే, దేవుడు వున్నాడో లేడో, దేవుడు లేకుండానే ప్రకృతి ఏ క్రమంలో పరిణామం చెందిందో చెప్పే సంగతులూ సులభంగా అర్థమయ్యేవి. సరిగ్గా ఇలాంటి వాదానికే జవాబు చెపుతూ లెనిన్ 'ప్రజలు వర్గ పోరాటాల ద్వారానే జ్ఞానం నేర్చుకోలేక పోయిన పక్షంలో, ఇంకే విధంగానూ జ్ఞానం నేర్చుకోలేరు. అన్నాడు. ఆ మాటలు చూడండి.

"పెట్టుబడిదారీ విధానం యొక్క దుష్ట శక్తులకు వ్యతిరేకంగా తాను స్వయంగా సాగిస్తున్న పోరాటం వల్లనే శ్రామిక వర్గం ప్రబోధితం కాకపోయిన పక్షంలో, ఎన్ని పుస్తకాలైనా సరే, ఎంత హితోపదేశమైనా సరే శ్రామిక వర్గాన్ని ప్రబోధితం చేయజాలవు"

"సంఘటిత మైనటువంటీ, పథకాత్మక మైనటువంటీ, చైతన్య యుత మైనటువంటీ మార్గంలో— మతం యొక్క మూలంపై, అనగా అన్ని రూపాలలోనూ వున్న పెట్టుబడి పరిపాలనపై, తమంత తామే పోరాడటం నేర్చుకోనంత వరకూ— పెట్టుబడిదారీ విధానం విధించే నడుములు విరగ్గొట్టే చాకిరీ కింద నలిగి సుంఠపింపైపోతున్నటువంటీ, పెట్టుబడిదారీ విధానపు వినాశకరమైన గుప్తబలాల దాసూ దాక్షిణ్యాలకు గురి అవుతున్నటువంటీ ప్రజారాసుల మనస్సుల నుండి మతాన్ని ఎట్టి ప్రబోధాత్మక గ్రంథమూ నిర్మూలించజాలదు"

అందుచేత, ప్రజల్ని వర్గ చైతన్యమే మేల్కొల్ప లేకపోతే నాస్తిక చైతన్యం అంతకన్నా మేల్కొల్ప జాలదు.

ప్రజలకి వర్గ చైతన్యమే బోధపడకపోతే, నాస్తిక చైతన్యం అంతకన్నా బోధపడదు.

వెలిగొండి భీమునాకే జబ్బుతో బాధపడేవాళ్ళు, 'నాగేంద్రుడి' నించి ఎటువంటి రక్షణనీ, ఎటువంటి సౌభాగ్యాన్నీ కోరుతున్నారో, ఆ

రక్షణనీ, ఆ సౌఖ్యాన్ని సమాజమే కలిగించినప్పుడు మాత్రమే వారిని విజ్ఞానవంతుల్ని చెయ్యడం సాధ్యమవుతుంది.

ఈ రకం విషయాల గురించే మార్క్స్ ఇలా అన్నాడు.

"ప్రజలలో 'భ్రమలతో కూడిన ఆనందం'గా వున్న మతాన్ని విసర్జించడం అంటే అర్థం, ప్రజలకోసం 'నిజమైన ఆనందాన్ని' కోరడమే. వునికిలోవున్న పరిస్థితులకు సంబంధించిన భ్రమల్ని తీసివెయ్యడం అంటే అర్థం, భ్రమల అవసరాన్ని కలగజేసే పరిస్థితుల్ని తీసివెయ్యాలనడమే."[11]

అందుచేత, భారతదేశ గ్రామాలలో చెవిలోంచి చీము కారే మనిషి పుట్టలో పాలు పొయ్యడం చూసి, 'పిల్లలు బాగుపడతారా' అని ఆశ్చర్య పడక్కర్లేదు. "నాగేంద్రుడు చేసే వైద్యం" సమాజమే చేసినప్పుడు, నాగేంద్రుడు ఎగిరిపోతాడు.

# 12. మరింత విప్లవకారుడు

"రెండు కాళ్ళ మృగాల్లా జీవిస్తోన్న కోట్లాది గ్రామీణ ప్రజల్ని, గాంధీ సిటీల్లోంచి కాకుండా నేరుగా గ్రామాల్లోకి కదిలించింది. అప్పుడు-అప్పుడే, అప్పుడే, పరమ భీకరమైన, అంధ విశ్వాసాల మయమైన,

---

11. * ఈ మాటలు కూడా మార్క్స్ రాసిన Contribution to the Critique of Hegel's Philosophy of Law — Introduction లోవే.

ఆ కొటేషన్ ఇలా వుంది : "To abol sh relig'on as the illusory happiness of the People is to demand their real happiness. The demand to give up illusions about the existing state of affairs is the demand to give up a state of affairs which needs illusions." ★

వారి చీకటి బతుకులు మీకు గోరంత అర్థం కావడానికి వీలుంటుంది"—
పి. వి. (పే. 51)

మీరు వెళ్ళే వుంటారుగా గ్రామాల్లోకి తరలి? గ్రామాల్లోకి 'తరలి' కూడా గ్రామీణుల సమస్యల్ని ఇంత గొప్పగా అర్థం చేసుకున్నారేం మరి?

గ్రామాల్లోకి తరలిన మీకు ప్రజల 'మూఢాచారాలే'గానీ, వారి 'దారిద్ర్యం' కనపడలేదా? తాగడానికి మంచినీళ్ళు కూడా లేని వాళ్ళ 'దౌర్భాగ్యం' కనపడలేదా? వారి పేదరికం కన్నా, ఇష్టలో పాలు పొయ్యడం లాంటి పనులు 'ఘోరంగా' కనబడ్డాయా మీకు?

రెండుకాళ్ళ మృగాల్లా జీవించే ప్రజల జీవన పరిస్థితులు చూసి కూడా వారిని శాశ్వతంగా రెండుకాళ్ళ మృగాల్లాగే వుంచే సిద్ధాంతాన్ని అంటిపెట్టుకున్నారేం?

'ఆకలి'లోకన్నా 'మత నమ్మకా'ల్లోనే ఎక్కువ విషాదాన్ని చూడ గలిగిన మీ హృదయ స్పందనలోనూ, మీ గ్రహణశక్తిలోనూ, మీ భౌతిక జ్ఞానంలోనూ 'బూర్జువా అంశ'ని గుర్తించిన వాళ్ళు, మీ వాదనల్ని అతి సునాయాసంగా తిప్పికొట్టగలరు.

'గ్రామంలోకి తరలండని' ఒక నినాదం వాడగానే మీరు గ్రామీణ ప్రజలకు మిత్రులైపోయారా?

గ్రామీణ జీవితాన్ని, లెనిన్, మీకన్నా ఘణ్ణంగానే, మీకన్నా సరి యైనగానే పరిశీలించాడు. అదంతా అయినతర్వాత చెప్పిందే 'నాస్తి కత్వానికి ప్రథమస్థానం ఇవ్వరాద'నే మాట. లెనిన్‌కి కూడా గ్రామ జీవితం తెలిసే ఆ మాటలు చెప్పాడంటారా?

గ్రామంలో పుట్టి, గ్రామంలో పెరిగి, ఈనాటికీ గ్రామంతో సంబంధం వున్న రంగనాయకమ్మకి గ్రామ జీవితం తెలీదని ఏంమచేత అనుకున్నారు మీరు?

లెనిన్ చూసిన రష్యన్ గ్రామ జీవితానికీ, ఈనాటి భారతీయ గ్రామ జీవితానికీ అనేక విషయాలలో అనేక తేడాలు వున్నప్పటికీ, 'వర్గ చైతన్యానికి ప్రథమ స్థానం ఇచ్చి, నాస్తిక చైతన్యానికి రెండో స్థానం ఇవ్వాల'నే అంశాన్ని, ఈనాటికీ, ఏనాటికీ మార్చవలసిన అవసరంలేదనే విషయం రంగనాయకమ్మ సరిగ్గానే గ్రహించింది.

'నాస్తికవాదం'వల్ల 'మేలు' జరుగుతుందని నమ్మినవాళ్ళు, గ్రామాలలోగానీ, పట్టణాలలోగానీ పేద ప్రజల జీవితాల్లో విషాదాన్ని నిజంగా చూడగలిగితే, దానికి కారణం ఏమిటో వివరించే సిద్ధాంతం వాళ్ళ కళ్ళ ముందుకు వచ్చినప్పుడు వెంటనే దాన్ని పోల్చి, ప్రజలకు మేలు జరగాలన్నదే వాళ్ళ కోరిక గనక నాస్తికవాదాన్ని అవతలపెట్టి, ముందా 'మేలు చెయ్యగలిగే వాదాన్నే' చేపడతారు.

కానీ, గ్రామాల్లోకి తరలి కూడా మీరు నాస్తికవాదాన్నే అంటిపెట్టుకు వున్నారు మరి!

మార్క్సిస్టులకంటే మరింత విప్లవాత్మకంగానూ, మరింత ప్రజాహితంగానూ, మరింత వామపక్షంగానూ వున్నవని చాటుకొనడానికే ఈ 'గ్రామాల్లోకి తరలండ'నే వినాదం! ఓటి కుండకి మోత ఎక్కువ కదా?

నిజాన్ని గ్రహించడానికి ఇష్టమూ, దాన్ని స్వీకరించే సంసిద్ధతా లేనివాళ్ళు గ్రామాలలోకి తరిలినంత మాత్రన్నే జ్ఞానవంతులు కాలేరు.

పాయసంలో తెడ్డు ఎంత గ్రహిస్తుంది పాయసం రుచిని ?

# 13. నా "కపటత్వం"

రంగనాయకమ్మమీద చేసే విమర్శల్లోకి 'చలాన్ని' తీసుకొచ్చి ఆయన్ని నాలుగు తిట్లుతిట్టి, అది కూడా నాస్తికవాదానికి సంబంధించిన సిద్ధాంత చర్చే అనుకుంటున్నాడు వి. వి.

"....(చలం) ఎడ్యుకేటెడ్ బ్రూట్‌గా మారి అరుణాచలంలో ఆధ్యాత్మిక గులాంగా ఎందుచేత తయారయ్యాడు ?" (పే. 33)

"....మనసులో చలంపై భక్తినీ, బయటికి నోషణిజం పట్ల అనురక్తినీ ప్రదర్శించే కొందరు కపటులు...." (పే. 60)

"మార్క్సిస్టు సిద్ధాంతంపై యింతటి వల్లమాలిన అభిమానం వలకబోస్తోన్న ఈమె, చలం భక్తకోటిలో ఎందుచేత చేరిందో వివరించగలదా ? దైవభావాన్ని వ్యతిరేకిస్తున్నానని చెప్పే ఈమె, దైవ భావానికి బానిసమైన చలాన్ని ఎందుచేత సమర్థిస్తున్నదో వివరించగలదా?" (పే. 52)

ఈ రకంగా వృత్త మురికి తర్కంతో, మురికి ప్రశ్నలు గుప్పించి, ఇక వీటికి రంగనాయకమ్మ సమాధానాలు చెప్పలేదన్నంత అజ్ఞానపు విర్రవీగుడు ప్రదర్శిస్తున్నాడు.

'దైవ భావాన్ని వ్యతిరేకిస్తున్నానని చెప్పే ఈమె దైవ భావానికి బానిసమైన చలాన్ని' సమర్థిస్తే, ఆ సమర్థింపు దైవభావం కోసం చేసేదేనా ? "ఎందుచేత సమర్థిస్తోంది" అనే ప్రశ్నకి పి. వి. జ్ఞానానికి జవాబు అందడంలేదా ?

రంగనాయకమ్మ చలాన్ని సమర్థిస్తోంది అంటే చలంలో వున్న దైవ నమ్మకాన్ని కూడా సమర్థిస్తోందా? చలాన్ని ఆధ్యాత్మిక విషయాంతో సహా స్వీకరిస్తోందా ?

దేవుణ్ణి నమ్మే ఒక వ్యక్తిని, 'దేవుణ్ణి నమ్ముతాడు' అనే కారణంతో సంపూర్ణంగా తిరస్కరించాలా? సంపూర్ణంగా వ్యతిరేకించాలా ?

అయితే, ప్రపంచంలో నూటికి 99 మంది ప్రజల్ని తిరస్కరించాలి.

భారతదేశపు ప్రజల్లో నూటికి 99 మందిని, చదువుకున్న బ్రూట్లుగానో చదువుకోని బ్రూట్లుగానో పరిగణించి జాలిభావించి తీసిపారెయ్యాలి.

పి. వి. రకం నాస్తికుడు ఎంత మూర్ఖుడో, ఎంత అజ్ఞానో, ఎంత ప్రజా వ్యతిరేకో గ్రహించడానికి ఈ ఒక్క అంశం చూస్తే చాలు.

"రంగనాయకమ్మ చలం భక్త కోటిలో ఎంచేత చేరిందో వివరించ గలదా ?" అని ఒక వెకిలి ప్రశ్న!

రాజకీయంగా అభివృద్ధి విరోధకుడూ, భావవాదీ అయిన హెగెల్‌ని, మార్క్స్—ఎంగెల్స్‌లు ఏ కారణంచేత గౌరవించారో:

మహాభక్తుడూ, మత మూఢుడూ అయిన టాల్‌స్టాయిని, లెనిన్ ఏ కారణంచేత గౌరవించాడో:

అభివృద్ధి విరోధక రమణ తత్వాన్ని విశ్వసించినవాడూ, తన సాహిత్యంలో కొన్ని అశాస్త్రీయాంశాలను బోధించినవాడూ అయిన చలాన్ని, రంగనాయకమ్మ ఆ కారణంచేతే గౌరవించింది.

హెగెల్ నించి మార్క్స్—ఎంగెల్సులు, ఎలా 'చెడ్డని తిరస్కరించి మంచిని' తీసుకున్నారో:

టాల్‌స్టాయి నించి లెనిన్ ఎలా 'చెడ్డని తిరస్కరించి మంచిని తీసుకున్నారో:

చలం నించి రంగనాయకమ్మ అలాగే చెడ్డని తిరస్కరించి మంచిని తీసుకుంది.

నెగిటివ్ అంశాల్ని తిరస్కరించి పాజిటివ్ అంశాల్ని తీసుకోవడమూ, అసమగ్రంగా వున్నదాన్ని సమగ్రం చేసుకోవడమూ— అనే ధోరణి లేని నాస్తికుడు, ఈ విషయాలు కనీసంగా కూడా అర్థం చేసుకోలేడు.

"చెడ్డని తిరస్కరించి మంచిని తీసుకోవాలనే అంశాన్ని నేనూ అంగీకరిస్తాను. కానీ, చలంలో అసలు మంచేలేదు, వున్నదంతా చెడ్డే. అంతా తిరస్కరించవలసిందే"—అని చెప్పదల్చుకున్నారా సి. వి ?

"చలంలో మంచే లేదు" అనే అభిప్రాయమే సి. వి. కి వుంటే, చలాన్నెందుకు సమర్థించాలని వాదించడానికి సి.వి. కి హక్కు వుంటుంది. కానీ, చలం గురించి సి. వి. తన పుస్తకంలోనే రాసిన ఈ మాటలు చూడండి. "స్త్రీని కేవలం అంటకుండగా — పట్టిచెడ్డగా— మసిగుడ్డగా—

భోగవస్తువుగా తలచిన హిందూ సనాతనుల ధోరణిని చీల్చి చెండాడ దానికి చలం ఎన్నో పుస్తకాలు రాశాడు." (పే. 55)

ఈ సి.వి., ఇంకో సందర్భంలో కూడా చలాన్ని అమృతంగా కీర్తించాడు.[12]

చలంలో వున్న పాజిటివ్ అంశాన్ని వుదహరించడమూ, కాదా ఇది? ఒక వ్యక్తిలో స్వీకరించదగ్గ అంశం వున్నప్పటికీ, ఆ వ్యక్తి దేవుణ్ణి నమ్మేవాడైతే అతన్నించి ఏమీ తీసుకోకుండా అతన్ని పూర్తిగా తిరస్కరించాలన్నమాట సి.వి. ప్రకారం!

'దేవుడితో సంబంధం వున్న ప్రతీదాన్నీ సంపూర్ణంగా తిరస్కరించి, దేవుడితో సంబంధం లేని ప్రతీదాన్నీ సంపూర్ణంగా స్వీకరించే' పరమ జుగుప్సాకరమైన, నిస్సిగ్గుదైన, 'యాంత్రిక నాస్తిక ధోరణిని అడుగడుగునా ప్రదర్శిస్తున్నాడు సి.వి.

నాస్తికత్వం ఒక మూఢ మతంలాగా, ఒక డాగ్మాలాగా వుంటుందనడంలో అర్థం ఇదే.

మార్క్సిస్టు అయినవాడు, 'దేవుణ్ణి నమ్ముతాడనే' కారణంతో ఎవ్వర్నీ బ్రూట్సుగా పరిగణించడు. దేశంలో ప్రతివ్యక్తీ నాస్తికుడిగా

12. * 'అరుణశ్రీ' అనే ఆయన రాసిన 'ఊర్న్యకి స్వాములవారు పేం చేశారు' అనే పుస్తకానికి 'పీఠిక' రాస్తూ అందులో సి.వి. చలం గురించి ఇలా రాశాడు. "తెలుగుజాతి సాంస్కృతిక గనుల్లో, ఎదల్లో, శతాబ్దాల తరబడి పేరుకుపోయిన బూజునూ, దుర్గంధాన్నీ అడుగడుగునా, అణువణువునా కడిగివేసిన చెలం, నవ్యాంధ్ర సాహితీ చరిత్రలో మహోజ్జ్వల అధ్యాయాన్ని సృష్టించి, అజరామరమైన మహాప్రస్థానానికి యోగ్యతా పత్రం పేరిట పీఠిక రాశాడు"— ఇది చలాన్ని కీర్తించడం కాదా? నాస్తికుడైన సి.వి., భక్తుడైన చలాన్ని ఎందుకు కీర్తించినట్టు? ★

వుండి తీరాలని ఆజ్ఞాపించడు. భక్తుడిగా వుండడానికిగానీ, నాస్తికుడిగా వుండటానికిగానీ మనిషికివున్న హక్కుని మార్క్సిస్టు గుర్తిస్తాడు.

మార్క్సిస్టులైన వాళ్ళు మాత్రం 'సంపూర్ణమైన భౌతికవాదులు'గా 'గతి తార్కిక భౌతిక వాదులు'గా వుండాలని మార్క్సిస్టు డిమాండ్ చేస్తాడు. ఈ డిమాండ్‌ని మార్క్సిస్టు కాని వాళ్ళకి వర్తింపజెయ్యడు.

ఇదేమీ గ్రహించ లేనివాడే నాస్తికవాద స్థాయిలో దిగబడిపోతాడు.

"మనసులో చలంపై భక్తినీ, బయటికి సోషలిజం పట్ల అనురక్తినీ ప్రదర్శించే కొందరు కపటులు........" అన్నాడు సి.వి.

'కపటత్వం' అనేది ఎప్పుడు?

చలం సాహిత్యంపై నా ఇష్టాన్ని బయటికి చెప్పకుండా రహస్యంగా వుంచానా? బయటికి చెప్పడానికి సిగ్గుపడ్డానా? చెప్పేదానికీ, చేసేదానికీ పొంతన లేకుండా ప్రవర్తించానా?

ఒకపక్క సోషలిస్టులమని చెప్పుకుంటూ, 'సోషలిజానికి ద్రోహం చేసే నాస్తిక వాదాని'కి గులాములుగా సేవ చేసేవాళ్ళు కపటు లవుతారు గానీ, ఒక సాహిత్యంలో చెడ్డని తిరస్కరించి, మంచిని స్వీకరించాలని స్పష్టంగా చెప్పేవాళ్ళు ఎన్నటికీ కపటులు కారు.

# 14. కొన్ని ఇతర విషయాలు

ఈ వొద్దరులో నేను ఐదారు చిన్నచిన్న అంశాలను గురించి చర్చిస్తాను.

(1) సి.వి. –తన 'జాబాలి' పీఠికలో ఏ అభిప్రాయమైతే వెల్లడించాడో, అదే అభిప్రాయాన్ని (దాంట్లో నేను అనేక వైరుధ్యాలు చూపించినప్పటికీ కూడా) మళ్ళీదాన్నే, ఇప్పుడు కూడా వెల్లడించాడు.

"లోకాయత వుద్యమం-బానిసలకీ, బానిస యజమానులకీ జరిగిన వర్గ పోరాటం కాదా?" అంటున్నాడు (పే. 63)

('లోకాయత' ప్రద్యుమం, అంటే 'నాస్తిక ప్రద్యుమం' అని. పాఠకులు 'నాస్తిక' అనే మాటనే ఎక్కువ పరిచయంగా అర్థం చేసుకోగలుగు తారు కాబట్టి, సి.వి. వాక్యంలో 'లోకాయత ప్రద్యుమం' అనే మాటని 'నాస్తిక ప్రద్యుమం'గా మార్చి నేను మళ్ళీ రాస్తున్నాను)

"నాస్తిక ప్రద్యుమం- బానిసలకీ, బానిస యజమానులకీ జరిగిన వర్గ పోరాటం కాదా?" అంటున్నాడు సి.వి.

దీన్ని గురించి నేను "నాస్తికవాదం....."లో చాలా చెప్పాను. అయినా ఇక్కడ ఒక్క విషయం మాత్రం చూద్దాం.

'నాస్తిక ప్రద్యుమం' అనేది జరిగితే దానికి సంబంధించిన రెండు పక్షాలవారూ ఎవరెవరుగా వుంటారు?

నాస్తికులూ x భక్తులూ.

నాస్తికులూ భక్తులూ పోట్లాడుకున్నదాన్ని ఒక 'వర్గ పోరాటం'గా భావించడం అంటే, నాస్తికుల్ని ఒక వర్గంగానూ, భక్తుల్ని రెండోవర్గంగానూ భావించడం!

అంతేనాక, నాస్తికులూ భక్తులూ పోట్లాడుకున్న దాన్ని బానిసలకూ, యజమానులకూ జరిగిన పోరాటంగా భావించడం అంటే,

బానిస లందర్నీ నాస్తికులుగానూ,

యజమానులందర్నీ భక్తులుగానూ భావించడం..

ఇలా భావించడంలో వున్న తప్పేమిటో ఇక్కడ మళ్ళీ నేను చెప్పక్కర్లేదు. ఇప్పుడు నేను చెప్పదల్చుకున్నదేమిటంటే — నేను తప్పుడు కొటేషన్లు ఇచ్చినట్టుగా సి.వి. నా మీద ఒకఆరోపణ చేస్తున్నాడు.. దాన్ని గురించే ఇక్కడ నేను వివరిస్తాను.

'నాస్తికత్వం ఇలా భావిస్తోంది'

'ఆయన ఇలా భావిస్తున్నారు'

'ఆ మాటలకు ఇలాంటి అర్థం వస్తోంది'- అని అనేకసార్లు వివరణ కోసం చెప్పవలసి వస్తుంది.

'భావిస్తున్నాడు' అనే దానికి అర్థం ఆ వ్యక్తి సరిగ్గా ఈ పదాలే, ఈ అక్షరాలే అన్నాడు' అని చెప్పడం తమ. ఆ వ్యక్తి అభిప్రాయాన్ని నా మాటలతో నేను చెప్తూ ఆ వ్యక్తిని ఇలా భావిస్తున్నాడు' అంటాను.

"అలా నేనెక్కడన్నాను?" అని ప్రశ్నిస్తే ఆ ప్రశ్న ఎలా వుంటుంది?

వుదాహరణకి—"లోకాయత వుద్యమం......... వర్గ పోరాటం కాదా?" అని సి.వి. అన్నదాన్ని గురించి చర్చిస్తూ నేను ఒకచోట —"బానిసలందర్నీ నాస్తికులుగానూ, యజమానులందర్నీ భక్తులుగానూ సి.వి. భావిస్తున్నాడు." అంటానను కోండి.

దానికి సి.వి. – ఆ మాటలు నేనెక్కడన్నాను? బానిసలందరూ నాస్తికులనీ, యజమానులందరూ భక్తులనీ నేనెక్కడన్నానో, ఏ పుస్తకంలో ఏ పేరాలో అన్నానో, రంగనాయకమ్మ కోట్ చెయ్యగలదా? ఆ మాటలు నేనెక్కడన్నానో చూపించాలని రంగనాయకమ్మని సవాల్ చేస్తున్నాను." అని వాదనకి దిగితే ఆ వాదం ఎంత సొగసుగా వుంటుంది.

నేను మిస్‌కోట్ చేశానని గోల పెట్టిన ప్రతీ సందర్భంలోనూ జరిగింది ఇదే.

"నేనలా అన్నానా?" అంటూ వుంటాడు సి.వి.

నువ్వు అలాగే అన్నావని కాదు. నువ్వు ఏ మాటలైతే అన్నావో ఆ మాటల్ని పరిశీలించినప్పుడు, వాటికి 'ఇలాంటి అర్థం' వొస్తుందని నా మాటలతో నేను చెపుతాను. చర్చలోకి దిగిన వాళ్ళెవరైనా ఈ పనే చేస్తారు.

'ఆయన ఇలా భావిస్తున్నాడు. ఇలా అభిప్రాయపడుతున్నాడు' అని విషయం ఇవ్వకుండా చెప్ప నడవదు. చెప్పించే వ్యక్తి తన స్వంత మాటలతో ఒక సంగతి వివరించడం తప్పుకాదు సరికాదా, అలా వివరించి తీరాలి. వివరిస్తేనే పాఠకులు అసలు విషయం అర్థం చేసుకో గలుగుతారు.

ఎ.పి.ని నేను మిస్‌కోట్ చేశానా— అనే దాన్ని గురించి నా పుస్తకమూ అతని పుస్తకమూ చదివి పరిశీలించండి.

రంగనాయకమ్మ మిస్‌కోట్ చేసిందనే పాయింటు లేవనెత్తి, దాని వెనక రక్షణ తీసుకోదలిచాడు సి.వి.

(2) జయగోపాల్ గురించి కూడా సి.వి. అడుగుతున్నాడు.

'జయగోపాల్ ఆ మాట ఎక్కడన్నాడు? ఈ మాట ఎక్కడన్నాడు?' అని రెట్టించి, రెట్టించి అడుగుతున్నాడు. (పే. 51)

"నాస్తికవాదం........"లో నేను జయగోపాల్ పేరే ఎత్తలేదు. అయితే, జయగోపాల్ నడిపే పత్రిక ధోరణిని విమర్శించాను.

నా విమర్శం కన్నిటికీ ఆధారం ఆ పత్రిక ప్రచురించిన రచనలే. దాని సంపాదకీయాల్ని బట్టీ, దాని వ్యాసాల్ని బట్టీ, దాని రిపోర్టుల్నిబట్టీ దాని స్వభావాన్ని గ్రహించి నేను విమర్శ చేశాను.

ఎవరైనా, ఒక 'పత్రిక' స్వభావం గురించి మాట్లాడుతున్నారంటే, ఆ స్వభావాన్ని ఆ పత్రిక వింటే తీసుకుంటారనేది అందరికీ తెలిసిన విషయమే. "నాస్తిక యుగం" పత్రిక మీద నేను చేసిన విమర్శలకు ఆధారం దాని రచనలే అనే సంగతి నేను "నాస్తికత్వం—ఒక పరిశీలన" లోనే వివరించాను.

సరే, ఇప్పుడు అంతకన్నా వివరాలు సి. వి. కి కావలసి వుంటే— ఆ పత్రికలో, "నాస్తికత్వం — దాని స్వరూపం" • అనే పేరుతో 1976

సెప్టెంబరు సంచిక నించీ, 1977 జనవరి సంచిక వరకూ వచ్చిన సంపాదకీయ వ్యాసాలు చూడొచ్చు. నా విమర్శలకు ఆధారాలన్నీ వాటిలో వున్నాయి.

అంతేగాదు, 1976 డిసెంబరు సంచికలో, భారత నాస్తిక సమాజం (వారి) 'లక్ష్యాలు—ఆశయాలు' వివరణ చూడొచ్చు.

భారత నాస్తిక సమాజమే "నాస్తిక యుగం" పత్రికని ప్రచురిస్తోంది. ఆ సమాజానికి వున్న లక్ష్యాలలో "శ్రమదోపిడీ"కి సంబంధించిన మాట ఒక్కటైనా లేదు. (వుండాలని నేననడంలేదు. మాకూ ఆ దృష్టి వుందని నాస్తికులు వాదిస్తున్నారు కాబట్టి, అది నిజంకాదని చూపిస్తున్నాను.) ఆ పత్రిక ప్రచురించిన లక్ష్యాలు ఏవీ కూడా ప్రజల ఆర్థిక పరిస్థితివేపు చూడడంలేదు. పైగా, నాస్తికత్వమే మతాన్ని నిర్మూలిస్తుందని వారు ప్రకటించుకుంటున్నారు. ఆ మత నిర్మూలన పనిని, ; ఈ సమాజం చెక్కుచెదరకుండా ఇలా వుండగానే, ఈ ప్రభుత్వ చట్టాలకు లోబడే, చేస్తామంటున్నారు.

ఆ లక్ష్యాలలో 4వ నెంబరు దాన్ని చూడండి. "నూతన ఆలోచనలను, భావ స్వాతంత్ర్యాన్ని చట్టబద్ధమైన పద్ధతులలో ప్రేరేపించి ప్రచారం చేయడం. నైతిక, తాత్విక శాస్త్ర విషయాలు, వాటి కనుబంధమైన ఇతర శాస్త్రాల విషయాలు నాస్తిక ధోరణి కనుగుణంగా కొనసాగేటట్లు చేయడం. నాస్తికత్వం మాత్రమే భగవంతుడిమీది విశ్వాసాన్ని సమూలంగా నాశనం చేయగలదని ప్రచారం చేయడం."- ఇలాంటి ధోరణి వీరి పత్రికలన్నిటినిండా తేటతెల్లంగానే కనిపిస్తోంది.

"నాస్తిక యుగం" గురించిగానీ, ఇంకొకరి గురించిగానీ నేను ఒక విమర్శ చేశానంటే తగిన ఆధారాలు వుండబట్టే ఆ పని చేశాను. నా ప్రతీ ఒక్క విమర్శకీ నేను ఆధారాలు చూపించగలను.

తమ వాదంలోవున్న లొసుగులు బయటపడేసరికి, ఈ నాస్తికులు 'మేము అలా ఎక్కడన్నాము?' 'అలా ఎవరున్నారు?' అనే పద్ధతిలో ఎదురు వాదం సాగిస్తున్నారు.

నేను ఏ విషయాలనైతే విమర్శించానో ఆ విషయాలన్నీ వాళ్ళు ప్రచారం చేసుకుంటున్నవే. సామాజిక మార్పులకు నాస్తిక భావాలే కారణం అనేది వాళ్ళు రాసుకున్నదే. మౌలిక సమస్యల్ని పట్టించుకోక పోవడం వాళ్ళు చేస్తున్నదే. ఆ విషయాల్ని విమర్శిస్తే మాత్రం తమ సిద్ధాంతం అది కానే కానట్టు, "ఆ మాట ఏ నాస్తికుడన్నాడు? అంత బుద్ధిహీనుడెవడున్నాడు? అని దబాయింపులు!

తమ సిద్ధాంతంలోవున్న లోపాల్ని అర్థంచేసుకోడానికి ఏమాత్రం ప్రయత్నించినా వీరికి ఈ దబాయింపుల గతి పట్టదు.

(3) మిత్రాలో ఏ అంశాలనైతే నేను విమర్శించానో వాటినే మళ్ళీ ఎత్తి పి.వి. - "ఇందులో మిత్రా చేసిన పొరపాటేమిటి?" అని అడుగుతున్నాడు. (పే. 61)

పొరపాటేమిటో నేను ఆ పుస్తకంలోనే చెప్పాను. అక్కడ అర్థం చేసుకోదల్చని వ్యక్తి ఇక్కడా అర్థం చేసుకోదల్చడు కాబట్టి, మళ్ళీ చెప్పవలసిన అవసరంలేదు.

మళ్ళీ మళ్ళీ చెప్పడం అనేది ఎప్పుడు చేయవలసి వస్తుందంటే— ఎదటి వ్యక్తి తన వాదాన్ని కొత్తన్నా మార్చినప్పుడుగానీ, తనమీద వచ్చిన విమర్శల్ని గ్రహించి, కొత్త సందేహాలు వెలిబుచ్చినప్పుడుగానీ.

(4) నేను నాస్తికవాదాన్ని అడిగిన ప్రశ్నలే మళ్ళీ తిప్పి వన్నడుగుతున్నాడు పి. వి.

నేనిలా అడిగాను— 'మత మౌఢ్యానికి సైన్సు తెలియకపోవడమే కారణమైతే, బాగా చదువుకున్నవాళ్ళూ, సైన్సు తెలిసినవాళ్ళూ కూడా

మత మౌఢ్యంలోనే ఎందుకు వుంటున్నారు? డాక్టర్లూ, సైంటిస్టులూ కూడా మత మౌఢ్యంలోనే ఎందుకు వుంటున్నారు? దీనికి నాస్తికులు జవాబుచెప్పాలి'— అని అడిగాను నా పుస్తకంలో.

నా ప్రశ్నలకు తను జవాబు చెప్పడంపోయి, నన్ను జవాబు లడుగుతున్నాడు. సి.వి. "ప్రకృతి జ్ఞానం పుష్కలంగావున్న సూరి భగవంతం సాయిబాబాకి ఎంచేత శిష్యుడయ్యాడు? చదువులేని సామాన్య జనంతో పాటు, చదువుకున్న మూర్ఖులు కూడా దైవ భావానికి బానిసల్లా ఎంచేత మారుతున్నారు?" అన్ని ప్రశ్నలు గుప్పిస్తున్నాడు నామీద (పే. 33).

ఈ ప్రశ్నలకు జవాబులు చెప్పవలసింది, 'సైన్సు తెలిస్తే మతాన్ని నమ్మరు' అని వాదించే నాస్తికులా? ఇతరులా?

సైన్సు తెలిస్తే మతం పోతుందనే సిద్ధాంతాన్ని అంటి పెట్టుకుని వున్న నాస్తికులే ఆ ప్రశ్నలకు జవాబులు చెప్పుకోవాలి: తర్వాత వాళ్ళు ఇతర్లకు చెప్పాలి.

అన్నిటికన్నా ముందు సి.వి. రకం నాస్తికులు, తమ వాదం ఏమిటో ఇతరుల వాదం ఏమిటో గ్రహించడంలో కొంచెమన్నా ఇంగిత జ్ఞానం కలిగి వుండాలి. లేకపోతే, ఏది అడగాలో ఏది అడక్కూడదో గ్రహించుకోలేక, తమ సిద్ధాంతం పీకలమీదకే తెచ్చుకుంటారు.

చదువుకున్న వాళ్ళు కూడా మత మౌఢ్యంలోనే ఎందుకు వుంటారనే ప్రశ్నకి జవాబు చెప్పవలసిన అవసరం ఈ సందర్భంలో, మార్క్సిజానికి లేకపోయినా, ఈ ప్రశ్నకి మార్క్సిజం స్పష్టంగానే జవాబు చెప్పగలదు.

'చదువుకోవడం' అంటే ప్రకృతి శాస్త్రాలు మాత్రమే చదువుతారు. సమాజానికి సంబంధించిన విషయాల్ని సరిమైన దృక్పధంతో (మార్క్సిస్టు దృక్పధంతో) చదవడానికి వీలైన పరిస్థితి కాలేజీ చదువుల్లో

లేదు. వాళ్ళంతా, కోపికీ సంబంధించిన 'సామాజిక శాస్త్రం' చదవక పోవడంవల్ల. నిత్యజీవితంలో వుండే సమస్యలన్నీ ఈ సమాజాన్ని బట్టే పుడుతున్నాయనీ, వాటి పరిష్కార మార్గాలు కూడా ఈ సమాజంలోనే వున్నాయనీ. కాలేజీల్లోనూ, యూనివర్శిటీల్లోనూ ఎంతెంత చదువుకున్న వాళ్ళకీ కూడా తెలీదు. (తెలిసే అవకాశం లేదు.)

ప్రకృతి శాస్త్రాలేగానీ, సామాజిక శాస్త్రం తెలీకపోవడంవల్ల బూర్జువా పద్ధతిలో ఎంత చదువుకున్న వ్యక్తికైనా సంపూర్ణమైన భౌతిక దృక్పథం ఏర్పడదు. సమస్యల పరిష్కారం దేవుడే చెయ్యాలనే నమ్మకా లకి లొంగిపోతారు.

మరికొందరి విషయంలో — వాళ్ళు కోపికీ వర్గానికి చెందిన వాళ్ళుగానో, వాళ్ళ సానుభూతి పరులుగానో వుంటారు. దేవుడున్నాడనీ, అంతా దేవుడే కల్పిస్తున్నాడనీ చెప్పే సిద్ధాంతం వాళ్ళకు చాలా సౌఖ్యం గానూ, అవసరంగానూ కనపడి దాన్ని వాళ్ళు నమ్ముతూ ఇతరులచేత కూడా నమ్మించాలని చూస్తారు.

కాబట్టి, చదువుకున్న వాళ్ళల్లో కూడా మత మౌఢ్యం వుండటానికి కారణం కొందరిలో, సామాజిక విషయాల అజ్ఞానం అయితే, కొందరిలో సామాజిక విషయాల స్వార్థం. రెండూ కోపికీ వ్యవస్థనించే పుట్టుకొచ్చిన లక్షణాలే.

(5) "........నాస్తికులకు మార్క్సిజం తెలియనట్లు ఈమె బుకాయించ యత్నిస్తోందా ?" (పే. 34)

నాస్తికులకు మార్క్సిజం ఎంత తెలుసునో ఇంతవరకూ చక్కగానే రుజువైంది.

6)

నాస్తికులకు మార్క్సిజం తెలీదని రంగనాయకమ్మ బుకాయించ యత్నించడం కాదు, 'నాకు మార్క్సిజం తెలుసు'నని నాస్తికుడే బుకాయించ యత్నిస్తున్నాడు.

'నాకు మార్క్సిజం తెలుసునని సి. వి. ప్రకటించు కోవడమంటే, మార్క్సిజం తెలిసి కూడా దాన్ని అంగీకరించక, 'నాస్తిక సిద్ధాంతం తరుపునే నిలబడ్డ బూర్జువా భౌతికవాదిగా తనని తను ప్రకటించుకుంటున్నా దన్నమాట!

మార్క్సిజం తెలియకపోవడంవల్లనే ఇతర తప్పుడు సిద్ధాంతాలకు అకర్షితులై వున్నవాళ్ళని తప్పకుండా క్షమించవచ్చును. గానీ, మార్క్సిజం "క్షుణ్ణంగా" తెలిసికూడా (అది దోపిడీని నిర్మూలించి ప్రజలకు మేలుచేసే సిద్ధాంతమని తెలిసికూడా) దాన్ని స్వీకరించకుండా, పైగా దానికి ద్రోహం చేసే సిద్ధాంతాన్ని అంటిపెట్టుకూర్చున్న వ్యక్తిని క్షమించకూడదు. అలాంటి వ్యక్తి ప్రజలకు శత్రువేగాని, మిత్రుడు కాడు.

(6) "ఆంధ్రదేశంలోని మార్క్సిస్టు జ్ఞానపీఠానికి తాను అధిపతి నని ఈమె తలపోస్తోందా ?" (పే. 34)

ఇలాంటి ప్రశ్నే నేను సి. వి. ని అడగవచ్చును. "నాస్తిక జ్ఞాన పీఠానికి తనే అధిపతినని సి.వి. తలపోస్తున్నాడా ?" అని నే నడిగితే ?

సి. వి., తనమీద వచ్చిన విమర్శలకు మాత్రమే జవాబులు చెప్పి వూరుకోక, మిత్రా తరుపునా, జయగోపాల్ తరుపునా, "నాస్తిక యుగం" పత్రిక తరుపున కూడా తనే ఎందుకు మాట్లాడుతున్నాడు? తన పుస్తకానికి "హేతువాద నాస్తికోద్యమం" అని పేరుపెట్టి, నాస్తికోద్యమం అంతటి తరుపునా తానెందుకు మాట్లాడు తున్నాడు ?

"ఆంధ్రదేశంలోని నాస్తిక జ్ఞానపీఠానికి తనే అధిపతినని సి. వి తలపోస్తున్నాడా?" అని నేనడగ కూడదా?

కానీ, నేనలాంటి తెలివితక్కువ ప్రశ్న అడగను.

ఒక సిద్ధాంతాన్ని అంగీకరించే వాళ్ళెవరికైనా దాని తరుఫున మాట్లాడటానికి సంపూర్ణమైన హక్కు వుంటుంది. ఆ సిద్ధాంతం మీద వచ్చే విమర్శలకు జవాబులు చెప్పడమూ, ఆ సిద్ధాంతాన్ని సమర్థించడమూ ఆ సిద్ధాంతాన్ని ప్రచారం చెయ్యడమూ తమ బాధ్యతగా భావిస్తారు వాళ్ళు, ఆ బాధ్యత ఎవరో తెచ్చి నెత్తిన పెట్టింది కాదు. దాన్ని ఒక కర్తవ్యంగా. ఒక జీవితాదర్శంగా, ఒక సంతోషకరమైన కార్యంగా తీసుకుంటారు వాళ్ళు.

'నాస్తిక వాదం' తరుఫున మాట్లాడే బాధ్యత ఏ నాస్తికుడైనా తీసుకోవచ్చును.

'మార్క్సిజం' తరుఫున మాట్లాడే బాధ్యత ఏ మార్క్సిస్టయినా తీసుకోవచ్చును.

ఒక సిద్ధాంతం తరుఫున మాట్లాడే బాధ్యత ఆ సిద్ధాంతాన్ని అంగీకరించే వారెవరైనా తీసుకోవచ్చును. ఈ విషయంలో ఆధిపత్యం ప్రశ్న సీనియారిటీ ప్రశ్నా లేదు.

'నాస్తికవాదం' మీద నేను కొన్ని విమర్శలు చేసినప్పుడు ఆ విమర్శలు ఏ రకంగా వున్నాయనేది చూస్తావా. 'మార్క్సిస్టు పీఠానికి నువ్వు అధిపతివా' అని అడుగుతావా?

నేనుగాక ఈ పని ఇంకో మార్క్సిస్టు చేసివుంటే ఆ వ్యక్తిని కూడా సి. వి. "నువ్వు అధిపతివా?" అని అడగవలసిందే కదా ? మరి ఎవరిని ఈయన మార్క్సిస్టు పీఠానికి అధిపతిగా గుర్తించదలిచాడు ? ఈయన పేవమ్మేపే నాస్తికవాదాన్ని చూసి, "మార్క్సిజం కన్నా నాస్తిక వాదమే మిన్న" అని. అభినందించే దివాకోరు మార్క్సిస్టు ఎవరైవా

దొరికితే వాళ్లే మాత్రమే మార్క్సిస్టు పీఠానికి అధిపతిగా గుర్తిస్తాడు కాబోలు.

సిద్ధాంత చర్చని వొదిలేసి, పీఠాధిపత్యం ప్రశ్న లేవనెత్తిన సి.వి. అన్నిరకాలా దారి తప్పాడు.

(7) "....శృతిమించిన అహంకారం ప్రదర్శించడం పతనానికి దారి తీస్తుందని సవినయంగా ఈమెకు మనవిచేయ దలిచాను" (పే. 53)

ఇదే మరి నాస్తికుడి దుర్వంత్వం!

శృతిమించిన అహంకారం ప్రదర్శించే వాళ్లతో కూడా నాస్తికుడు 'సవినయంగానే' ప్రవర్తిస్తాడు! సవినయంగానే 'మనవి' చేసుకుంటాడు!

అదే, మార్క్సిస్టు అయితే, 'శృతిమించిన అహంకారం' ప్రదర్శించే వాళ్లని తన పదునైన విమర్శంతోటీ, తన విప్లవాత్మకమైన చర్చంతోటీ ఖండ ఖండాలుగా చీలేస్తాడు! అదీ తేడా!

సుందరయ్య గ్రంథాలయ
A.C. No....................
హైదరాబాద్-500 044.

# రంగనాయకమ్మ రచనలు

జానకి విముక్తి (3 భాగాలు)
అంధకారంలో....
స్వీట్ హోమ్ (2 భాగాలు)
చదువుకున్న కమల
ఇదే, నా న్యాయం!
రచయిత్రి
స్త్రీ
కూలినగోడలు
బలిపీఠం
పేకమేడలు
స్పార్టకస్ (నవలా పరిచయం)
టామ్ మామ ఇల్లు ( " )
స్వేచ్ఛాపథం ( " )
అండాలమ్మగారు, పల్లెటూరు
చుట్టాలు
అమ్మ
పెళ్ళానికి ప్రేమలేఖ

ప్రేమ ప్రేమని ప్రేమిస్తుంది
తెరవెనక
అనితరసాధ్యుడు
రామాయణ విషవృక్షం (3 భాగాలు)
నాస్తికత్వం-ఒకపరిశీలన
నాస్తికవాదం, హేతువాదం, నవ్యమానవవాదం
నీడతోయుద్ధం
చలం సాహిత్యం
యజ్ఞం కథమీద 2 వ్యాసాలు
శాస్త్రీయ దృక్పథం
(కొన్ని ప్రశ్నలూ, జవాబులూ)
స్త్రీ స్వేచ్ఛ
తులసిదళంకాదు, గంజాయిదమ్ము
మార్క్స్ "కాపిటల్" పరిచయం (4 భాగాలు)
తీగలాగారు, డొంకంతా కదిలింది!


వివరాలకూ, ప్రతులకూ

అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్ - విజయవాడ-2